'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణ ఆకాంక్షల సభ



వద్దిరాజు రవిచంద్ర

25 ఏండ్ల బీఆర్ఎస్ రజతోత్సవ ఉత్సవాలన్నవి ఒక రాజకీయ పార్టీ తనకు తాను జరుపుకొనే సంబురాలు మాత్రమే కావు. అందులో తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పేగుబంధాలతో కలగలసిన ఈ నేల అస్తిత్వం ఉంది. తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ జెండాను విశ్వవీధుల్లో ఎగురవేసిన ఖ్యాతి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. తెలంగాణ అస్తిత్వాన్ని స్వరాష్ట్ర ఉద్యమంగా కొనసాగించటమే గాక రాష్ట్రాన్ని సాధించటం, సాధించిన రాష్ట్రాన్ని తీర్చిదిద్దటంలో కూడా బీఆర్ఎస్ పాత్ర ముఖ్యమైనది.



స్వరాష్ట్ర ఉద్యమాన్ని కదం తొక్కించి స్వరాష్ట్ర సాధనను విజయతీరాలకు చేర్చి, స్వరాష్ట్రంలో స్వయంగా తానే పాలనా పగ్గాలు చేపట్టి తెలంగాణ పునర్నిర్మాణాన్ని చేపట్టిన ఖ్యాతి దార్శనిక నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే దక్కుతుంది. తెలంగాణ స్వరాష్ట్ర సాధకుడిగా, జయుడిగా, అజేయుడిగా, ఒకే ఒక్కడిగా, తెలంగాణ ఆత్మబంధువుగా చరిత్రలో చెదిరిపోని స్థానం కేసీఆర్‌దే. బీఆర్ఎస్ వ్యవస్థాపకునిగా దార్శనిక ఆలోచనలతో జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేసిన చరిత్ర కేసీఆర్‌ది. అందుకే ఆయనను 'దటీజ్ కేసీఆర్' అని గత కాలమే ఇష్టంగా రికార్డు చేసింది.

మతాలు, కులాలు, వర్గాల పేరుతో ప్రజలు చీలిపోవచ్చు, కొందరు కుల అస్తిత్వం కోసమే రాజకీయాలు చేస్తూ జెండాలు పట్టవచ్చు. తమ కులం అధికారంలోకి రావాలని ఆధిపత్య, అగ్రకులాలు పోటీ పడటం గత 80 ఏండ్లుగా దేశ రాజకీయాల్లో చూస్తూనే ఉన్నాం. అందుకు అవిభక్త ఆంధ్రప్రదేశ్, ఇప్పటి రెండు తెలుగు రాష్ట్రాలు అతీతమేమీ కాదు. తెలంగాణ రాష్ట్రానికి మాత్రం అస్తిత్వ, ఆత్మగౌరవాన్ని తెచ్చిపెట్టింది మాత్రం బీఆర్ఎస్సే. రాష్ట్రాన్ని ఇచ్చింది తామేనని కాంగ్రెస్ క్లయిమ్ చేసుకోవటానికి విఫలయత్నం చేసింది. కానీ, తెలంగాణ ప్రజలు దాన్ని ఒప్పుకోలేదు. పైగా 1969 ఉద్యమాన్ని నెత్తురుటేర్లల్లో ముంచింది.. మలిదశ ఉద్యమకాలంలో ఎన్నెన్నో కష్టనష్టాలు పడటానికి, వందలాది మంది యువత ఆత్మబలిదానాలు చేసుకోవటానికి మొదటి ముద్దాయిగా బోనెక్కవలసింది కాంగ్రెస్ పార్టీనే. ఆనాటి సీమాంధ్ర పాలకులు, పార్టీలుగా కాంగ్రెస్, టీడీపీ.. తెలంగాణ అస్తిత్వ ఉద్యమంపై చేయని దాడిలేదు, పెట్టని హింసలేదు. అణచివేతలతో నిత్య నిర్బంధాలను ప్రయోగించారు.

> తెలంగాణను తీరొక్క హింసలకు గురిచేసినవాళ్లు గత చరిత్రను మరిచి ఇప్పుడు గొంతు మార్చి మాట్లాడితే చరిత్ర క్షమించదు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమ జెండా పట్టి నిలిచిన చరిత్ర బీఆర్ఎస్‌దే. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ గొంతుకతో సీమాంధ్ర పార్టీల మెడలు వంచి ఉద్యమ స్వరాన్ని వినిపించింది బీఆర్ఎస్సే. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న సకల అనర్థాలకు ఏ వర్గం, ఏయే పార్టీలు కారకులో విప్పి చెప్పింది బీఆర్ఎస్సే.

తెలంగాణను ఎన్‌కౌంటర్ల నెత్తుటి ముద్దచేసింది ఎవరు? 'ఇందిరమ్మ సోషలిజం ఎందుకొచ్చిందిరో ఇంద్రవెల్లిలోన వందమందిని మింగిందిరో' అని కవులు కట్టిన పాటలు ఎవరిమీద వచ్చాయి? 'నాగలిపట్టిన రైతు చేతికో రైఫిలిచ్చిందిరో నాయనా' అని పాటలు పుట్టడానికి కారణమెవరు? ఏయే పార్టీలనేది ఈ సందర్భంగా చూడాలి. తెలంగాణలో చీకటి పడితే బయటకు రాలేని స్థితికి కారకులెవరు? తెలంగాణకు ఉద్యమ సమయంలోనే ఊపిరాడే స్థితిని తీసుకువచ్చింది మలిదశ తెలంగాణ అస్తిత్వ ఉద్యమం. ఈ అస్తిత్వ ఉద్యమ జెండా చేతబట్టి గర్జించిన మహాశక్తి కేసీఆర్.

రాష్ట్రం వచ్చాక కొన్ని వర్గాలకు అధికారం చేజారిపోవచ్చు. తెలంగాణలో పాతుకుపోయిన పెత్తందారీ వ్యవస్థ పునాదులు కదలి ఉండవచ్చు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వేగవంతంగా పునర్నిర్మాణం జరిగింది. నెర్రెలు బారిన నేలకు నీళ్లందింది. చెరువులు మత్తళ్లు దుంకాయి. కాళేశ్వర జల గంగ వందల కిలోమీటర్లు ప్రవహించి బీడు నేలలను సస్యశ్యామలం చేసింది. తెలంగాణ దేశానికి ధాన్యాగారం అయ్యింది. దళితబంధు, బీసీబంధులు వచ్చాయి. 33 జిల్లాలతో పాలన ప్రజల ముంగిళ్ల దాకాపోయింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇంటింటికి నల్లా నీళ్లు, 1100 గురుకులాల ద్వారా లక్షలాదిమంది బడుగుల బిడ్డల చదువులు, ఒకటారెండా వందల పథకాలు కేసీఆర్ ఆలోచనల నుంచి జనించి, ఆచరణ రూపుదాల్చాయి. 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ అన్ని రంగాల్లో శిరసెత్తుకుని నిలిచింది. ఇది చరిత్ర. దీన్నెవ్వరూ చెరిపేయలేరు.

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. బీఆర్ఎస్ ఓడింది. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ప్రజలు గెలుపోటముల నుంచి తిరిగి పాఠాలు తీసుకుంటారు. గడిచిన 25 ఏండ్ల కాలంలో ఒక రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ వేసిన అడుగులు, నడిచిన నడత, తెలంగాణను ముందుకు నడిపించిన తీరునంతా సింహావలోకనం చేసుకోవటం కోసమే బీఆర్ఎస్ రజతోత్సవాలను జరుపుకొంటుంది. తెలంగాణ నేలలో నిర్మితమైన గంగాజమునా తెహజీబ్ సంస్కృతిని భద్రంగా కాపాడి రాబోయే తరాలకు అందించటంలో బీఆర్ఎస్ పాత్ర కీలకమైంది. రైతాంగానికి ఆసరాగా నిలిచి, వారిని ఆదుకున్న పార్టీ బీఆర్ఎస్. ఇపుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా బీఆర్ఎస్ చేసిన పనులను మరింత ముందుకు తీసుకుపోవటమే చేయాలి. కానీ, కాంగ్రెస్ శూన్య హస్తాలను చూపుతున్నది.

అస్తిత్వ ఉద్యమంపై ఆనాటి ఉద్యమ కాలంలో నిప్పులు పోసినవాళ్లే రూపాలు మార్చుకుని స్వరాష్ట్రంలో కూడా కుట్రలు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై విషంగక్కారు. అధికారాన్ని కోల్పోయిన పాత పెత్తందార్లు తమ పీఠాలు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌పై చేయని దుష్ప్రచారం లేదు. తాత్కాలికంగా ఎన్నికల్లో గెలిచినంతమాత్రాన తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తే మాత్రం తెలంగాణ సమాజం తిరగబడుతుంది.

వరంగల్‌లో జరగబోయే రజతోత్సవ సభ బీఆర్ఎస్ కార్యకర్తల్లోనే కాదు, మొత్తం తెలంగాణ సమాజానికే ప్రేరణ. బీఆర్ఎస్ రాజకీయ పార్టీగానే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణాన్ని కొనసాగించే మిషన్‌గా చూడాలి. తెలంగాణ సమాజ అస్తిత్వంతో పెన వేసుకున్న బీఆర్ఎస్‌ను కదిలించటం ఎవరి తరం కాదు. ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చే సభగా కోట్లాది మంది ఎదురుచూస్తున్నారు.

(వ్యాసకర్త: రాజ్యసభ సభ్యులు)

ఒక కేసీఆర్..ఎన్నో విజయాలు



షేక్ ఫరీజ్ మొహియుద్దీన్
96661 74738

తెలంగాణ విధాత, అభివృద్ధి ప్రదాత, ఉద్యమ సారథి కేసీఆర్ ప్రస్థానం సముద్రపు కెరటం లాంటిది. కాలం, సమయం, విధి విషమ పరీక్ష పెట్టిన ప్రతీసారి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ ఆయన గెలుస్తూ వచ్చారు. ప్రత్యర్థుల వ్యూహాలను ఛేదిస్తూ, ప్రతివ్యూహాలు రచిస్తూ, రాజకీయ ప్రత్యర్థుల పద్మవ్యూహాలను పటాపంచలు చేస్తూ వచ్చారు. అది ఉద్యమమైనా, ఎన్నికలైనా, ఉపఎన్నికలైనా, పరిపాలనలో అయినా, సంక్షేమ పథకాల అమలులో అయినా.. పాతికేండ్ల ప్రస్థానంలో కేసీఆర్ ఎన్నడూ వెరవలేదు, వెనకడుగు వేయలేదు.

బీఆర్ఎస్ ఆవిర్భవించిన 2001 నుంచి నేడు 2025 వరకు గులాబీ పార్టీపై ప్రత్యర్థులు, తెలంగాణ వ్యతిరేకులు చేసిన కుట్రలు అన్నీఇన్నీ కావు. పురిట్లోనే పాడెక్కించాలని చేయని ప్రయత్నమంటూ లేదు. 'మఖలో పుట్టి పుబ్బలో పోతుంద'ని విషప్రచారం చేశారు. గులాబీ పార్టీ తీరం చేరదని, మధ్యలోనే పుట్టి మునిగిపోతుందని దుష్ప్రచారం చేశారు. పదవుల కోసమే కేసీఆర్ తెలంగాణవాదాన్ని ఎత్తుకున్నారని, రాజకీయ ఉనికి కోసమే ఉద్యమ జెండా పట్టారని కుట్రల కూతలు కూశారు. ఆంధ్రా పాలకులతో పాటు తెలంగాణలోని చెంచాలు కూడా ఇదేవిధంగా కుయుక్తుల కథనాలను వండివార్చారు. తెలంగాణ సానుభూతిపరులు గులాబీ పార్టీలో చేరకుండా, పార్టీలో ఉన్నవారు ఉద్యమ జెండా ఎత్తకుండా టీడీపీ ఏలికలు, పీలికల కాంగ్రెస్ చేయని కుతంత్రం లేదు. కానీ, కేసీఆర్ వాటన్నింటినీ పటాపంచలు చేశారు.

> పురిట్లోనే పోతదన్న పార్టీతోనే తెలంగాణకు పురుడుపోయించారు. దిక్కూమొక్కు లేక నడిసంద్రంలో చిక్కుకున్న తెలంగాణను వాయుగుండాలు, తుఫాన్లను దాటుకొని తీరానికి చేర్చారు. పదవుల కోసమే ఉద్యమ జెండా పట్టారన్న అనుమానాలను ఆదిలోనే బొందపెట్టారు. పదవులను పట్టుకొని ఊగిసలాడే రాజకీయ నాయకులను విస్మయపరుస్తూ.. పదవులను త్యజించడం, అధికార పీఠాన్ని త్యాగం చేయడాన్నీ తమ అదృష్టమనుకునే స్థాయికి గులాబీ సైన్యాన్ని తీసుకొచ్చారు. ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ సాధించాలన్న లక్ష్యం ముందు తమ పదవులు గడ్డి పోచలేనని సహచరులకు నూరిపోశారు.

ఉద్యమ సారథి చెప్పడమే ఆలస్యం క్షణాల్లో పదవులకు రాజీనామా చేసేలా, జేబులోనే రాజీనామా లేఖలను పెట్టుకొని తిరిగేలా గులాబీ దళాన్ని తయారు చేశారు. రాజీనామాలను అస్త్రాలుగా, ఎన్నికలను శస్త్రాలుగా సంధించారు. తెలంగాణ ఇస్తానని నమ్మించి గొంతు కోసిన కాంగ్రెస్‌కు ఉపఎన్నికల్లో గెలుపుతోనే కేసీఆర్ సమాధానం ఇచ్చారు.

ప్రస్తుత రాజకీయాల్లో ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం గాని, సినీ నేపథ్యం గాని లేకుండా సొంతగా ఒక పార్టీని స్థాపించి, ప్రజా ఉద్యమాలు నడిపి, ప్రజల మన్ననలతో అధికారం చేపట్టి ముఖ్యమంత్రి అయినవారు తెలుగు రాజకీయాల్లో కేసీఆర్ ఒక్కరే కనిపిస్తారు. ఆ మాటకొస్తే యావత్ దక్షిణ భారతదేశంలో డీఎంకే వ్యవస్థాపకులు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై తర్వాత కేసీఆర్ మాత్రమే ఉంటారు. అందులోనూ అన్నాదురైకి ద్రవిడ ఉద్యమ నేపథ్యం మాత్రమే ఉండగా.. కేసీఆర్‌ది 60 ఏండ్ల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. నాటి చెన్నారెడ్డి నుంచి మొదలుకొని నిన్న మొన్నటి జానారెడ్డి, చిన్నారెడ్డి వరకు ఎంతో మంది మూణ్నాలుగు నెలలు ఉద్యమాలు నడిపి, ఆ తర్వాత పదవులకో, ప్రలోభాలకో లొంగిపోయి ఉద్యమాన్ని తాకట్టు పెట్టారు. కేసీఆర్ ఒక్కరే పదవులను త్యాగం చేసి, చావు నోట్లో తలపెట్టి తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చారు. అందరూ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు అయితే, కేసీఆర్ మాత్రం రాష్ట్రాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రి అయ్యారు.

14 ఎండ్ల పాటు సాగిన ఉద్యమంలో అడుగడుగునా ఆటంకాలే. కాలు బయట పెట్టాలన్నా ఆంక్షలే. పార్టీ సమావేశాలకు అనుమతులు ఇవ్వని పరిస్థితి. ఆఖరికి కళాకారుల ధూం ధాం ప్రోగ్రాంలకు నిర్బంధాలే. పెన్ డౌన్ చేసే తెలంగాణ ఉద్యోగులపై ఆంక్షలు, విద్యార్థులపై లాఠీ చార్జిలు, గులాబీ సేనపై అక్రమ కేసులు, నిర్బంధాలు.. ఒక్కటేమిటి ఇలా ఎన్నో ఆటుపోట్లు.

పురిట్లో ఉండగానే తెలంగాణ గొంతు నులిమి చంపేయాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. తెలంగాణ వస్తే చీకటిమయం అవుతుందని, నక్సలైట్ల రాజ్యంగా మారుతుందని సమైక్య పాలకులు భయాందోళనలు సృష్టించారు. ఉద్యమకారుల త్యాగాలకు తోడు, కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెచ్చిన తెలంగాణ ప్రకటనను కుట్రలు చేసి వెనక్కి తీసుకునేలా చేశారు. అయినా కేసీఆర్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. కొత్త మార్గాలను శోధించి, తెలంగాణను సాధించారు.



తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సమైక్యాంధ్ర నాయకుల కుట్రలు ఆగలేదు. తెలంగాణలోని తాబేదార్ల సాయంతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి తెలంగాణను అస్థిరపరిచేందుకు చంద్రబాబు కుట్ర చేశారు. తెలంగాణ వాళ్లకు పాలన చేతకాదని నిరూపించేందుకు కుటిల యత్నం చేశారు. ఆ పన్నాగాన్ని పసిగట్టిన కేసీఆర్.. ఎత్తుకు పైఎత్తు వేయడంతో చంద్రబాబు తోకముడిచి పారిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2018లో తెలంగాణ ఎన్నడూ చూడని కొత్త కుట్రకు తెరలేచింది. బీఆర్ఎస్‌ను మట్టుబెట్టేందుకు, తెలంగాణను దోచుకునేందుకు బద్ధ శత్రువు చంద్రబాబుతో కాంగ్రెస్ జతగట్టింది. నాడు చంద్రబాబు దగ్గర అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులు కట్టుకొని నిలబడి తెలంగాణ అస్తిత్వాన్ని పరాయివాళ్ల ముందు తాకట్టు పెట్టారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సహించలేని కేసీఆర్.. తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబును పొలిమేరల వరకు తరిమికొట్టారు. టీడీపీని పూర్తిగా బొందపెట్టారు.

పాతికేండ్ల కిందట టీఆర్ఎస్‌పై మొదలైన కుట్రల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉన్నది. ఢిల్లీలో బద్ధ శత్రువులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గల్లీలో కలిసిపోయి బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాయి. ఇంతటితో ఆగకుండా బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తుడిచిపెట్టాలని కుట్రలు పన్నాయి. 'మనం మనం కొట్లాడుకోవడం కాదు, అక్కడక్కడున్న బీఆర్ఎస్‌ను పూర్తిగా బొందపెట్టాలి' అని బండి సంజయ్ గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు పిలుపివ్వడమే అందుకు నిదర్శనం. ఇలాంటి కుట్రలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు. ఈ పాతికేండ్ల ప్రస్థానంలో ఇలాంటి కుట్రలెన్నింటినో కేసీఆర్ చూశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఆరు నెలలకే గోడకు కొట్టిన బంతిలా బీఆర్ఎస్ బౌన్స్ బ్యాక్ అయింది. ఇప్పుడు బీఆర్ఎస్ రజతోత్సవ వేళ ఊరువాడా కేసీఆర్‌ను తలుచుకుంటున్నది. ప్రతి ఇంట గులాబీ జెండా రెపరెపలాడుతున్నది.

> ఎన్నో కష్టాలను, దుఃఖాలను అధిగమించి, కుట్రలు, కుతంత్రాలను బీఆర్ఎస్ ఛేదించింది. తెలంగాణ వస్తే చీకటి మయమవుతుందని ఉమ్మడి పాలకులు చెప్పారు. తెలంగాణ వచ్చాక దాన్ని నిజం చేసేందుకు కుట్రపూరితంగా సీలేరు విద్యుత్తు ప్రాజెక్టును గుంజుకున్నారు. ఇలాంటి ఎన్నో కష్టాలను పంటి బిగువున దాచిపెట్టుకొని కేసీఆర్.. రెండేండ్లలోనే ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకొని 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత కరెంటు ఇచ్చారు. తెలంగాణను పెట్టుబడులకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా కేటీఆర్ మార్చారు.

ఇలా ఒకటా, రెండా సవాళ్లు ఎదురైన ప్రతిసారి కేసీఆర్ వాటిని అధిగమిస్తూ, గెలుస్తూ వస్తున్నారు. కేసీఆర్ గెలిచిన ప్రతిసారి, తాను గెలవడమే కాకుండా తెలంగాణ ప్రజలను కూడా గెలిపించారు. ఒక మాటలో చెప్పాలంటే కేసీఆర్ గెలుపులో తెలంగాణ ప్రజల గెలుపు ఉన్నది. అందుకే ప్రజలు నేడు తాము కాంగ్రెస్ 420 హామీలను చూసి మోసపోయి గోసపడుతున్నామని, సమస్యలు పరిష్కారమై తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నిండాలంటే కేసీఆర్ సారే రావాలని కోరుకుంటున్నారు. ప్రతి ఊరి నుంచి భారీ సంఖ్యలో సభకు తరలివెళ్లి గతంలో ఇదే వరంగల్‌లో జరిగిన మహా గర్జన మాదిరిగా విజయవంతం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే ముమ్మాటికీ బీఆర్ఎస్ రజతోత్సవం.. తెలంగాణ విజయోత్సవం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)



కెలకటి వెలుగులో జన జాతర



బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ అంటే ఒక సాధారణ రాజకీయ సభ కాదు. అది తెలంగాణ ప్రజల మనస్సుల్లో కేసీఆర్ పట్ల ఉన్న గాఢమైన విశ్వాసానికి ప్రతిబింబం. ఈ సభ ప్రాంగణంలో ప్రజల ఊపిరి, ఆశ, ఆరాధన ప్రతీ స్వరంలో వినిపిస్తుంది. ఈ జన సమీకరణ చూస్తుంటే 10 లక్షల మందిని దాటి, బాహుబలి సినిమాలో చూసిన మహా జనసందోహం నిజంగా పునరావృతం అవుతుందనిపిస్తుంది. ఇది కుంభమేళాను మించిపోయే దృశ్యం. ఇటువంటి సమీకరణాన్ని చిత్రీకరించడానికి డ్రోన్ కెమెరాల శక్తికే సవాలు. ఇది కేవలం ఓ సభ కాదు, ఇదొక నాయకుడిపై ప్రజల ప్రేమకు, విశ్వాసానికి ప్రతిరూపం.

పాతికేండ్లలో ఒకసారైనా చూడలేని విప్లవాత్మక సంఘటన ఇది. కరోనా టైంలో వ్యాక్సిన్ కన్నా ముందు ప్రజల పాకటిలో కేసీఆర్ ఏమంటారు? అనే చింతే ఉన్నది. ఇప్పుడా స్థాయిలోనే కాంగ్రెస్ అనే కొత్త ప్రమాదం వచ్చినప్పుడు ప్రజల చూపు మళ్లీ కేసీఆర్ వైపే. ఇదీ నాయకత్వంపై నమ్మకం. అవిశ్రాంతంగా పనిచేసిన నాయకుడిపై కృతజ్ఞత.

ఇక్కడి విశేషం ఎన్నికల సమయం కాదు, ఉద్యమాలు లేవు, కుల మతాలతో సంబంధం లేని సభ అయినా లక్షల మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడం దేశ చరిత్రలోనే అరుదైన ఘట్టం. ఇది ఒక్క కేసీఆర్ ఒరవడి వల్లే సాధ్యమైంది. ఆయన లేకుండా తెలంగాణను ఊహించలేమనే భావం ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నది. ఈ మహా సభకు నేనూ ఓ వీక్షకుడిగా హాజరవడం, ఆ నాయకుడిని ప్రత్యక్షంగా చూడటం, ఆయన మాటలు వినడం నా జీవితంలో ఒక గౌరవ గడియగా నిలిచిపోతుంది. జై తెలంగాణ, జై కేసీఆర్.

- నరేష్ మైనల, (కేటీఆర్ సేన, వరంగల్ జిల్లా అధ్యక్షుడు)

తెలంగాణ స్వాభిమాన సభ



ఉద్యమ రథసారథి కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో ఆయన అభిమానులందరినీ ఒక్కతాటిపైకి తీసుకవచ్చి గత పన్నెండేండ్లుగా మేం బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖను బలోపేతం చేస్తున్నాం. ఇందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా 52 శాఖలను స్థాపించాం. భారత దేశంలోని ఏ ఇతర రాజకీయ పార్టీకి ఇంత విస్తృతమైన ఎన్ఆర్ఐ శాఖల్లేవు. అయితే, ఓరుగల్లు సభ ద్వారా బీఆర్ఎస్ తన భవిష్యత్తును మరింత బలోపేతం చేసుకోవడమే కాకుండా, తెలంగాణ ప్రజలకు తామే నిజమైన ప్రతినిధులమని నిరూపించనున్నది. ఈ రజతోత్సవ సభ ఒక రాజకీయ సమావేశం మాత్రమే కాదు; ఇది తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, రాష్ట్ర హక్కుల కోసం బీఆర్ఎస్ చేస్తున్న సంకల్ప ప్రకటన. గత 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణను విఫల రాష్ట్రంగా మార్చిన తరుణంలో, ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నది.

ఓరుగల్లు సభకు ఎన్ఆర్ఐ శాఖ భారీ సంఖ్యలో సభ్యులను ఆహ్వానిస్తున్నది. లక్షలాది మంది ప్రజలు, కార్యకర్తలు, ఎన్ఆర్ఐ సభ్యులు ఈ సమావేశంలో భాగం కానున్నారు. ఈ సభ స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా రజతోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. మొదటగా అమెరికాలోని డల్లాస్‌లో జూన్ ఒకటో తారీకు కేటీఆర్ ముఖ్య అతిథిగా, మిగతా బీఆర్ఎస్ నాయకులతో పెద్ద సభను నిర్వహించనున్నాం. ఈ సభలను ఈ సంవత్సర కాలం పాటు యూకే, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, గల్ఫ్ దేశాలతో పాటు మలేషియాలలో జరుపుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం.

2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 16 నెలలుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నది. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలని ప్రకటించి, వాటిని అమలుచేయడంలో విఫలమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఆరోపించిన కాంగ్రెస్, తాము అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.1.52 లక్షల కోట్ల కొత్త అప్పులు తెచ్చింది. ఈ అప్పులు అభివృద్ధి పనుల కోసం కాకుండా, రోజువారీ ఖర్చులు, రాజకీయ లబ్ధి కోసం వినియోగిస్తున్నారని విమర్శలు వస్తుండటమే విడ్డూరం. అందుకే, రజతోత్సవ సభలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడనున్నది. మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేయనున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖలు ఈ సభను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ భవిష్యత్తును బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించాలి.

- మహేష్ బిగాల

(వ్యాసకర్త: గ్లోబల్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్)

పైలా పచ్చీస్!

యవ్వనం ఉరకలెత్తుతున్నది
ఒకింత విరామం తర్వాత
పోరుబాట విచ్చుకుంటున్నది!

అబద్ధాల ఉచ్చులు
పటాపంచలవుతున్న వేళ
విమోచన దండొకటి కదులుతున్నది!

దశాబ్దం పాటు
ఏ కడుపూ కాలలేదు
ఏ కంటిలో నీరు కారలేదు!

ఆశలూ ప్రలోభాలూ
కళ్ళముందే ఆవిరవుతున్న వేళ
జనాగ్రహం రెక్కలు విప్పుతున్నది!

అలికి పూసిన కాడ
గుడ్డు పెట్టని గువ్వ
ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే!

యుద్ధం ఎప్పుడైనా రాని
మరో విమోచనం కోసం
మనమిప్పుడు సిద్ధమవ్వాల్సిందే!

పంచభూతాల కన్నా
శక్తివంతం జనాభిప్రాయం
రగిలిస్తే చాలు వెలుగిస్తది!

ఓడి గెలిచిన వారెవరో
గెలిచి ఓడిన వారెవరో
జనాలకు అప్పుడే తెలిసిపోయింది!

పడిలేచిన కెరటాలే
తీరాలను ముద్దాడేది
జయ పతాకాలనెగరేసేది!!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

తెలంగాణ కోసం మళ్లీ గొంతెత్తుదాం!



మద్దెల సందీప్
95503 12564

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి మొదలుకొని మలిదశ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ధీరత్వం, అమరత్వం అన్ని కలగలిపి ముందుకు తీసుకుపోయింది పాట మాత్రమే. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు మొదలుకొని నేటి తెలంగాణ పల్లెల్లో పాటకు ప్రాణం పోస్తున్న యువ గాయకుల వరకు తెలంగాణ ప్రజల బాధలను మటుమాయం చేసేందుకు కృషిచేసినవారే. నాడు 'బండెనక బండి కట్టి ఏ బండ్ల వోతవు కొడుకో' అన్న పాట మొదలుకొని మలిదశ ఉద్యమంలో వేల పాటలు తెలంగాణ భూమిని జ్వలింపచేశాయి. లక్షల గొంతుకలు స్వరాష్ట్రం కోసం నినదించాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని పల్లెపల్లెకు, గుండెగుండెకు తీసుకుపోయి ఉద్యమ భావజాలాన్ని విస్తరించిన ప్రధాన ప్రక్రియ పాట. పాటలు సామాన్య జనాన్ని ప్రభావితం చేసి, ఉద్యమానికి బలాన్ని చేకూర్చాయి.

'రాజిగ ఓరి రాజిగా..!', 'అమ్మా తెలంగాణమా ఆకలికేకల రాజ్యమా..!', 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా..!', 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం..!', 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ.. నా తెలంగాణ..!', 'రేలా దూలా తాలెల్లాడే నేల నా తెలంగాణ..!', 'పల్లె కన్నీరు పెడుతుందో..!', 'సంతా మావురి సంత..!', 'వీరులారా వందనం విద్యార్థి... అమరులారా వందనం..!', 'ఆడుదాం డప్పుల్లా దరువెయ్యరా పల్లె తెలంగాణ పాట పాడరా..!', 'నిన్ను విడిచి ఉండలే నమ్మా..!', 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా రక్తబంధం విలువ నీకు తెలియదురా..!', 'ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా వీర తెలంగాణమా...!' వంటి వేల పాటలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. పల్లె నుంచి పట్నం వరకు పాటలతో తెలంగాణ రాష్ట్రమే కావాలని ఊగిపోయింది. సమైక్య పాలనకు సవాల్‌గా మారింది. రైతన్నల వెతలు, వ్యవసాయ కూలీల కష్టాలు, కార్మికుల కన్నీటి బాధలు, మహిళల ఆకాంక్షలు, ఫ్లోరైడ్ వ్యతిరేక పోరాటాలు, సాగునీటి సాధన.. ఇట్లా ప్రతి వర్గం కోసం గొంతుకై నిలిచారు తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు.

ప్రజాగాయకుడు గద్దర్, బెల్లి లలిత, గోరటి వెంకన్న, విమలక్క, డప్పు రమేశ్, గూడ అంజన్న, అందెశ్రీ, జయరాజు, అరుణోదయ రామారావు, వందేమాతరం, శంకర్, సారంగపాణి, వరంగల్ శ్రీను, ఎర్ర ఉపాలి, కలేకూరి, రసమయి బాలకిషన్, పయిలం సంతోశ్, పుష్ప, సాయిచంద్, ఏపూరి సోమన్న, కోదారి శ్రీను, అంబటి వెంకన్న, విజయ, రమాదేవి, అంతడ్పుల నాగరాజు, నేర్నాల కిశోర్, మిట్టపల్లి సురేందర్, దరువు ఎల్లన్న, దరువు అంజన్న, గర్జన, దేవరకొండ భిక్షపతి, వడ్లకొండ, శంకర్, దేవన్న, తిరుపతి, అశ్విని, మధుప్రియ, మానుకోట ప్రసాద్, సంతోష్ వంటి వందల మంది కళాకారులు కాలుకు గజ్జె కట్టి తెలంగాణ ప్రజల అరవై ఏండ్ల ఆకాంక్ష కోసం గొంతెత్తి నినదించారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుతో తెలంగాణ పాటకు ఒక అండ దొరికింది. ఒకపక్క రాజకీయ పార్టీగా కేంద్రంపై కేసీఆర్ చేసిన ఒత్తిడి.. ప్రజలను ఏకం చేసేందుకు కళాకారుల పాటలు.. వెరసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించేలా చేశాయి.



స్వరాష్ట్రం కోసం గొంతెత్తిన తెలంగాణ కళాకారుల రుణం తీర్చుకోవాలన్న ఉద్దేశంతో కేసీఆర్.. సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి, 500 మందికిపైగా కళాకారులకు సాంస్కృతిక సారథులుగా నియమించారు. రసమయి బాలకిషన్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి 'సారథి'కి చైర్మన్‌గా నియమించారు. గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్‌లకు శాసనమండలి సభ్యులుగా అవకాశం కల్పించారు. సాయిచంద్‌ను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇంకా చాలామందికి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించారు. పాటల గొంతుకైన బెల్లి లలితను ముక్కలు చేసిన, మారోజు వీరన్నను బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన, తొర్రూరు అయిలన్నను అంతం చేసిన సందర్భంలో కేసీఆర్.. కళాకారులు, కవులను కాపాడుకున్నారు.

పదేండ్ల తర్వాత మళ్లీ సమైక్య పాలన నాటి ఆనవాళ్లు పునరావృతం అవుతున్నాయి. వివక్ష చూపే పాలన పోవాలని నినదించిన గొంతులు మళ్లొక్కసారి ప్రజల కోసం పోరాడుతున్న కేసీఆర్‌కు అండగా నిలువాల్సిన సందర్భం ఆసన్నమైంది. తెలంగాణ వనరుల రక్షణ కోసం ఎలాగైతే సమైక్యవాదులపై పోరాటం చేశామో.. సొంత రాష్ట్రంలో ద్రోహానికి ఒడిగడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి సిద్ధమవుదాం! తెలంగాణ రక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ చేసే పోరాటంలో భాగమవుదాం!

(వ్యాసకర్త: గాయకులు)

నేటి మ్యాచ్ | కోల్‌కతా X పంజాబ్ రా.7.30 నుంచి | వేదిక కోల్‌కతా

చెపాక్‌లో చెన్నైపై తొలి విజయం

రైజర్స్ అదుర్స్

మెరిసిన హర్షల్, ఇషాన్, కమిందు

చెన్నై: వరుసగా రెండు ఓటముల తర్వాత ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) తిరిగి విజయాల బాట పట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంతితో పాటు బ్యాట్‌తోనూ సమిష్టిగా రాణించిన సన్‌రైజర్స్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదుచేసింది. చెపాక్‌లో చెన్నైపై సన్‌రైజర్స్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం. లో స్కోరింగ్ మ్యాచ్‌లో సీఎస్‌కే నిర్దేశించిన 155 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 44, 5 ఫోర్లు, 1 సిక్స్), కమిందు మెండిస్ (22 బంతుల్లో 32 నాటౌట్, 3 ఫోర్లు) రాణించారు. మొదట హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో చెన్నై.. 19.5 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌట్ అయింది. హర్షల్ పటేల్ (4/28), పాట్ కమిన్స్ (2/21), జయదేవ్ ఉనద్కత్ (2/21) ఆతిథ్య జట్టును భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 42, 1 ఫోర్, 4 సిక్సర్లు), అయుష్ మాత్రె (19 బంతుల్లో 30, 6 ఫోర్లు) సీఎస్‌కేను ఆదుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది ఆడిన 9 మ్యాచ్‌లకు గాను ఏడో ఓటమి. ఈ ఫలితంతో ప్లేఆఫ్ రేసు నుంచి ఆ జట్టు అధికారికంగా నిష్క్రమించినట్టే.

మెరిసిన ఇషాన్, మెండిస్

స్వల్ప ఛేదనలో హైదరాబాద్ ఇన్నింగ్స్ కూడా చెన్నై మాదిరిగానే సాగింది. ఖలీల్ రెండో బంతికే ప్రమాదకర అభిషేక్ శర్మను ఔట్ చేసి సీఎస్‌కేకు తొలి బ్రేకిచ్చాడు. నాలుగు బౌండరీలతో కుదురుకున్నట్టే కనిపించిన ఇంపాక్ట్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ (19).. అన్షుల్ ఆరో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయి మళ్లీ నిరాశపరిచాడు. నాలుగో స్థానానికి ప్రమోట్ అయిన క్లాసెన్ (7)ను జడ్డూ బోల్తా కొట్టించాడు. అయితే ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ సెంచరీ తర్వాత వరుసగా విఫలమైన ఇషాన్.. చెన్నైతో పోరులో మాత్రం బాధ్యతాయుతంగా ఆడాడు. రెండో వికెట్‌కు హెడ్‌తో 37 పరుగులు, మూడో వికెట్‌కు అనికేత్‌తో 36 రన్స్ జత చేసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. తన శైలికి భిన్నంగా ఆడిన ఇషాన్.. అర్ధశతకానికి సమీపిస్తున్న క్రమంలో నూర్ అహ్మద్ వరుస ఓవర్లలో ఎస్‌ఆర్‌హెచ్‌కు రెండు షాకులిచ్చాడు. 12వ ఓవర్లో 44 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాన్‌ను ఔట్ చేసిన అతడు.. మరుసటి ఓవర్లో అనికేత్‌నూ పెవిలియన్‌కు పంపి చెన్నైలో గెలుపు ఆశలు రేపాడు. కానీ మెండిస్, నితీశ్ రెడ్డి (19 నాటౌట్).. ఎలాంటి సంచలనాలకూ తావివ్వకుండా లాంఛనాన్ని పూర్తి చేశారు.

చెన్నైది అదే కథ


ఈ సీజన్‌లో బ్యాటింగ్ వైఫల్యాలతో తేలిపోతున్న సీఎస్‌కే.. హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ దానినే కొనసాగించింది. ఇన్నింగ్స్ తొలి బంతికి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. పడుతూ లేస్తూ నామమాత్రపు స్కోరు సాధించింది. చెన్నైకి ఆడుతున్న అరంగేట్ర ఆటగాడు బ్రెవిస్, ఇటీవలే ఆ జట్టుకు ఎంట్రీ ఇచ్చిన అయుష్ ఇద్దరే ఫర్వాలేదనిపించారు. ఈ మ్యాచ్‌తో మళ్లీ ఎస్‌ఆర్‌హెచ్ తుది జట్టులోకి వచ్చిన షమీ.. తొలి బంతికే షేక్ రషీద్‌ను డకౌట్ చేసి సీఎస్‌కేను ఆరంభంలోనే దెబ్బకొట్టాడు. మూడో స్థానంలో సామ్ కరన్ (9)ను ఆడించినా అతడూ విఫలమయ్యాడు. హర్షల్ ఐదో ఓవర్లో కరన్.. అనికేత్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అయుష్ మాత్రం ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. బౌండరీతో పరుగుల వేటను ప్రారంభించిన ఈ మహారాష్ట్ర కుర్రాడు.. కమిన్స్, ఉనద్కత్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు రాబట్టాడు. కానీ కమిన్స్.. ఆరో ఓవర్లో అయుష్‌ను ఔట్ చేయడంతో చెన్నై కష్టాల్లో చిక్కుకుంది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన బ్రెవిస్.. జడేజా (21)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. అయితే మెండిస్.. పదో ఓవర్లో అద్భుతమైన బంతితో జడ్డూను క్లీన్‌బౌల్డ్ చేశాడు. 17 బంతుల్లో 17 పరుగులే చేసిన బ్రెవిస్.. మెండిస్ 12వ ఓవర్లో జూలు విదిల్చాడు. తన ట్రేడ్ మార్క్ షాట్ అయిన 'నో లుక్ సిక్స్'తో పాటు మరో రెండు సిక్సర్లు దంచడంతో చెన్నై స్కోరు 100 దాటింది. కానీ హర్షల్ మరుసటి ఓవర్లో లాంగాఫ్ వద్ద మెండిస్ కళ్లుచెదిరే డైవింగ్ క్యాచ్‌తో బ్రెవిస్ ఇన్నింగ్స్ ముగిసింది. శివమ్ దూబే (12), ధోనీ (6) విఫలమవగా ఆఖర్లో దీపక్ హుడా (22) కీలక పరుగులు జతచేశాడు. స్పిన్‌కు సహకరించే చెపాక్ పిచ్‌పై ఎస్‌ఆర్‌హెచ్ పేసర్లు ఏకంగా 9 వికెట్లు పడగొట్టడం విశేషం. అదీగాక ఈ సీజన్‌లో ఒక జట్టును ఆలౌట్ చేయడం హైదరాబాద్‌కు ఇదే ప్రథమం.

400 క్లబ్‌లో మహీ

ఈ మ్యాచ్‌తో ధోనీ తన సుదీర్ఘ కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకున్నాడు. టీ20లలో మహీకి ఇది 400వ మ్యాచ్. భారత్ నుంచి ఈ రికార్డు సాధించినవారిలో అతడు నాలుగో క్రికెటర్. ఈ జాబితాలో రోహిత్ శర్మ (456 మ్యాచ్‌లు), దినేశ్ కార్తీక్ (412), విరాట్ కోహ్లీ (408).. ధోనీ కంటే ముందున్నారు. ఈ ఫార్మాట్‌లో ధోనీ.. 7,500కు పైగా పరుగులు చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 154 ఆలౌట్ (బ్రెవిస్ 42, అయుష్ 30, హర్షల్ 4/28, కమిన్స్ 2/21); హైదరాబాద్: 18.4 ఓవర్లలో 155/5 (ఇషాన్ 44, మెండిస్ 32*, నూర్ 2/42, కంబోజ్ 1/16)



హర్షల్ (4/28)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	8	6	2	12	1.10
ఢిల్లీ	8	6	2	12	0.65
బెంగళూరు	9	6	3	12	0.48
ముంబై	9	5	4	10	0.67
పంజాబ్	8	5	3	10	0.17
లక్నో	9	5	4	10	-0.05
కోల్‌కతా	8	3	5	6	0.21
హైదరాబాద్	9	3	6	6	-1.10
రాజస్థాన్	9	2	7	4	-0.62
చెన్నై	9	2	7	4	-1.30

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ఏషియన్ టోర్నీకి నిత్య, నందిని

59 మందితో భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: దక్షిణకొరియా వేదికగా జరుగనున్న ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం భారత అథ్లెటిక్స్ సమాఖ్య(ఏఎఫ్ఐ) 59 మందితో జట్టును శుక్రవారం ఎంపిక చేసింది. కొచ్చిలో తాజాగా ముగిసిన ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారిని ఏషియన్ చాంపియన్‌షిప్‌నకు పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ నుంచి నిత్య గాదెతో పాటు అగసర నందిని భారత అథ్లెటిక్స్ జట్టులో చోటు దక్కించుకున్నారు. మహిళల 200మీటర్ల రేసుతో పాటు 4X 100 రిలే రేసులో నిత్య బరిలో దిగనుండగా, హెప్టాథ్లాన్‌లో నందిని పోటీపడనుంది. ఇదిలా ఉంటే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా..ఏషియన్ అథ్లెటిక్స్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. చివరిసారి 2017లో ఆడిన నీరజ్..ప్రతిష్ఠాత్మక టోర్నీలైన డైమండ్ లీగ్‌తో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లపై దృష్టి సారించాడు. దీనికి తోడు వచ్చే నెల బెంగళూరులో జరుగనున్న 'నీరజ్ చోప్రా' క్లాసిక్ టోర్నీ కోసం నీరజ్ సిద్ధమవుతున్నాడు. షాట్‌పుటర్ తజిందర్‌పాల్‌సింగ్‌తో పాటు పోల్‌వాల్టర్ దేవ్‌కుమార్‌మీనా భారత జట్టులో చోటు దక్కించుకోపోగా, అవినాశ్ సాబ్లె, పారుల్ చౌదరీ, గుల్వీర్‌సింగ్, జ్యోతి యర్రాజీ, ప్రవీణ్ చిత్రవేల్ సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు.








సెమీస్‌కు మరో 8 మంది బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ అండర్-15, 17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో 8 మంది యువ భారత బాక్సర్లు సెమీస్‌కు చేరారు. గురువారం రాత్రి జరిగిన క్వార్టర్స్ పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో టికమ్ సింగ్, అంబేకర్, అమన్ దేవ్, ఉద్ధమ్ సింగ్, రాహుల్ గెరియా సెమీస్‌కు అర్హత సాధించారు. మహిళల విభాగంలో.. ఖుషీ చంద్, జియా, జన్నత్ లాస్ట్-8కు దూసుకెళ్లారు.

ఆసియా రేసింగ్‌లో జోహాన్, కెవిన్



ముంబై: ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్ కోసం రంగం సిద్ధమైంది. థాయ్‌లాండ్ వేదికగా ఈనెల 27వ వరకు జరుగనున్న రేసింగ్ కోసం హోండా ప్రకటించిన జట్టులో భారత్ నుంచి జోహాన్ రీవ్స్, కెవిన్ కింటాల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆసియాలోనే అత్యంత పోటీ ఉండే రేసింగ్ సర్క్యూట్లలో ఒకటైన థాయ్‌లాండ్ రేసింగ్‌లో జోహాన్, కెవిన్..అంతర్జాతీయ రేసర్లతో పోటీపడనున్నారు. 2025 ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో మొత్తం ఆరు రౌండ్లు జరుగనున్నాయి. థాయ్‌లాండ్‌లోని చాంగ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో తొలి రౌండ్ మొదలుకానుంది. కెవిన్ ఇప్పటికే ఏఆర్‌ఆర్‌సీ సీజన్లలో అనుభవం పొందిన రైడర్ కాగా, జోహాన్ మాత్రం తొలిసారి అంతర్జాతీయ టోర్నీలో పోటీ పడుతున్నాడు.

అర్షద్‌ను తోటి అథ్లెట్‌గానే ఆహ్వానించా..

దేశ ప్రయోజనాలే నా మొదటి ప్రాధాన్యత • స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా వివరణ



ఢిల్లీ: వచ్చే నెలలో బెంగళూరు వేదికగా జరుగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ (ఎన్‌సీ క్లాసిక్-2025) ఈవెంట్‌కు పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై భారత గోల్డెన్ బాయ్ స్పందించాడు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎన్‌సీ క్లాసిక్‌కు పాక్ అథ్లెట్‌ను పిలవడాన్ని నిరసిస్తూ చాలా మంది నెటిజన్లు నీరజ్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. తాజాగా నీరజ్.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సుదీర్ఘమైన లేఖలో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ వివరణ ఇచ్చాడు. 'ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. అందులో ఎక్కువ భాగం ద్వేషం, అసభ్యకరమైనవే ఉన్నాయి. వాళ్లు నా కుటుంబాన్నీ విడిచిపెట్టలేదు. ఈ ఈవెంట్‌లో పాల్గొనబోయే క్రీడాకారులకు సోమవారమే (పహల్గాం ఉగ్రదాడికి ముందు) ఆహ్వానం పంపాం. అగ్రశ్రేణి అథ్లెట్లను భారత్‌కు రప్పించి ప్రపంచస్థాయిలో నిర్వహించగలమని చాటిచెప్పడమే ఎన్‌సీ క్లాసిక్ ఉద్దేశం. కానీ ఈ 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఈ ఈవెంట్‌కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. నాకు నా దేశ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత. పహల్గాం ఘటనపై నాకు బాధతో పాటు కోపమూ ఉంది. భారత్ గర్వపడేలా చాలా ఏండ్లుగా కష్టపడుతున్నా. కానీ ఇప్పుడు నా చిత్తశుద్ధిని ప్రశ్నించడం బాధాకరంగా ఉంది. నాతో పాటు ఇంట్లో మా అమ్మనూ వాళ్లు వదల్లేదు. గతంలో ఆమె అమాయకంగా చెప్పిన మాటలను ప్రశంసించినవాళ్లే ఇప్పుడు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఇలా ఎలా మార్చుకుంటారో అర్థం కావడం లేదు. ఏదేమైనా ప్రపంచస్థాయిలో నా దేశాన్ని గర్వంగా నిలిపేందుకు నేను ఎల్లవేళలా కష్టపడతా. జైహింద్' అని రాసుకొచ్చాడు.



సామాన్యుడికి అందని ద్రాక్షగా పుత్తడి

కొనడానికి వెనుకంజవేస్తున్న మహిళలు

ఏమి కొనేటట్టు లేదు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పది గ్రాముల పుత్తడి ధర లక్ష రూపాయల మార్క్‌ను అధిగమించి సామాన్యుడికి అందని స్థాయికి చేరుకున్నది. దీంతో సామాన్యుడితో పాటు మహిళలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. అక్షయ తృతీయ, వివాహం సందర్భంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు, కానీ ప్రస్తుతం ధర లక్ష స్థాయిలో ఉండటంతో మధ్యస్థాయి కుటుంబాలు వీటికి దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే ఇతర ఖర్చులు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై బంగారం పిడుగు పడ్డట్టు అయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశ రాజధానిలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టినప్పటికీ లక్ష రూపాయల దారిదాపుల్లోనే కొనసాగుతున్నది. పండుగ సీజన్‌తోపాటు కుటుంబ ఫంక్షన్లలో మహిళలు బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు..ప్రస్తుతం దీని ధర రికార్డు స్థాయిలో పలకడంతో మహిళలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధరలు 29 శాతం లేదా రూ.22,650 పెరిగింది. ఈక్విటీ మార్కెట్లు, బాండ్ల కంటే పసిడి అత్యధిక రిటర్నులను పంచింది. దేశవ్యాప్తంగా ఉన్న మహిళ వద్ద 24 వేల టన్నుల బంగారం ఉన్నదని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా అంచనాను విడుదల చేసింది.

నా కూతురు పెళ్లి వచ్చే నవంబర్‌లో ఉన్నది. అకస్మాత్తుగా బంగారం ధర లక్ష రూపాయలు అధిగమించింది..ఇప్పుడు పుత్తడిని కొనుగోలు చేయడమెట్లా అని ఆలోచిస్తున్నాను.

- రూప, గృహిణి

' నా భర్త ప్రతి ఏటా బంగారాన్ని కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం దీని ధర గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఈ ఆభరణాలు నాకు గౌరవాన్ని, ఆర్థిక బలాన్ని ఇచ్చాయి'

- అర్చన దేశ్‌ముఖ్

విమాన చార్జీలకు రెక్కలు!

అంతర్జాతీయ రూట్లలో 12 శాతం వరకు పెరగనున్న చార్జీలు

పాకిస్థాన్ గగనతలం మూసివేయడమే కారణం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: విమాన చార్జీలకు మళ్లీ రెక్కలు వచ్చాయి. పహెల్గాంపై తీవ్రవాదులు దాడుల నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో పాకిస్థాన్ ఒక అడుగుముందుకేసి ఆ దేశ గగనతలాన్ని మూసివేసింది. దీంతో పాకిస్థాన్ గగనతలం నుంచి దేశీయ విమాన సర్వీసులు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించడంతో ఆయా విమానయాన సంస్థలు ప్రయాణికులపై భారం మోపడానికి సిద్ధమవుతున్నాయి. పాక్ గగనతలం నుంచి వెళ్లే యూరప్, ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్యం వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల విమాన చార్జీలు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతిగా పాకిస్థాన్ తన గగనతలంపై నిషేధం విధించడంతోపాటు సరిహద్దును మూసివేసింది.

పెరగనున్న ప్రయాణ సమయం

భారత్ నుంచి ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల సమయం మరింత పెరగనున్నది. ఈ విషయాన్ని ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేశాయి. పాక్ గగనతలం మూసివేయడంతో అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లే విమాన ప్రయాణ సమయం 2 గంటల నుంచి 2.5 గంటల వరకు పెరగనున్నదని సీనియర్ పైలెట్ ఒకరు చెప్పారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులపై ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నారు. ప్రయాణ సమయం పెరగడంతో విమాన సంస్థలపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా టికెట్ చార్జీలను పెంచడానికి సమాయత్తమవుతున్నాయి. గగనతలం మూసివేయడంతో చమురు వినిమయం పెరగడం, నిర్వహణ ఖర్చులు అధికం కావడం కూడా ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు.

ఎయిర్ ఇండియా దారిమళ్లింపు

పాక్ గగనతలం మూసివేయడంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమాన సర్వీసులను దారి మళ్లించింది. ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, ఇతర దేశాలకు ప్రయాణించే అంతర్జాతీయ ఫ్లైట్ సర్వీసులు కొత్త రూట్‌లో వెళ్తున్నాయి. దీంతో వీటి ప్రయాణం సమయం మరో రెండు గంటలు పెరుగుతున్నదని తెలిపింది. మరో విమానయాన దిగ్గజం ఇండిగో..అంతర్జాతీయ రూట్లలో నడిచే విమాన సర్వీసులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని, ప్రయాణికులకు తమ పరిస్థితిని వివరించనున్నట్లు తెలిపింది. ప్రయాణికులకు కలిగించే అసౌకర్యాన్ని మేము అర్థం చేసుకోగలం..మీ గమ్యాన్ని చేర్చడానికి తమవంతుగా కృషి చేయనున్నట్లు ఎక్స్‌లో పేర్కొంది. ఈ రెండు సంస్థలతోపాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలకు చెందిన సర్వీసులు కూడా ఈ రూట్‌లో నడుస్తున్నాయి.



ఎస్కార్ట్ ట్రాక్టర్లు ప్రియం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: వ్యవసాయ, నిర్మాణ రంగ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్ ..వచ్చే నెల నుంచి ట్రాక్టర్ల ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఎంత శాతం మేర పెంచుతున్న విషయాన్ని సంస్థ వెల్లడించలేదు. క్యూబాటో బ్రాండ్‌తో విక్రయిస్తున్న ట్రాక్టర్ల ధరలు వచ్చే నెల 1 నుంచి మరింత ప్రియంకాబోతున్నాయి. ఈ విషయాన్ని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.



మారుతి రూ.135 డివిడెండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి ఖర్చుల సెగ గట్టిగానే తగిలింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన ఒక్క శాతం తగ్గి రూ.3,911 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.3,952 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.38,371 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. గత త్రైమాసికంలో కంపెనీ నిర్వహణ ఖర్చులు రూ.37,585 కోట్లకు పెరగడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. అలాగే 6,04,635 వాహనాలను విక్రయించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,52,913 కోట్ల ఆదాయంపై రూ.13,955 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సమావేశమైన కంపెనీ బోర్డు వాటాదారులు భారీ స్థాయిలో సంపదను పంచింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.135 డివిడెండ్‌ను ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇచ్చిన రూ.125 కంటే ఇది అధికం. సంస్థ చరిత్రలో ఇంతటి స్థాయిలో డివిడెండ్ అందించడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం.

ఎల్ఐసీ హెచ్ఎఫ్ వడ్డీరేట్ల తగ్గింపు

ముంబై, ఏప్రిల్ 25: గృహ రుణాలు అందించే దేశంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇటీవల రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన నిర్ణయానికి అనుగుణంగా ఎల్ఐసీ హౌజింగ్ ప్రైమ్ లెండింగ్ రేటు(ఎల్‌హెచ్‌పీఎల్ఆర్)ను పావు శాతం తగ్గించింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 8 శాతంతో ప్రారంభంకానున్నాయి. తగ్గించిన రేట్లు ఈ నెల 28 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ తాజా నిర్ణయంతో గతంలో తీసుకున్న రుణాలతోపాటు కొత్తగా తీసుకునే రుణాలకు ఈ తగ్గింపు వర్తించనున్నదని ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి తెలిపారు. దీంతో గృహ రుణాలు తీసుకునేవారి పెరిగే అవకాశం ఉండగా, గృహాలకు డిమాండ్ అధికంకానున్నదన్నారు.

ఇండియన్ బ్యాంక్ కూడా..

ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ కూడా వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గనుండగా, వాహన రుణాలపై వడ్డీరేటు 8.50 శాతం నుంచి 8.25 శాతానికి దిగిరానున్నది. దీంతో రుణ గ్రహీతల నెలవారి చెల్లింపులు తగ్గనున్నాయి. కెనరా బ్యాంక్ కూడా వడ్డీరేటును పావు శాతం కోత పెట్టింది. దీంతో 7.90 శాతం ప్రారంభంతో గృహ రుణాలు అందిస్తున్న బ్యాంక్..8.20 శాతానికి వాహన రుణాలు మంజూరు చేస్తున్నది. మరోవైపు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్ల నుంచి 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది.

రిలయన్స్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను నికర లాభంలో 2.4 శాతం వృద్ధి చెంది రూ.19,407 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.14.34 కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో రూ.18,951 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.14 ఆర్జించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.4 లక్షల కోట్ల నుంచి రూ.2.6 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో నికర లాభం ఏడాది ప్రాతిపదికన 25.7 శాతం ఎగబాకి రూ.7,022 కోట్లకు చేరుకున్నది. ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చిన ఆదాయం 13.5 శాతం ఎగబాకి రూ.206.2కి చేరుకున్నది. ఏడాది క్రితం ఇది రూ.181.7 కోట్లుగా ఉన్నది. కంపెనీ ఆదాయం 17.7 శాతం వృద్ధితో రూ.33,986 కోట్లు ఆర్జించింది. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.5.5 తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

మార్కెట్లపై

యుద్ధమేఘాలు

ఒక దశలో 1,200 పాయింట్లు.. చివర్లో 590 పాయింట్లు డౌన్

ముంబై, ఏప్రిల్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. భారత్-పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 588.90 పాయింట్లు కోల్పోయి 79,212.53 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 207.35 పాయింట్లు పతనం చెంది 24,039.35 వద్ద ముగిసింది. పహల్గాంపై తీవ్రవాదులు దాడులు చేయడంతో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీ రంగ సూచీ మినహా అన్ని రంగాల సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి.

- అదానీ పోర్ట్స్ షేరు 3.61 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్ షేర్లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి.
- అలాగే టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, మారుతి, ఎస్బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, నెస్లె, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి.
- టీసీఎస్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2.56 శాతం, మిడ్‌క్యాప్ కూడా 2.44 శాతం కోల్పోయింది.
- రంగాలవారీగా చూస్తే సర్వీసెస్ 3.11 శాతం నష్టపోగా, యుటిలిటీ 2.96 శాతం, రియల్టీ 2.87 శాతం, పవర్ 2.77 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.19 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.06 శాతం నష్టపోయింది. కానీ, ఐటీ రంగ సూచీ లాభాల్లో ముగిసింది.



రూ.9 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. వరుసగా రెండు రోజుల్లో ఇన్వెస్టర్లు రూ.8.88 లక్షల కోట్ల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,88,975.14 కోట్లు కరిగిపోయి రూ.4,21,58,900.91 కోట్లు(4.93 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది.

సింగిల్ టేక్ రొమాంటిక్ సాంగ్



'హిట్' ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకూ వచ్చిన రెండు సినిమాలు మంచి విజయాలను అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుంచి రానున్న మూడో ప్రయత్నం 'హిట్ : ది 3rd కేస్'. అగ్ర హీరో నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాపై అంచనాలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని ఓ రొమాంటిక్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాఘవ్ రాసిన ఈ పాటను మిక్కీజే మేయర్ స్వరపరచగా అనిరుధ్ ఆలపించారు. పూర్తిగా ఒకే టేక్‌లో ఈ పాటను షూట్ చేయడం జరిగిందని మేకర్స్ చెబుతున్నారు. సినిమాలోని క్రైమ్ వరల్డ్ నేపథ్యానికి భిన్నంగా ఉండే సున్నితమైన విజువల్స్ ఈ పాటలో చూడొచ్చు. శ్రీనిధిశెట్టి పాత్రను కలవడానికి వెళ్తున్న నాని హ్యాపీ మూమెంట్‌ని ఆ పాట ఆవిష్కరిస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, నిర్మాణం: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.



అభిమానులు దేవుడిచ్చిన వరం!

సినీరంగంలో తాను పడిన కష్టానికి ఫలితంగానే వేల మంది అభిమానుల్ని సంపాదించుకున్నానని, వాళ్లను దేవుడిచ్చిన వరంగా భావిస్తానని అగ్ర కథానాయిక సమంత చెప్పింది. చెన్నైలో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కోలీవుడ్ గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డునందుకుంది. ఈ సందర్భంగా ఆమె తన కెరీర్‌తో పాటు కష్టకాలంలో వెన్నంటివున్న ఆత్మీయుల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది. కేవలం ఏదో ఒక తప్పుడు నిర్ణయం వల్ల కెరీర్ ప్రభావితం అవుతుందన్నది అబద్ధమని, సరైన అవగాహన లేకుండా తీసుకునే ఎన్నో నిర్ణయాలు కెరీర్ గమనాన్ని నిర్దేశిస్తాయని తెలిపింది. తన ఆరోగ్యం బాగా లేనప్పుడు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఎంతో కేర్ తీసుకున్నాడని, తమ అనుబంధానికి పేరు పెట్టలేనని సమంత ఎమోషనల్ అయింది. 'కష్టకాలంలో రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. అతను నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు లేదా రక్త సంబంధీకుడా అని చెప్పలేను. అంతటి బలమైన అనుబంధం మాది' అని సమంత పేర్కొంది. ప్రస్తుతం సమంత హిందీలో 'రక్త్ బ్రహ్మండ్' అనే వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది.

అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే..

చిత్రం



సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో బాలకృష్ణ 'అఖండ 2- తాండవం' ముందు వరుసలో ఉంటుంది. హ్యాట్రిక్ హిట్స్ సింహా, లెజెండ్, అఖండ చిత్రాల తర్వాత బాలయ్య, బోయపాటిశ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'అఖండ-2'పై అంచనాలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి. పైగా బాలకృష్ణ కెరీర్‌లో వస్తున్న తొలి పానిండియా సినిమా 'అఖండ 2' కావడం విశేషం. చిత్ర నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట దాదాపు 200కోట్ల భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పక్కా ప్లానింగ్‌తో శరవేగంగా జరుగుతున్నది. ఇందులో అఖండ రుద్ర సికిందర్ అఘోరాగా బాలయ్య నటవిరాట్ స్వరూపాన్ని చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా కొన్ని కారణాలవల్ల దసరా రేస్ నుంచి తప్పుకుందని, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుందంటూ పలు రూమర్లు సోషల్ మీడియాలో వినిపించాయి. వాటన్నింటికీ చెక్ పెడుతూ శనివారం బోయపాటి పుట్టినరోజు సందర్భంగా ఎక్స్‌లో చిత్ర నిర్మాతలు ఓ పోస్ట్ పెట్టారు. 'థియేటర్లలో మాస్ హిస్టీరియాను సృష్టించే క్రియేటర్.. మా 'అఖండ 2' దర్శకుడు బోయపాటి శ్రీనుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా 'అఖండ 2 - తాండవం' విడుదల కానుంది' అనేది ఈ పోస్ట్ సారాంశం. దీంతో 'అఖండ 2' విడుదలపై వస్తున్న రూమర్లన్నింటికీ ఫుల్‌స్టాప్ పడింది. అంటే.. థియేటర్లలో అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే అన్నమాట.

మా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్




'ప్రియదర్శి వైవిధ్యమైన నటుడని మా అందరి నమ్మకం. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు చెప్పాను. ఇప్పుడు ప్రేక్షకులు అదేమాటంటున్నారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌గారితో ఈ సినిమా ద్వారా హ్యాట్రిక్ హిట్‌కొట్టడం ఆనందంగా ఉంది.' అన్నారు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన నిర్దేశకత్వంలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన 'సారంగపాణి జాతకం' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడారు. సకుటుంబ సపరివార సమేతంగా థియేటర్లలో చూసి ఆనందించాల్సిన చిత్రమిదని ఆయన అన్నారు. వైజాగ్‌లో వేసిన ప్రీమియర్‌షోలకే పాజిటివ్ వైబ్స్ వచ్చాయని, బుక్‌మై షోలో సినిమా ట్రెండ్ అవుతున్నదని, అన్ని రివ్యూస్ అద్భుతంగా వచ్చాయని హీరో ప్రియదర్శి ఆనందం వ్యక్తం చేశారు. 'సారంగపాణి' ప్రభంజనం ఇప్పుడే మొదలైందని, మౌత్‌టాక్‌తో మరింత ముందుకు వెళ్తుందనే నమ్మకం ఉందని, ఈ విజయంతో టీమ్ మొత్తం హ్యాపీగా ఉన్నామని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సక్సెస్‌మీట్‌లో రూపా కొడవయూర్, అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో

'క' నామినేట్




నటుడు కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రానికి అరుదైన గౌరవం లభించింది. 15వ ప్రతిష్ఠాత్మక 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'లో ఈ సినిమా నామినేట్ అయ్యింది. ఉత్తమ చిత్ర విభాగానికి 'క' నామినేట్ అయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఢిల్లీ వేదికగా ఈ నెలాఖరున జరిగే వేడుకల్లో విజేతలు పురస్కారాలు అందుకోనున్నారు. నూతన దర్శకులు సుజిత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణరెడ్డి నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది విడుదలై అఖండ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. నయన్ సారిక, తన్వీ రామ్ ఇందులో కథానాయికలు. ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని డాల్బీ విజన్ ఆటమ్స్ టెక్నాలజీతో మేకర్స్ తెరకెక్కించారు. ఇదో విభిన్నమైన కథ. కర్మసిద్ధాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సగటు ప్రేక్షకునికి ఆద్యంతం సినిమా చూస్తే తప్ప అంతుచిక్కని స్క్రీన్‌ప్లేతో దర్శకులు సుజిత్, సందీప్ 'క'ను మలిచారు. వాణిజ్య పరంగా 50కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. దీనికి కొనసాగింపు కూడా ఉంటుందని, తొలి పార్ట్‌ని మించేలా 'క -2' తెరకెక్కిస్తామని దర్శకులు చెబుతున్నారు.




తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌టీడీడీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిరాజు రాజంరాజు అలియాస్ ముక్కురాజు మాస్టర్ విగ్రహావిష్కరణ వేడుక ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. టీఎఫ్‌టీడీడీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ప్రముఖ దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఛాంబర్ ప్రధాన కార్యదర్శి దామోదరప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ, వల్లభనేని అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్ లబ్బర్ బంతి



హీరోలందరి అభిమానులకూ ఇష్టమైన నటుడు డా.రాజశేఖర్. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. జనరేషన్ మారింది. కొత్త నీరు వచ్చింది. పాత కథలకు కాలం చెల్లింది. ఆడియన్స్ అభిరుచి మారింది. దాంతో ఈ జనరేషన్‌కి తగ్గట్టు తనను తాను మలుచుకునే పనిలో ఉన్నారు రాజశేఖర్. సరైన సెకండ్ ఇన్నింగ్స్ కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. అందులో భాగంగానే తమిళ సూపర్‌హిట్ 'లబ్బర్ పందు' చిత్రం రీమేక్ హక్కుల్ని సొంతం చేసుకున్నారట. 'లబ్బర్ పందు' అంటే తెలుగులో 'లబ్బర్ బంతి' అని అర్థం. ఇది ఓ ఆడపిల్ల తండ్రి కథ. ఆ తండ్రికి క్రికెట్ అంటే ఇష్టం. తన కూతురు ఓ అబ్బాయిని ప్రేమిస్తుంది. ఆ కుర్రాడికి కూడా క్రికెట్ అంటే ఇష్టం. ఈ విధంగా క్రీడా నేపథ్యంలో సరదాగా, భావోద్వేగాల మధ్య ఈ ప్రేమకథ సాగుతుంది. ఇందులో పెళ్లీడు కూతురుకి తండ్రిగా వయసుకు తగ్గ పాత్రలో నటించేందుకు రాజశేఖర్ సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ సినిమా దర్శకుడు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు తదితర వివరాలు త్వరలో వెల్లడికానున్నట్టు తెలుస్తున్నది.



సైన్స్ ఫిక్షన్ 'కలియుగమ్ 2064'

శ్రద్ధాశ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటించిన సైన్స్ ఫిక్షన్ అడ్వెంచరస్ చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకుడు. కన్నడ, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రాన్ని కె.ఎస్.రామకృష్ణ నిర్మించారు. మే 9న విడుదలకానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తున్నది. శుక్రవారం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఆవిష్కరించారు. 2064లో ఏర్పడే విపత్కర పరిస్థితుల్లో మనుగడ కోసం మానవులు చేసే పోరాటం నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం ఆసక్తికరంగా సాగింది. తెలుగు ప్రేక్షకులకు ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు.



'సింగిల్' వచ్చేది ఆ రోజే..

వరుస విజయాలతో జోష్‌మీదున్నారు యువహీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న తాజా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'సింగిల్'. కార్తీక్ రాజు దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, ఆద్యంతం హాస్యంతో అలరించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. కేతికశర్మ, ఇవానా, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భానుప్రతాప్, రియాజ్ చౌదరి, రచన-దర్శకత్వం: కార్తీక్‌రాజు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఇల్లెందు మండలం నెహ్రూనగర్ గ్రామంలో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

- **మంచినీరు అందించండి.. మహాప్రభో!**
- **భద్రాద్రి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మహిళ ల నిరసన**

దుమ్ముగూడెం/ చుంచుపల్లి/ ఇల్లెందురూరల్/ చారకొండ, ఏప్రిల్ 25 : భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం మంచినీళ్లు అందించండి.. మహాప్రభో! అంటూ ఖాళీ బిందెలతో గ్రామస్థులు, మహిళలు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెం, చుంచుపల్లి మండలం మాయాబజార్, ఇల్లెందు మండలం నెహ్రూనగర్, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారం తండాలో మహిళలు రోడ్డుపైకి వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. 20రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మండిపడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు, మహిళలు మోటరు వద్ద ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది అక్కడకు చేరుకుని మోటరుకు మరమ్మతులు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారం తండాలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో పైపులకు మరమ్మతులు చేపట్టారు.

ఆర్టీసీ సమ్మెపై సర్కారీ మౌనం వెనుక..?

- **సమ్మె జరిగితేనే మంచిదనే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు!**
- **ఆర్టీసీ విలీనంపై ప్లాన్ ఏ, ప్లాన్ బీ సిద్ధం చేసిపెట్టుకున్న సర్కారు?**
- **ప్రజల్లో చర్చ మొదలైన తర్వాతే అపాయింటెడ్ డే ప్రకటన?**
- **అందుకే సమ్మెపై స్పందించని యాజమాన్యం, ప్రభుత్వం!**
- **ఇప్పటికే సీఎం వద్ద ఫైలు**



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసులపై ఇటు యాజమాన్యం, అటు ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నట్టు తెలుస్తున్నది. ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మెకు దిగితే ఏం చేయాలనే విషయంలో ప్రభుత్వం ప్లాన్ 'ఏ'తో పాటు, ప్లాన్ 'బీ'ని కూడా సిద్ధం చేసి పెట్టుకున్నదని, సమ్మె జరగాలనే కోరుకుంటున్నదని విశ్వసనీయ సమాచారం. సమ్మె ఎందుకు జరుగుతున్నది? అనే అంశంపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగితేనే.. తాము తీసుకునే చారిత్రక నిర్ణయం ప్రజల్లోకి కూడా బలంగా వెళ్తుందనే భావనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలిసింది. ప్లాన్ 'ఏ' లో భాగంగా సమ్మెకు రెండు రోజుల ముందు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి, మంత్రి సమక్షంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించిన 'అపాయింటెడ్ డే'పై ప్రకటన చేసి, ఆ తర్వాత ముఖ్యమంత్రితో దాని గురించి గొప్పగా చెప్పించాలనే వ్యూహంతో ఉన్నట్టు తెలిసింది. ఒకవేళ, ప్లాన్ 'ఏ'లో కార్మిక సంఘాలు సంతృప్తి చెందకపోతే, సమ్మెను రెండు, మూడు రోజులు కొనసాగనిచ్చి, ఆ తర్వాత మరోసారి కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి, 'ప్లాన్ బీ'ని అమలుచేస్తారని సమాచారం. ఎందుకంటే, ఇప్పటికే ప్రభుత్వంపై విభిన్న వర్గాల్లో వ్యతిరేకత వస్తుండగా, ఆర్టీసీ కుటుంబాలు ఏకమయ్యాయి. దీంతో 'ఆర్టీసీ విలీనం ఎప్పటికైనా చేయాల్సిన పనే కదా.. ఇప్పుడు చేసేద్దాం' అనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. అయితే, సమ్మె డిమాండ్లను ఆమోదించడం అనేది చాలా గొప్పగా ప్రకటించుకోవాలని, అవి ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అందుకు సమ్మె జరిగితేనే మంచిది అనే కోణంలో ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. కాగా, చర్చల విషయంలో ప్రభుత్వం కొంత సానుకూలంగా ఉన్నప్పటికీ, ఒక కీలక వ్యక్తి ఆ చర్చలను అడ్డుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఆ నాలుగు అంశాలకు ప్రభుత్వం ఓకే!

సమ్మె జరుగుతున్నప్పుడే ప్లాన్ బీలో భాగంగా.. ప్రభుత్వం గొప్పగా ప్రకటించేందుకు కీలకంగా నాలుగు అంశాలను ఎంపిక చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వాటిల్లో 1) ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింటెడ్ తేదీని ప్రకటించడం 2) 2021 పీఆర్సీలో 20-25% ఫిట్‌మెంట్ ఇవ్వడం 3) ఆర్టీసీలో యూనియన్లకు ఆమోదం తెలపడం 4) ఆర్టీసీ ఉద్యోగుల రిటైర్మెంట్ వయో పరిమితిని 60 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచడం. ఈ 4 అంశాలను ప్రధానంగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని, ఇక మిగిలిన అంశాలపై కమిటీలు వేయడం.. లేదా వాటి అమలు కోసం కొన్ని తేదీలను ప్రకటించడం వంటివి చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఆర్టీసీ విలీన ఫైలు జీఏడీ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్నట్టు సమాచారం. దీంతో ప్రభుత్వం అపాయింటెడ్ డేని ప్రకటిస్తే, ప్రభుత్వం మీద పడే ఆర్థికభారం ఎంత? అనే అంశంపై ఆర్థిక శాఖ కూడా తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైతే వచ్చే లాభాలేంటి? నష్టాలేంటి? అనే అంశాలపై ప్రభుత్వ పెద్దలు నిపుణులతో చర్చిస్తున్నట్టు సమాచారం

ఆరు జిల్లాల్లో 45 డిగ్రీల పైనే..

రోజురోజుకూ పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. ఆరు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. మిగతా 27 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. వడగాలుల కారణంగా ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నదని పేర్కొంది. ఈనెల 29వరకు దేశవ్యాప్తంగా ఈ వడగాలుల తీవ్రత ఉంటుందని తెలిపింది. మరోవైపు పలు ప్రాంతాల్లో శనివారం వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణశాఖ పేర్కొంది. జిల్లాల వారీగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు నిర్మల్, నిజామాబాద్ 45.4, జగిత్యాల 45.3, ఆదిలాబాద్ 45.2, మంచిర్యాల 45.1, కుమ్రం భీం ఆసిఫాబాద్ 45.0, జోగులాంబ గద్వాల, నల్లగొండ 44.9, కామారెడ్డి 44.6, పెద్దపల్లి 44.5 డిగ్రీలుగా నమోదయ్యాయి.

వైద్యశాఖలో 'అబాస్' చిచ్చు

- **ఫేస్ రికగ్నైజేషన్, జియో ట్యాగింగ్‌పై వైద్యుల వ్యతిరేకత**
- **డాటాప్రైవసీకి విరుద్ధమైన విధానమంటూ మండిపాటు**
- **వైద్యుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం**
- **డుమ్మా కొట్టే డాక్టర్లకు చెక్ పెట్టేందుకే అంటున్న సర్కారు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దవాఖానలు, వైద్య కళాశాలల్లో పనిచేసే డాక్టర్లు, బోధనా సిబ్బందితో పాటు పారామెడికల్, అనుబంధ సిబ్బందికి మే 1 నుంచి ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు (అబాస్) విధానం అమలు కానుంది. ఇప్పటివరకు వైద్యారోగ్య శాఖలో వేలిముద్ర ద్వారా హాజరు విధానం అమలులో ఉండగా ఎన్ఎంసీ నిర్ణయంతో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్రంలో 638 పీహెచ్‌సీలు, 248 అర్బన్ పీహెచ్‌సీలు, 468 బస్తీ దవాఖానలు, టీవీవీపీ పరిధిలోని వైద్యులు, 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేసే బోధనా సిబ్బందికి ఈ విధానం అమలు కానుంది. అనుబంధ సిబ్బంది సైతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. డ్యూటీలకు డుమ్మా కొట్టే వారికి చెక్‌పెట్టడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నట్టు సర్కారు చెప్తున్నది.

కొత్త విధానం ఎందుకు వద్దంటే!

ఫేస్ రికగ్నైజేషన్, జియో ట్యాగింగ్‌తో తమ పర్సనల్ డాటా ప్రైవసీకి భంగం కలుగుతుందని వైద్యులు చెప్తున్నారు. ఇంటర్నెట్ సమస్య తలెత్తినప్పుడు, సర్వర్ డౌన్ అయినప్పుడు హాజరు పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు సుదీర్ఘ విధులు, నైట్ డ్యూటీలు చేస్తామని, ఫీల్డ్ వర్క్‌లకు వెళ్తామని వివరిస్తున్నారు. అబాస్ ప్రతిపాదన తమ వృత్తిని అవమానించడమేనని వాపోతున్నారు. ఇలాంటి చర్యలు డాక్టర్ల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని, ప్రజల్లో కూడా తమపై నమ్మకం పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది తక్కువగా ఉండడంతో తమపై పని భారం పడుతున్నదని, ఈ నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదని చెప్తున్నారు. ఇప్పటికే అటెండెన్స్ కోసం సాంకేతికత ఉందని వివరిస్తున్నారు. అబాస్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక పేపర్‌కు బదులు మరో ప్రశ్నపత్రం

- **ఇంటర్ పరీక్షల్లో ఘోర తప్పిదం**
- **ఓల్డ్ వర్షన్‌కు బదులు న్యూ వర్షన్ ప్రశ్నపత్రం ఇచ్చిన వైనం**
- **8 మంది విద్యార్థుల ఫలితాలు నిలిపివేత**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్షల్లో తప్పిదాలు మీద తప్పిదాలు.. తప్పుల మీద తప్పులు వెలుగుచూస్తున్నాయి. తాజాగా అధికారుల నిర్లక్ష్యంతో ఓ భారీ తప్పిదం వెలుగుచూసింది. ఏకంగా ఎనిమిది మంది విద్యార్థులకు ఒక ప్రశ్నపత్రానికి బదులు మరో ప్రశ్నపత్రాన్ని ఇచ్చిన విషయం బయటికొచ్చింది. విద్యార్థులకు ప్రశ్నపత్రం ఇవ్వడం.. పరీక్షలు రాయడం.. మూల్యాంకనం చేయడం అంతా జరిగిపోయింది. తీరా ఫలితాల విడుదల సమయంలో మాత్రం ఆయా విద్యార్థుల ఫలితాలు నిలిపివేశారు. పాసయ్యారా..? ఫెయిలయ్యారా ? అన్న విషయాన్ని వెల్లడించలేదు. అధికారుల తప్పిదాలకు విద్యార్థులను బలిచేశారు.

మరి ఇప్పుడు మార్కులేసేదెట్ల..

100 మార్కుల ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా, విద్యార్థులకేమో 80 మార్కుల ప్రశ్నపత్రం ఇచ్చారు. 20 మార్కుల ప్రాక్టికల్స్‌కు వీరు హాజరుకాలేదు. ఇంటర్ వెబ్‌సైట్‌లో ప్రైవేట్ విద్యార్థులుగా నమోదయ్యింది. మార్కులేలా వేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రాక్టికల్స్ నిర్వహించి మార్కులేయాలా.. ? లేక 80 మార్కులకే విద్యార్థులకు ఎన్ని మార్కులొస్తే అన్ని మార్కులు కేటాయించాలా? అన్న ప్రశ్నలొస్తున్నాయి. ప్రస్తుతానికైతే విద్యార్థుల ఫలితాలు నిలిపివేశారు. దీంతో విద్యార్థుల్లో టెన్షన్‌పట్టుకుంది. ఇదే విషయాన్ని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య దృష్టికి తీసుకెళ్లగా, రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

పొరపాటు జరిగిందిక్కడే..

2024-25లో ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టారు. ఈ ఒక్క సబ్జెక్టులో పరీక్షావిధానం మారింది. 80 మార్కులకు థియరీ, 20 మార్కులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. గతంలో ఇంగ్లిష్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉండవు.. కనుక వీరికి 100 మార్కులకు పరీక్షలు నిర్వహించాలి. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి ఓల్డ్ వర్షన్, రెగ్యులర్ విద్యార్థులకు కొత్త వర్షన్ ప్రశ్నపత్రాలివ్వాలి. కానీ ఓల్డ్ వర్షన్ ప్రశ్నపత్రాలివ్వాల్సిన వారికి న్యూ వర్షన్ ప్రశ్నపత్రాలిచ్చారు. 100 మార్కులకు నిర్వహించాల్సిన పరీక్షకు బదులు 80 మార్కుల ప్రశ్నపత్రం ఇచ్చారు. విద్యార్థులు యథాలాపంగా పరీక్షలు రాసేశారు. అధికారులు, పరీక్షాకేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ తప్పిదం జరిగింది. వాస్తవానికి సెంటర్లవారీగా ప్రైవేట్ (ఫెయిలైన), రెగ్యులర్ విద్యార్థుల నామినల్ రోల్స్ ఉంటాయి. ఈ రోల్స్‌లో అన్ని రకాల వివరాలుంటాయి. పైగా ఓల్డ్, కొత్త ప్రశ్నపత్రాల ప్యాకింగ్ కూడా వేర్వేరుగా ఉంటుంది. విద్యార్థులకు ఒకదానికి బదులు మరో ప్రశ్నపత్రం ఇవ్వడం... పొరపాటును గ్రహించకపోవడం గమనార్హం.



నల్లగొండలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

పహల్గాం దాడిపై నిరసనల వెల్లువ

- **నల్లగొండ, భైంసాలో బీఆర్ఎస్ ర్యాలీ**
- **పాలమూరులో ముస్లింల నిరసనలు**
- **కామారెడ్డిలో అమరులకు నివాళులు**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 25 : పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, ముస్లిం సంఘాల ఆధర్వంలో నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దమనకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసాలో బీఆర్ఎస్ నాయకులు ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముస్లింలు నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు చేపట్టారు. మహ్మదాబాద్‌లో భారతీయ ఏక్తా ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. కామారెడ్డిలో బీఆర్ఎస్‌వై కార్యకర్తలు ఉగ్రదాడి అమరులకు నివాళులర్పించారు.

'పాఠశాల విద్యలో సంస్కరణలు అవసరం'

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పలు సంస్కరణలు అవసరమని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యలో సంస్కరణలపై శుక్రవారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పాఠశాలలు రూపాంతరం చెందాలని వారు పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల ప్రకారం టీచర్లు కూడా మారాలని సూచించారు.

ఎస్సీ గురుకుల అడ్మిషన్లు ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో 239 గురుకుల కాలేజీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. గురుకుల కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీతో పాటు పలు వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వివరాలకు గురుకుల అధికారిక వెబ్‌సైట్ www.tgswreis.telangana.gov.in ను సందర్శించాలని, దరఖాస్తులను మే 15వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమానికి 4,639 కోట్లు

నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాలకు ప్రభుత్వం రూ.4,639.81కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కల్యాణలక్ష్మి పథకానికి రూ.2,173కోట్లు, బీసీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ రూ.124.44 కోట్లు, బీసీ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు రూ.250కోట్లు, స్కాలర్‌షిప్‌లకు రూ.139.37కోట్లు, ఫీజు రీయింబర్స్ స్కీమ్‌కు రూ.1,275కోట్లు, బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు రూ.80కోట్లు, బీసీ గురుకులాలకు రూ.358కోట్లు, ఈబీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు రూ.240కోట్లను మంజూరు చేసింది.

అగ్రనేతలే టార్గెట్‌గా అడవుల్లో జల్లెడ

కర్రె గుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్ • ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి

ములుగు, ఏప్రిల్25(నమస్తేతెలంగాణ) : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పరిధిలోని ములుగు జిల్లా కర్రెగుట్టల వద్ద ఐదు రోజులుగా మావోయిస్టు పార్టీ అగ్రనేతలే టార్గెట్‌గా పోలీస్ బలగాలు సెర్చింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పోలీస్ బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టగా హెలిక్యాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహిస్తూ అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దీంతో జిల్లాలోని వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు పీఎల్‌జీఏ మహిళా సభ్యులు మృతి చెందగా, పలువురు మావోయిస్టులు గాయపడినట్టు బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. మావోయిస్టు పార్టీకి చెందిన డంపు లభ్యమైనట్టు ప్రచారం జరుగుతున్నది. డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్, సీఆర్పీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ చేపట్టిన ఈ జాయింట్ ఆపరేషన్ బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పీ నేతృత్వంలో కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. కర్రెగుట్టల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆపరేషన్ హిడ్మా పేరుతో మావోయిస్టు పార్టీ మిలటరీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న హిడ్మాను టార్గెట్‌గా చేసుకొని కేంద్ర బలగాలు సెర్చింగ్ నిర్వహిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం హిడ్మా రెండు ప్లాటూన్ దళాలను వెంట పెట్టుకొని కర్రెగుట్టలకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలో ఉన్న కర్రెగుట్టలపై మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయని అంచనా వేసినప్పటికీ అనూహ్యంగా కర్రెగుట్టల వద్ద హిడ్మా వచ్చాడనే సమాచారంతో అధికారులు కేంద్ర బలగాలను అప్రమత్తం చేసినట్టు తెలుస్తున్నది. మిలటరీ ప్లాటూన్ బదలాయించడంతో పాటు మావోయిస్టుల శిక్షణకు సంబంధించిన వ్యవహారాలను చక్కబెట్టేందుకు హిడ్మా కర్రెగుట్టలపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు పోలీసు అధికారులు భావిస్తున్నారు. కర్రె గుట్టలపై మావోయిస్టులు మందు పాతర్లతో పాటు బంకర్లను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తుంది. కర్రె గుట్టల వద్ద ఛత్తీస్‌గఢ్ బలగాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో గుట్టమీద ఉన్న మావోయిస్టులు తప్పించుకొని రాష్ట్రంలోకి చొరబడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసిన అధికారులు సరిహద్దు గ్రామాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నట్టు తెలుస్తున్నది.

'ఓదెల-2'లో అభ్యంతరకర దృశ్యాలు

తొలగించాలని సైబరాబాద్ కమిషనర్ సెన్సార్ బోర్డుకు బీసీ కమిషన్ లేఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఓదెల-2 చిత్రంలో కులం పేరుతో ఉన్న అభ్యంతరకర దృశ్యాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ కమిషనర్‌తోపాటు ప్రాంతీయ సెన్సార్ బోర్డు అధికారికి బీసీ కమిషన్ వేర్వేరుగా లేఖలు రాసింది. అత్తాపూర్ స్టేషన్‌లో ఫిర్యా దు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు జరిపి ప్రొడ్యూసర్, డైరెక్టర్, రచయిత, నటులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అభ్యంతరకర పదాలు ఉన్న చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని కమిషన్ తప్పు పట్టింది.

'సంస్కృతం' వార్తలు అవాస్తవం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంటర్‌లో సంస్కృతం రగడపై ఎట్టకేలకు ఇంటర్ విద్యాశాఖ స్పందించింది. రోజుకో వివాదానికి దారి తీస్తుండటంతో శుక్రవారం స్పష్టత ఇచ్చింది. ప్రభుత్వ కాలేజీల్లో తెలుగుకు ప్రత్యామ్నాయంగా సం స్కృతం ప్రవేశపెడుతున్నట్టు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) జయప్రద బాయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా రిక్రూట్‌మెంట్‌లో 10 సంస్కృతం లెక్చరర్ పోస్టులు భర్తీ అయ్యాయని, వారికి పోస్టింగ్‌ఇవ్వడం కోసం పలు వివరాలపై ఆరా తీశామని తెలిపారు.

ప్రభాకర్‌రావుకు బెయిల్ ఇవ్వండి

ఫోన్ల ట్యాపింగ్‌పై హైకోర్టులో వాదనలు • తదుపరి విచారణ 29కి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రధాన నిందితుడైన రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ప్రభాకర్‌రావు వయసుతోపాటు ఆయన అనారోగ్య పరిస్థితులను, మచ్చలేని ఆయన సేవలను, గత 30 ఏండ్ల సర్వీసులో ఆయన సాధించిన పతకాలను దృష్టిలో పెట్టుకుని అరెస్టు చేకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదించారు. కేసు దర్యాప్తునకు ఆయన సహకరిస్తారని, షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు పూర్తయిందని, పోలీసులు చార్జిషీట్ కూడా దాఖలు చేశారని గుర్తుచేశారు. ఈ కేసులో 6వ నిందితుడు శ్రవణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినందున పిటిషనర్‌కు కూడా ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నప్పటికీ దర్యాప్తు అధికారులకు సహరిస్తూనే ఉన్నారని తెలిపారు. ఫోన్ల ఇంటర్ సెషన్ డిస్ట్రక్షన్ ఏదైనా రివ్యూ కమిటీ నిర్ణయం మేరకే జరుగుతుందని, ఆ కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ ఉంటారని పేర్కొంటూ.. ఈ కేసులో వారి వాంగ్మూలాలను ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినవారిని కాకుండా ఆర్ఎస్ఐ, ఎస్ఐ లాంటి అధికారుల వాంగ్మూలాలను తీసుకుని పిటిషనర్‌ను బాధ్యుడిని చేస్తున్నారని తప్పుపట్టారు. రివ్యూ కమిటీలో పిటిషనర్ సభ్యుడు కూడా కాదని, హార్డ్ డిస్క్ ధ్వంసంలో పిటిషనర్ పాత్ర లేదని చెప్పారు.

బెయిల్‌కు పతకాలు ప్రామాణికం కాదు

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రతివాదన చేస్తూ.. వయసు, అనారోగ్య పరిస్థితులను అడ్డంపెట్టుకుని కేసు విచారణ నుంచి పిటిషనర్ తప్పించుకునేందుకు వీల్లేదని పేర్కొన్నారు. ఫోన్ల ట్యాపింగ్ కేసు నమోదవగానే ప్రభాకర్‌రావు అమెరికాకు పారిపోయారని, ఆయన పాస్‌పోర్టును రద్దు చేయడంతోపాటు రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయడంతో విధిలేక భారత్‌కు తిరిగి రాబోతున్నారని పేర్కొంటూ.. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. తదుపరి విచారణను 29కి వాయిదా పడింది.

రేవంత్‌కు హైకోర్టులో ఊరట

బీజేపీ కేసులో వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగే ఈ కేసు విచారణకు రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో జరిగిన ప్రచార సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యల వల్ల బీజేపీ పరువుకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కౌంటర్ వేయాలని కాసం వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీచేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను జూన్ 13వ తేదీకి వాయిదా వేశారు.

తీన్మార్ మల్లన్నకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో తమపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి సంయుక్తంగా దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదిగా ఉన్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) తోపాటు పోలీసులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేటీఆర్, జగదీశ్‌రెడ్డి నకిలీ వీడియోలను విడుదల చేసి తనను అప్రతిష్టపాలు చేశారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో నిరుడు మే 25న కేసు నమోదైంది.

వ్యవసాయంలో ఏఐ వినియోగం

2047 నాటికి మానవరహిత వ్యవసాయం లక్ష్యంగా ప్రణాళికలు

బిట్స్ పిలానీ, అగ్రికల్చర్ వర్సిటీ మధ్య అవగాహనా ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయంలో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీ మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలోని అగ్రిహబ్‌లో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీ రాంగోపాల్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఆయా సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం పరిశోధనా ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనల్లో సలహాలకు దోహదం చేయనున్నట్టు బిట్స్ పిలానీ ఉప కులపతి ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు పేర్కొన్నారు. అగ్రికల్చర్ వర్సిటీ ఉప కులపతి జానయ్య మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం రెండోదని, 2047 నాటికి మానవరహిత వ్యవసాయమే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్, బిట్స్ పిలానీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అరవైలో.. టీనేజర్లతో పోటీ

- **ఇంజినీరింగ్, ఫార్మసీ చదివేందుకు వృద్ధుల ఆసక్తి**
- **ఎప్‌సెట్ పరీక్షకు అనుమతించిన జేఎన్టీయూ**
- **ఎప్‌సెట్‌కు 3.06లక్షల దరఖాస్తులు**
- **ఈ నెల 29 నుంచి పరీక్షలు ప్రారంభం**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : అరవై ఏండ్ల వయస్సులోనూ మాకేం తక్కువ అంటూ టీనేజర్లతో పోటీపడుతున్నారు కొందరు వృద్ధులు. అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షకు 56, 58 ఏండ్ల వయస్సు వారు దరఖాస్తు చేశారు. 56 ఏండ్లగల పెద్దాయన ఇంజినీరింగ్‌కు, 58ఏండ్లున్న మరో పెద్దాయన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి దరఖాస్తు చేశారు. ఎప్‌సెట్ దరఖాస్తు స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. ఎప్‌సెట్‌కు 3.06 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌కు 2.20లక్షలు, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 86వేలు, రెండు పేపర్లు రాసేందుకు 254 మంది చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 29 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి మూడు సెషన్లు, ఇంజినీరింగ్‌కు మొత్తం 6 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 112, ఇంజినీరింగ్ విభాగం పరీక్షల కోసం 124 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఖమ్మంలో జరిగిన ఉద్యోగ సదస్సులో మాట్లాడుతున్న టీజీఈ జేఏసీ చైర్మన్ జగదీశ్వర్

సమస్యలు పరిష్కరించకుంటే సత్తా చూపుతాం

- **పెండింగ్‌లోనే ఐదు డీఏలు, పీఆర్సీ**
- **బకాయిలు రూ.650 కోట్ల చొప్పన చెల్లిస్తామని చెప్పి.. పైసా ఇవ్వలే**
- **పాతపెన్షన్ పాలసీ అమలు చేయాలి**
- **టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం, ప్రధాన కార్యదర్శి ఏలూరి**

ఖమ్మం, ఏప్రిల్ 25 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే తమ సత్తా ఏమిటో సీఎం రేవంత్‌రెడ్డికి చూపించాల్సి వస్తుందని టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 16 నెలలైనా మంత్రుల పేషీల్లో ఇప్పటికీ ఉద్యోగ సంఘ నాయకులను గుర్తించడంలేదని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన ర్యాలీ నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాలు వరకు కొనసాగింది. టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిలు నెలకు రూ.650 కోట్ల చొప్పున చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయి కూడా విదల్చలేదని విమర్శించారు.

ఇస్రో మాజీ చైర్మన్
కస్తూరి రంగన్ కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో బెంగళూరులో మృతి
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి సంతాపం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ (84) కన్నుమూశారు. గత కొన్ని నెలల నుంచి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం బెంగళూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరి రంగన్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అంతిమ నివాళులర్పించేందుకు ఆయన భౌతిక కాయాన్ని ఈ నెల 27న రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. కస్తూరి రంగన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.

డాక్టర్ కస్తూరి రంగన్ జీవిత విశేషాలు

కేరళలోని ఎర్నాకుళంలో సీఎం కృష్ణస్వామి, విశాలాక్షి దంపతులకు 1940 అక్టోబర్ 24న జన్మించిన కస్తూరి రంగన్‌కు తమిళనాడు మూలాలు ఉన్నాయి. ఆయన కుటుంబం త్రిసూర్ జిల్లాలోని చలకుడిలో స్థిరపడింది. కస్తూరి రంగన్ తల్లి పాలక్కడ్ అయ్యర్ కుటుంబానికి చెందినవారు. 1990 నుంచి 1994 వరకు యూఆర్‌ఏసీ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ కస్తూరి రంగన్.. ఆ తర్వాత 1994 నుంచి 2003 వరకు 9 ఏండ్లపాటు ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే ఇస్రో తొలి లూనార్ మిషన్ దిశగా అడుగులు వేసింది. 2003-2009 వరకు రాజ్యసభ సభ్యునిగా, ప్రణాళికా సంఘం సభ్యునిగా సేవలందించిన డాక్టర్ రంగన్.. నూతన జాతీయ విద్యా విధాన ముసాయిదా కమిటీ చైర్‌పర్సన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ చాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ చైర్మన్‌గా, బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. రంగన్ సేవలకు గుర్తింపుగా కేంద్రం 2000 సంవత్సరంలో ఆయనను 'పద్మ విభూషణ్' అవార్డుతో సత్కరించింది.

ఆదిల్ X ఆదిల్

ఒకరిది త్యాగం.. మరొకరిది ఉన్మాదం



న్యూఢిల్లీ: వారిద్దరి పేర్లు 'ఆదిల్'యే. అయితే ఒకరు మతం పేరుతో మారణకాండకు దిగగా, మరొకరు మతం కన్నా మానవత్వం ముఖ్యమని చాటారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందగా, అందులో గుర్రాలు నడిపించే సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా కూడా ఉన్నాడు. అలాగే కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదుల్లో లష్కరే తాయిబాకు చెందిన ఆదిల్ థోకర్ అలియాస్ ఆదిల్ గురెస్ కూడా ఉన్నాడు. బిజ్‌బెహారాలోని గురీ గ్రామానికి చెందిన ఆదిల్ థోకర్ ఉగ్రవాదం వైపు అడుగులేసి తుపాకీ చేతపట్టాడు. మరోవైపు, ఆదిల్ హుస్సేన్ పహల్గాం దాడి సమయంలో ముష్కరులకు ఎదురెళ్లి పర్యాటకులను రక్షించే ప్రయత్నం చేశాడు.

సివిల్స్‌లో నెగ్గిన గొర్రెల కాపరి కుమారుడు



ముంబై, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): గొర్రెలను మేపుతూ సంచార జీవనం సాగించే ఒక గొర్రెల కాపరి కుమారుడు సివిల్స్ ఎంట్రన్స్‌లో 551 ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన గొర్రెల కాపరి కుమారుడు బీర్ దేవ్ సిద్ధప్ప దోనే ఈ ఘనత సాధించాడు. యూపీఎస్సీ సివిల్స్ ఎంట్రన్స్ ఫలితాలు విడుదల చేసిన సమయంలో బీర్ దేవ్ తండ్రితో కలిసి కర్ణాటక, బెల్గాంలోని అథని గ్రామానికి గొర్రెల మందను తీసుకుని వెళ్లాడు. ఫలితం తెలిసిన వెంటనే అథనిలోని స్థానిక గొర్రెల కాపరులు బీర్ దేవ్‌కు ధన్ గర్ తలపాగా చుట్టి ఒక మేకను బహుమతిగా ఇచ్చి సత్కరించారు. కొల్హాపూర్ జిల్లా కాగల్ తాలూకాలోని యామగే గ్రామానికి చెందిన బీర్ దేవ్ దోనె తండ్రి గొర్రెల పెంపకం చేస్తూ సంచార జీవనం సాగించే వాడు. బీర్ దేవ్ చదువుకునే రోజుల నుంచే ఐపీఎస్ కావాలనుకుని కలలు కని, ఆ మేరకు ప్రయత్నాలు చేశాడు. రెండు సార్లు ఫెయిల్ అయినా పట్టు వదలలేదు. 27 సంవత్సరాల వయసులో మూడో ప్రయత్నంలో 551 ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకుతో బీర్ దేవ్ దోనే‌కు ఐపీఎస్‌గా ఎంపికయ్యే అవకాశం ఉంది.

రాజ్యాంగబద్ధంగానే వక్ఫ్ సవరణ చట్టం

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం
- ముస్లిమేతరులు వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ఉండవచ్చునని సమర్థన

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం, 2025 భారత రాజ్యాంగ పునాదులపై దృఢంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు నిరాకరణకు గురికాకుండా ఈ చట్టంలోని నిబంధనలు భరోసానిస్తున్నాయని చెప్పింది. ఈ సవరణల వల్ల న్యాయపరమైన జవాబుదారీతనం, పారదర్శకత, నిష్పాక్షికత వస్తాయని చెప్పింది. ఇవన్నీ రాజ్యాంగ విలువలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగానే ఉన్నట్లు తెలిపింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ అఫిడవిట్‌ను సమర్పించింది.

వక్ఫ్ బై యూజర్ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించకపోతే?

వక్ఫ్ బై యూజర్ ఆస్తులు ఈ చట్ట సవరణలు అమల్లోకి రావడానికి పూర్వం రిజిస్ట్రేషన్ చేయించకపోతే, ఆ ఆస్తుల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నకు కేంద్రం స్పందిస్తూ, 1923 నుంచి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అయినప్పటికీ, అటువంటి రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి దస్తావేజులపరమైన రుజువులు అక్కర్లేదని చెప్పింది. దస్తావేజులు లేని వక్ఫ్ బై యూజర్ సహా వక్ఫ్ ఆస్తులపై ఈ చట్టం ప్రభావం పడుతుందని ప్రచారం చేస్తున్నారని, ఇది తప్పు అని చెప్పింది. సెక్షన్ 3(1)(ఆర్)లోని ప్రొవిజో ప్రకారం 'వక్ఫ్ బై యూజర్'గా రక్షణ పొందాలంటే, ఈ సవరణ కానీ, అంతకుముందు కానీ, ట్రస్ట్, ఒప్పందం లేదా ఏదైనా దస్తావేజు కావాలని గట్టిగా పట్టుబట్టడం లేదని చెప్పింది. ఈ ప్రొవిజో ప్రకారం రక్షణ పొందడానికి తప్పనిసరిగా కావలసినది, అటువంటి 'వక్ఫ్ బై యూజర్'ను 2025 ఏప్రిల్ 8 నాటికి రిజిస్ట్రేషన్ చేయించి ఉండటమేనని తెలిపింది.

వక్ఫ్ బోర్డులను రాష్ట్రాల చట్టాల పరిధిలోని హిందూ ఎండోమెంట్స్‌కు సంబంధించిన కమిషనర్లు/బోర్డులతో పోల్చడం సరైనది కాదని కేంద్రం తెలిపింది. వక్ఫ్ స్వభావం ప్రత్యేకమైనదని, దానికి తగిన వైఖరిని అవలంబించవలసిన అవసరం ఉంటుందని చెప్పింది. మతపరమైనది కానటువంటి, దాతృత్వ ప్రయోజనాల కోసం కూడా వక్ఫ్‌ను ఉపయోగిస్తారని తెలిపింది. ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డుల్లో ఉండవచ్చునని పేర్కొంది.



'జాతిపిత' పాటను ఆవిష్కరించిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ తెలంగాణ జాతిపిత' పాటను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌తో కలిసి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో విడుదల చేసిన ఈ పాటను మానుకోట ప్రసాద్ రచించారు.

నాడు..నేడు..రేపు.. తెలంగాణకు కేసీఆరే రక్షకుడు

- 25 ఏండ్లుగా ఆయన చుట్టే రాజకీయాలు
- తెలంగాణవాదం పరీక్షకు నిలబడ్డ ప్రతీసారి బెబ్బులిలా లేచి గర్జించిన కేసీఆర్
- 'పోరు'సంతకంగా పొత్తుల వ్యూహం
- ఉద్యమ పార్టీగా, అధికార పార్టీగా, ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్‌ది చెరిగిపోని ముద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): నాడు... నేడు... రేపు... తెలంగాణకు రక్షకుడు కేసీఆరే. రెండున్నర దశాబ్దాలుగా, అనేక సందర్భాల్లో ఇది నిరూపణ అవుతూనే ఉన్నది. పాతికేండ్లుగా కేసీఆర్ చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. ఆయన మాట్లాడితే సంచలనం! మాట్లాడకపోతే అంతకన్నా పెద్ద సంచలనం!! తెలంగాణలో ఇప్పుడు ఉద్యమం లేదు, బీఆర్‌ఎస్ అధికారంలో లేదు. అయినా, రాజకీయాలు కేసీఆర్ చుట్టే పరిభ్రమిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీకి 17 నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి, బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడానికి మధ్య తేడా 2.05% ఓట్లే! అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన ప్రజాగ్రహాన్ని మూటగట్టుకున్నది. గతంలో మరి ఏ ఇతర ప్రతిపక్ష పార్టీకి దక్కని గౌరవాన్ని అతిస్వల్ప కాలంలోనే ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఇస్తున్నారు. నిజానికి ఇప్పట్లో ఎన్నికలు లేకపోయినా, ప్రజల్లో రోజురోజుకూ ఈ ఆకాంక్ష ద్విగుణీకృతం అవుతుండటం కేసీఆర్ పట్ల తరగని ఆదరాభిమానాలకు నిదర్శనం.

ఆ పేరే సంచలనం

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మొదలుకొని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితోపాటు తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వంటి నేతల దాకా.. ఏ ఒక్కరూ.. అనునిత్యం కేసీఆర్ నామస్మరణ చేయకుండా ఉండలేదంటే అతిశయోక్తి కాదు. నాటి నుంచి నేటి దాకా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా.. ఏ మీడియాకు అయినా కేసీఆరే హాట్‌టాపిక్! ఎన్నికల

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా..

కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్లు **92,33,784 (39.40%)**
బీఆర్‌ఎస్‌కు వచ్చిన మొత్తం ఓట్లు **87,51,391 (37.35%)**
రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా **4,82,393 (2.05%)** మాత్రమే

రాజకీయాల్లో బీఆర్‌ఎస్ అప్రతిహత విజయాలు సాధించినా, విజయం అంచుల దాకా వెళ్లి ఆగిపోయినా, ఆఖరికి ఎన్నికల్లో పోటీచేయకపోయినా గడచిన 25 ఏండ్లుగా కేసీఆర్ పేరులేకుండా రాజకీయాలు సాగలేదు. 2001లో బీఆర్‌ఎస్‌ను స్థాపించి, స్వరాష్ట్ర సాధన కోసం 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటాన్ని నడిపి, సాధించుకున్న తెలంగాణను దేశం గర్వపడేలా తీర్చిదిద్దిన పదేండ్లూ కేసీఆర్ చుట్టే రాజకీయాలు నడిచాయి. కేసీఆర్... ఉద్యమంలో లక్షల మెదళ్లను ఆలోచింపజేసినా, తన మాటల తూటాలతో మరఫిరంగులు పేల్చినా అవి తెలంగాణ రక్షణ కోసమేనని 25 ఏండ్ల చరిత్ర స్పష్టంచేస్తున్నది.

పొత్తులను ఒక వ్యూహంగా..

2001లో బీఆర్‌ఎస్‌ను స్థాపించి, 2014లో రాష్ట్రాన్ని సాధించే దాకా కేసీఆర్ అలుపెరుగని పోరాటం చేశారు. పుట్టినగడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని అవమానాలను దిగమింగారు. తెలంగాణ ప్రజల కోసం అనేక సందర్భాల్లో పదవులను గడ్డిపోచల్లా విసిరికొట్టారు. 'తెలంగాణ నినాదం నుంచి నేను తప్పుకుంటే.. నన్ను రాళ్లతో కొట్టి చంపండి' అంటూ పిలుపునివ్వడం కేసీఆర్‌కే సాధ్యమైంది. తెలంగాణకు తాను 'అడ్డమూ కాదు.. నిలువూ' కాదు అన్నవాళ్లతోనే 'జై తెలంగాణ' అనిపించడం.. 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు' అన్నవాళ్లతోనే 'అనుకూలం' అని లేఖ రాయించడం ఆయన వ్యూహ చతురతకు నిదర్శనం. ఎదుటివారి రాజకీయ అనివార్యతలను తెలంగాణకు అనుకూలంగా మలచి దానినే తెలంగాణకు బలంగా మార్చిన తీరు అద్భుతం. 2004లో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకొని, అధికారంలోకి వచ్చిన తరువాత పొత్తు ధర్మాన్ని వీడిన కాంగ్రెస్ పార్టీకి, ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో తనదైన శైలిలో జవాబిచ్చారు. తెలంగాణ పదాన్నే అసెంబ్లీలో నిషేధించిన చంద్రబాబుతో 2009తో ఎన్నికల పొత్తుపెట్టుకొని, తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకునే అనివార్యతను టీడీపీకి సృష్టించారు. దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఒప్పుకుంటే తెలంగాణ ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ మెలికపెట్టిన సందర్భంలో, 36 రాజకీయ పార్టీలను ఒప్పించి, తెలంగాణకు అనుకూలంగా లేఖలు తెప్పించారు.

తెలంగాణ వాదానికి పరీక్ష పెట్టిన ప్రతీసారి..

'అసలు తెలంగాణ వాదమే లేదు' అంటూ సమైక్య పాలకులు రాష్ట్ర సాధన ఉద్యమాన్ని అవహేళన చేస్తున్న దశలో, కేసీఆర్ తన రాజకీయ జీవితాన్నే పణంగాపెట్టిన సందర్భాలు అనేకం. ప్రాథమిక వ్యవసాయ కేంద్రం డైరెక్టర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కేసీఆర్.. ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ఏనాడూ ఓటమిని ఎదుర్కోని నాయకుడిగా చరిత్ర సృష్టించారు. తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతినిధిగా బయలుదేరారు. 2001లో జరిగిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో అద్భుత విజయాన్ని ఆవిష్కరించిన కేసీఆర్.. 2004లో ఒకేసారి సిద్దిపేట ఎమ్మెల్యేగా, కరీంనగర్ ఎంపీగా రెండుచోట్లా విజయం సాధించడం విశేషం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే ఏకైక లక్ష్యంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఎంపీగా ఢిల్లీకి వెళ్లి, నాటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ వచ్చారు. యూపీఏ ప్రభుత్వ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని చేర్పించారు. అయితే, యూపీఏ ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబించడంతో కేంద్ర మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారు. ఆ తరువాత 2006లో కరీంనగర్ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి, తద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షను దేశవ్యాప్తంగా మరోసారి చాటిచెప్పారు. ఆ తరువాత ఉత్తర తెలంగాణలోని రెండు మూడు జిల్లాలకే తెలంగాణవాదం పరిమితం అంటూ సమైక్య పాలకులు, వారి ప్రలోభాలకు లోనైన స్థానిక నాయకులు చేస్తున్న వాదనలను తుత్తునియలను చేసేందుకు, 2009 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేశారు. అక్కడ ఘన విజయం సాధించారు.

తెలంగాణ సర్వనామం కేసీఆర్

'తెలంగాణ అంటే కేసీఆర్... కేసీఆర్ అంటే తెలంగాణ' అన్నట్టుగా పాతికేండ్ల ప్రస్థానమే కా దు.. భవిష్యత్ కూడా ఇదే రీతిన సాగుతుందని 17 నెలలుగా నిరూపితం అవుతూనే ఉన్నది. 'తెలంగాణకు రక్షకుడు కేసీఆరే. రక్షణ క వచం బీఆర్‌ఎస్సే' అనే నిర్ధారణకు ప్రజలు రావ డం ఆ యనపై ఉన్న అచంచల విశ్వాసానికి నిదర్శనం.

తెలంగాణ ఆశాజ్యోతి బీఆర్‌ఎస్

- రాష్ట్ర ప్రజలకు కన్నతల్లిలాంటి పార్టీ అది
- అలాంటి పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత నాలుగు కోట్ల ప్రజలదే..
- అదే మనల్ని కాపాడుతుంది
- తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల ఆశాజ్యోతి బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య స్పష్టంచేశారు. అది తెలంగాణ ప్రజల కన్నతల్లిలాంటిదని, అలాంటి పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలపైనే ఉన్నదని చెప్పారు. 25 ఏండ్లు పూర్తిచేసుకుంటున్న ఇంటి పార్టీని కాపాడుకుంటే అది మనలను కాపాడుతుందని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. 'బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటై 25 ఏండ్లు అవుతుంది. నా కన్న తల్లి అంటే నాకెంత గొప్పనో.. రాష్ట్ర సాధన కోసం పెట్టిన ఆ పార్టీ, జెండా అంతే సమానమైనది' అని చెప్పారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీని కచ్చితంగా కాపాడుకోవాలి, రక్షించుకోవాలి, దానిని బతికించుకోవాలి.. అని పిలుపునిచ్చారు. దానిని బతికించుకుంటే అది మనలను బతికిస్తదని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను కనుక మనం చంపేసి, కాలుష్యాన్ని పీలిస్తే అది మనలనే చంపేస్తదని హెచ్చరించారు. రాష్ట్ర సాధన కోసం ఏర్పాటై అనేక ఆటుపోట్లకు గురై, అనేక అవమానాలకు గురై, ఇంత సుదీర్ఘకాలం మనగలిగిన పార్టీ దేశంలో బీఆర్‌ఎస్ ఒక్కటేనని గుర్తుచేశారు.

ప్రతి గడప నుంచి తరలివెళ్లి బీఆర్‌ఎస్ సత్తా చాటుదాం

రేపటి రజతోత్సవసభను విజయవంతం చేద్దాం

-షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 25: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గడప నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి బీఆర్‌ఎస్ సత్తా చాటుదామని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని తెలిపారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవనం సాగించేలా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు చేపట్టినట్టు గుర్తుచేశారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీని వదిలిపోయే వాళ్ల గురించి ఆలోచించాల్సిన అసరంలేదని తెలిపారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమి లేదని చెప్పారు.



షాబాద్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

ఆట, పాటకు ఆయుధమే గులాబీ జెండా!

- పరాయి పాలనను పాతరేసింది ఇదే జెండా
- ఉమ్మడి పాలనలో పాట పాడాలంటేనే భయానకం
- కేసీఆర్ పార్టీతోనే సాంస్కృతిక పునరుజ్జీవం
- ఆ జెండా నీడలోనే ఆట, పాటలకు ఊపిరి
- రేపటి బీఆర్‌ఎస్ సభలో ధూంధాంకు రెడీ
- 'నమస్తే తెలంగాణ'తో మాజీ ఎమ్మెల్యే రసమయి



తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రిహార్సల్ చేస్తున్న కళాకారులతో మాజీ ఎమ్మెల్యే రసమయి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి పాలనలో తెలంగాణ పాట పాడాలంటేనే భయానక పరిస్థితులు ఉండేవి.. వాటిని తట్టుకుని పాడితే కేసులు, హత్యలు జరిగేవి.. అలాంటి దశలో ఆట, పాటకు గులాబీ జెండాయే ఆయుధంగా నిలిచింది.. అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారధి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్ పునరుద్ఘాటించారు. ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో కళా ప్రదర్శనలపై తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో కళాకారుల రిహార్సల్స్‌లో పాల్గొన్న ఆయన శుక్రవారం పలు విషయాలను నమస్తే తెలంగాణతో పంచుకున్నారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే.. ఒకప్పుడు తెలంగాణ పాట, మాట వెక్కిరింతకు గురయ్యేది. తెలంగాణోళ్లను హీనంగా చూసేవాళ్లు. మాట్లాడితే నవ్వుకునేవాళ్లు. సినిమాల్లోనైతే తెలంగాణ మాట, పాట జోకర్లకు వాడి హేళన చేసేవాళ్లు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం పాటలు పాడితే కేసులు పెట్టేవాళ్లు. నక్సలైట్ అని ముద్రవేసి ఎన్‌కౌంటర్ చేసేవాళ్లు. అసలు తెలంగాణ రాష్ట్రం సాకారమనేది ఈ జన్మలో చూడలేమేమో అనేలా అప్పటి పరిస్థితులు ఉండేవి. కానీ, ఒకే ఒక్కడు.. బక్కపల్చని ధైర్యశాలి.. ఆయనే కేసీఆర్. తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, సాంస్కృతిక కళలు, సంప్రదాయాలన్నింటిపై పూర్తి అవగాహనతో ఉన్న ఆయన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించాడు. ఆ పార్టీ గులాబీ జెండా నీడలో తెలంగాణ ఆటలు, పాటలు ఊపిరి పోసుకున్నాయి. కేసీఆర్ అనే వ్యక్తి లేకుండా తెలంగాణ పాట లేదు. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టాక.. 2002 నుంచి ధూంధాంలు షురూ అయ్యాయి. కేసీఆర్ ఎక్కడ సభ పెట్టినా.. అక్కడ పాట శికం ఊగాలే.. తెలంగాణ ఎందుకు అవసరమో.. తెలంగాణ ఎంత ఘోసపడుతుందో పాట రూపంలో వివరించినం. ఈ ధూంధాంలను కేసీఆరే ప్రోత్సహించేవారు. కళాకారులకు ఎంతగానో గౌరవం ఇచ్చి వారికి ప్రోత్సాహం అందించేవారు. తెలంగాణ పడుతున్న కష్టాలను పాటల రూపంలో ప్రతి పల్లెకు చేరాలని కేసీఆర్ చెప్పేవారు.

ఎల్కతుర్తిలో విభిన్న కళారూపాల ప్రదర్శన

బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచే ధూంధాం పండుగ షురూ అవుతుంది. వేదికపై వందలాది కళాకారులు తెలంగాణ ఆట, పాటలను విభిన్న సాంస్కృతిక రూపాల్లో ప్రదర్శిస్తారు. బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. ఓరుగల్లు సభకు తరలిరా, ఇది తెలంగాణ కోటి రతనాల వీణ నుంచి, సారే కావలంటున్నరే తెలంగాణ పల్లెలోనా.. అన్న పాటల వరకు పెద్ద ఎత్తున కళారూపాలు ప్రదర్శిస్తారు. వివిధ రూపాల్లో ప్రజల్లో కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటుతారు. పదేండ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉండి కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచేల పాలన అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంకా ఎటువంటి మేలు ప్రజలకు జరగలేదు. అందుకే మళ్లీ కేసీఆర్ సారే కావాలని జనం కోరుకుంటున్నారు. ఆయా అంశాలపై వివిధ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయి.. అని రసమయి బాలకిషన్ నమస్తే తెలంగాణకు వివరించారు. తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగే రిహార్సల్స్‌లో కళాకారుడు మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.

మళ్లీ ఆంధ్రాతో కలిపేందుకు కాంగ్రెస్ కుట్రలు

- తిప్పికొట్టనున్న తెలంగాణ ప్రజలు
- ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ భారీ సభ
- తెలంగాణలో ఇంటింటా పండుగే
- మండుతున్న కాంగ్రెస్ నేతల కండ్లు
- బీఆర్‌ఎస్ నేత గట్టు రామచంద్రరావు



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని మళ్లీ ఆంధ్రాతో కలిపేందుకు ఇక్కడి కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారని బీఆర్‌ఎస్ నేత గట్టు రామచంద్రరావు ఆరోపించారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు ఎజెండాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ భారీ రజతోత్సవ సభ జరుపుకుంటుంటే.. తెలంగాణలోని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొన్నదని తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలకు మాత్రం కండ్లు మండుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రసంగం వినాలని ఎల్కతుర్తికి తండోపతండాలుగా జనాలు తరలివస్తుంటే, కాంగ్రెస్, బీజేపీ నేతలు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. టీఆర్‌ఎస్ సభనా? బీఆర్‌ఎస్ సభనా? అంటూ కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడుతున్నారని, మరి ఇప్పుడున్న కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ ఒక్కటేనా? అంటూ ప్రశ్నించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇంతకు జాతీయ కాంగ్రెస్‌లో ఉన్నారా? ఇందిరా కాంగ్రెస్‌లో ఉన్నారా? అని సందేహం వ్యక్తంచేశారు. కేసీఆర్ తన అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని మరో కాంగ్రెస్ నేత అంటున్నారని, అట్లయితే రేవంత్‌రెడ్డి తన సీఎం పదవి నుంచి తప్పుకుంటారా? అని సూటిగా ప్రశ్నించారు. జై సోనియా అని అంటున్న కాంగ్రెస్ నేతలు జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ నేతలకు తెలంగాణపై ఎప్పుడూ ప్రేమ లేదని విమర్శించారు.

న్యాయవాదులు రజతోత్సవంలో భాగంకావాలి

- బీఆర్‌ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ భరత్



వరంగల్ లీగల్, ఏప్రిల్ 25: రాష్ట్ర సాధనలో కేసీఆర్ వెన్నంటి నిలిచిన న్యాయవాదులు పార్టీ రజతోత్సవ సంరంభంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సోమ భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ పార్టీ ఆఫీసులో వరంగల్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. న్యాయవాదులు మౌనంగా ఉంటే అది ఉగ్రవాదానికి మించిన నేరమవుతుందని చెప్పారు.

బీఆర్‌ఎస్ సభపై కుట్రలు

మహబూబాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ సభపై రాష్ట్ర ప్రభుత్వం రోజుకో కుట్రకు తెరలేపుతున్నది. తాజాగా మహబూబాబాద్ జిల్లా రవాణాశాఖ అధికారి ప్రైవేటు పాఠశాలల బస్సులను ఇతరత్రా వినియోగించొద్దని ఉత్తర్వులు జారీచేశారు. అలా వినియోగిస్తే అపరాధ రుసుముతో పాటు బస్సులను సీజ్ చేస్తామని, సీటుకు రూ.3285 పన్ను వసూలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా సభను అడ్డుకుంటున్నదని బీఆర్‌ఎస్ నేతలు మండిపడుతున్నారు.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. ఈ వ్యవహారంపై అడ్మినిస్ట్రేషన్ విభాగం స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారుపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన నేపథ్యంలో ఇప్పటికైనా అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. యూనివర్సిటీ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ కోసం తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 2300 ఎకరాల భూములను వర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేద్దాం

యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో వర్సిటీకి కేటాయించిన భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడం కోసం అడ్మినిస్ట్రేషన్ విభాగం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇందుకు భూముల రిజిస్ట్రేషనే పరిష్కారమని తెలిపారు. క్యాంపస్ నుంచి పోలీసులు, బుల్డోజర్లను వెంటనే వెనక్కి పంపించాలని కోరారు. చెట్లు నరికేసిన ప్రాంతంలో పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి సూచించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లకు అధికారులు సానుకూలంగా స్పందించారని సమావేశం తర్వాత విద్యార్థులు తెలిపారు. కేంద్ర సాధికార కమిటీ నివేదికలో పేర్కొన్నట్టుగానే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు వర్సిటీ పరిధిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. సీఎస్ఐఆర్‌కు అప్పగించకుండా దీనిపై అన్ని విభాగాల వారు మరోసారి స్పందించాలని కోరినట్లు తెలిపారు.

వచ్చేనెలలోనే పీసీసీ నియామకం!

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తేతెలంగాణ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియామకం మే నెలలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ నేపథ్యంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన పదవుల భర్తీలో అనేక సమీకరణాలు ఉన్నాయని, వాటన్నింటినీ బేరీజు వేసుకొని భర్తీ చేయబోతున్నామని చెప్పారు. క్యాబినెట్ విస్తరణపై చర్చలు జరుగుతున్నాయని, ఈ అంశం ఏఐసీసీ, ముఖ్యమంత్రి పరిధిలో ఉన్నట్టు తెలిపారు. మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉంటే ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అందువల్లే జాప్యం జరుగుతున్నట్టు చెప్పారు. కులగణనకు అనుగుణంగానే మంత్రివర్గ విస్తరణ జరగాలని పీసీసీ చీఫ్‌గా ఆశిస్తున్నామని తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో గందరగోళం!

- పిలిచినోళ్లు రాలేదు... వచ్చినోళ్లు మాట్లాడలేదు!
- అడుగడుగునా ఆగమాగం, సమన్వయలోపం
- సరైన దిశానిర్దేశంలేదని ప్రతినిధుల అసంతృప్తి
- తెలంగాణ సర్కారు, నిర్వాహకులపై విమర్శలు
- తొలిరోజు గైర్హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రెండోరోజు రాహుల్, ఖర్గే హాజరు అనుమానమే!



హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్‌నేత దిగ్విజయ్‌సింగ్, ఎంపీ మల్లురవి, విదేశీ ప్రతినిధులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో గందరగోళంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, పలు సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో మొదటిరోజు సర్వత్రా సమన్వయలోపం కనిపించిందని సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు మండిపడ్డారు. ఆతిథ్యం ఇచ్చిన రాష్ట్రం నుంచే ప్రతినిధులు చర్చలో పాల్గొనకపోవడంపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు ఆశ్చర్యంవ్యక్తంచేశారు. కార్యక్రమ నిర్వహణలో సమర్థవంతమైన ప్రణాళిక లేదని తెలిపారు.

గొప్ప సదస్సుగా ప్రచారం.. రేవంత్ డుమ్మా

భారత్ సమ్మిట్-2025కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ తొలిరోజు వారెవరూ హాజరు కాకపోవడంతో ప్రతినిధులు నిరుత్సాహం వ్యక్తంచేశారు. కనీసం రెండోరోజైనా వారు హాజరవుతారా? లేదా అనే విషయంపై ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శిస్తున్నారు. సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా డుమ్మా కొట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు రాబట్టేందుకు అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ పట్టించుకోవడంలేదని, అలాంటప్పుడు ఇంతఖర్చు పెట్టి సదస్సు నిర్వహించడమెందుకని సదస్సులో సొంతపార్టీ ప్రతినిధులే పెదవి విరిచారు. సమ్మిట్‌కు వచ్చిన మంత్రులు, నేతల మధ్య సమన్వయం కనిపించలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్యానల్ డిస్కషన్‌లో మనోళ్లెక్కడ?

ప్యానల్ డిస్కషన్‌లలో తెలంగాణ నుంచి ఒక్క ప్రతినిధికి కూడా అవకాశం దక్కలేదు. తమకు ఆసక్తి ఉందని కొందరు చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదని తెలంగాణ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడేంత నాలెడ్జ్ ఎవరికి ఉంది? ఎవరికి అవకాశం ఇద్దాం? అంటూ ఆరా తీసిన నిర్వాహకులు గురువారం రాత్రి కొందరు ఎంపీలను ఎంపిక చేశారని, వారికి మరుసటి రోజు మాట్లాడాల్సిన టాపిక్ గురించి చెప్పారని తెలుస్తున్నది. అయితే అర్ధరాత్రి సమాచారమిచ్చి, మరుసటి రోజు మాట్లాడాలని చెప్తే ఎలా అంటూ కొందరు ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్మిక స్వేదంతో సమ్మిట్ సోకులు!

మొదటిపేజీ తరువాయి...

అవకాశమే లేని భారత్ సమ్మిట్ సదస్సుకు పారిశ్రామిక పెట్టుబడులను ముడిపెట్టి కార్మిక సంక్షేమ శాఖ నుంచి నిధులు మళ్లించడం నిజమేనా? అంటే కార్మిక శాఖ అధికారుల నుంచి 'అవును' అనే సమాధానమే వినిపిస్తున్నది. కార్మిక సంక్షేమ నిధి నుంచి గత నెలలో రూ.300 కోట్లు డ్రా చేసినట్టు కార్మిక శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. ఇందులోంచి రూ.250 కోట్లను ఫ్యూచర్‌సిటీ అథారిటీ పరిధిలో ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అండ్ ఎడ్యుకేషన్ హబ్‌కు వినియోగించినట్టు తెలిసింది. మిగిలిన సొమ్ములో నుంచి రూ.30 కోట్లు భారత్ సమ్మిట్ సదస్సుకు ఖర్చు చేస్తున్నట్టు కార్మిక శాఖ అధికారుల్లో చర్చ జరుగుతున్నది. ఇందుకోసం కార్మిక శాఖలో కాలంచెల్లిన జీవో ఒకదాన్ని వెలికితీసి, దానికి మళ్లీ జీవం పోసి నిధులు డ్రా చేసినట్టు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిగితే అసలు విషయం బయటికి వస్తుందని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆదినుంచి గోప్యమే..

భారత్ సమ్మిట్ నిర్వహణకు అవసరమయ్యే నిధులను ఎక్కడినుంచి సమకూర్చుతున్నారనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచీ గోప్యత పాటిస్తున్నది. మొదట టూరిజం శాఖ నుంచి నిధులు ఖర్చు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తరువాత సోషల్‌జస్టిస్ నిధులు ఖర్చు చేయబోతున్నట్టు, ఎస్‌డీఎఫ్ నిధులు ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం జరిగింది. ప్రస్తుతం కార్మిక శాఖ నిధి నుంచి నిధులు ఖర్చు చేశారనే ప్రచారం జరుగుతున్నది. కానీ, ఇప్పటివరకు ఏ శాఖ నుంచి నిధులు ఖర్చు చేస్తున్నారనేది ప్రభుత్వం బయటికి చెప్పలేదు. నిబంధనల ప్రకారం ఇటువంటి ఈవెంట్ నిర్వాహణ కోసం గ్లోబల్ టెండర్లు పిలవాలి. కానీ, గ్లోబల్ టెండర్లు పిలువకుండానే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థకు పనులు అప్పగించినట్టు తెలిసింది.

తెలంగాణ ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఏదీ?

తెలంగాణను గ్లోబల్ డైలాగ్, ఆవిష్కరణల కేంద్రంగా నిలపడం కోసం భారత్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. తెలంగాణ రైజింగ్ విజన్‌ను ప్రదర్శించి, గ్లోబల్ పెట్టుబడులను ప్రోత్సహిస్తామని ప్రకటించింది. కానీ, సమ్మిట్ ప్రతినిధుల గ్రూప్ చర్చలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతినిధుల ప్రాతినిధ్యమే లేకపోవడం గమనార్హం. ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండా కేవలం పార్టీ నేతలతో రాజకీయ ప్రసంగాలు ఇప్పించినంత మాత్రాన పెట్టుబడులు వస్తాయా? అని పారిశ్రామిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పెట్టుబడులు, న్యాయం, ప్రపంచశాంతి, అహింస తదితర లక్ష్యాలతో భారత్ సమ్మిట్-2025 శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) నోవాటెల్‌లో రెండు రోజులపాటు ఈ సమ్మిట్ జరుగనున్నది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కుపైగా దేశాల నుంచి 450 మందికిపైగా ప్రతినిధులు హాజరైనట్టు నిర్వాహకులు చెప్తున్నారు.

వాళ్లు వద్దంటే.. మన సీఎం సరే అన్నారట!

అలీనోద్యమ ప్రతిపాదనకు 70 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా అంతర్జాతీయ సదస్సు ఒకటి నిర్వహించాలని ఏఐసీసీ ప్రతిపాదించింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో బెంగళూరు, హైదరాబాద్‌లో ఏదో ఒకచోట పార్టీ పరంగా నిర్వహించాలని ఆలోచన చేసినట్టు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో సదస్సుకు తగిన ఆర్థిక వనరులను సమకూర్చలేమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేతులు ఎత్తేసినట్టు సమాచారం. దీంతో తాము ప్రభుత్వపరంగా తెలంగాణలో నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నెత్తికి ఎత్తుకున్నట్టు ఆ పార్టీ ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న సమావేశం కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీ సమ్మిట్‌గా మారిపోయిందనే విమర్శలొస్తున్నాయి. ఎన్ఎస్‌యూఐ నేతలకు నిర్వాహణ బాధ్యతలు అప్పగించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో వారు కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ తరహాలోనే సదస్సు నిర్వహించారనే ఆరోపణలున్నాయి.


ప్రతినిధుల వివరాలపై స్పష్టత లేదు

వంద దేశాల నుంచి ప్రతినిధులు హాజరైనట్టు రాష్ట్ర ప్రభుత్వం తొలిరోజు ప్రకటించింది. అయితే, ఆ వంద దేశాలు ఏవి? ప్రతినిధులు ఎవరు? అనే అంశం మీద నిర్వాహకులకు కూడా స్పష్టత లేదు. ఇది విదేశాంగ విధానపరమైన కార్యక్రమం కాబట్టి సదస్సుకు సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో విదేశాంగ మంత్రిని కలిసి కోరిన విషయం తెలిసిందే. అయితే, దీనిని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా భావిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహకారం అందించలేదు. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ వారు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

ఏమిటీ.. కార్మిక సంక్షేమ నిధి?

రాష్ట్రంలోని ప్రతి భవన, ఇతర నిర్మాణాల అనుమతుల మీద 1% సెస్ వసూలు చేస్తున్నారు. ఈ డబ్బు కార్మిక శాఖ పరిధిలో నడిచే భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఖాతాలో జమ అవుతుంది. దీనినే కార్మిక సంక్షేమ నిధి పేరుతో పిలుస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.2,500 కోట్ల సంక్షేమ నిధిని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించింది. ఈ డబ్బును కేవలం కార్మిక సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. కార్మిక నిధికి అనుసంధానంగా వివాహ కానుక, ప్రసూతి సహాయం, కార్మికుని సహజ మరణం లేదా ప్రమాదం మరణం సమయాల్లో దహన ఖర్చులు, అంగవైకల్యం పొందితే ఆర్థిక సహాయం, వృత్తిపరమైన శిక్షణ తదితర సంక్షేమ పథకాలు నడుస్తున్నాయి. ఈ పథకాలకు మాత్రమే సంక్షేమ నిధి డబ్బులు ఖర్చు చేయాలి. ఇక్కడ వృత్తి నైపుణ్య శిక్షణ అనే సాంకేతిక పాయింట్‌ను ఆధారంగా చేసుకొని నిధులను అడ్డదారిలో మళ్లించారని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

లోకం పోకడ



తూప్రాన్ ఆటోడ్రైవర్ కన్నుమూత

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన ఆటోడ్రైవర్ గజ్జల బాబు శుక్రవారం చనిపోయాడు. ఈ నెల 19న రాత్రి ఆటోలోనే గడ్డి మందు తాగిన బాబును కుటుంబ సభ్యులు, స్థానికులు సికింద్రాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన బాబు శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. బాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా ఉపాధి లేక అవస్థలుపడ్డ బాబు తీవ్రమనస్తాపంతో దిక్కుతోచక తనువు చాలించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాదిన్న పాలనలో 102 మంది ఆటోడ్రైవర్లు చనిపోయారని ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులు వేముల మారయ్య, నిరంజన్, శాతం రమేశ్ తెలిపారు. ప్రభుత్వం అనాలోచితంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని చెప్పారు. ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం వంటి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆటోడ్రైవర్లను ఆదుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

పంట చేతికి రాక.. అప్పులు తీర్చలేక

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్లారంలో విషాదం

కాటారం, ఏప్రిల్ 25 : ఆరుగాలం కష్టపడి వేసిన పత్తి పంట చేతికి అందక... చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో గడ్డిమందు తాగి పత్తి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్లారంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి మల్లారం గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య(55) తనకున్న నాలుగు ఎకరాల్లో పత్తి, వరి పంట సాగు చేశాడు. పత్తి పంట దిగుబడి రాక రూ.1.20 లక్షల అప్పులయ్యాయి. వరి పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో పక్షం రోజులుగా దిగులుతో ఉంటున్నాడు. మనస్తాపంతో గురువారం మద్యం తాగిన రాజయ్య అనంతరం గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో మహదేవపూర్ దవాఖానకు తరలించారు. అక్కడ నుంచి భూపాలపల్లికి, అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్సపొందుతూ రాజయ్య శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వడదెబ్బ తో రైతు మృతి

పెద్దపల్లి జిల్లా నర్సింహులపల్లిలో విషాదం

ధర్మారం, ఏప్రిల్ 25: కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన అనంతరం ఇంటికి వెళ్తుండగా వడదెబ్బతో ఓ రైతు మృతి చెందిన ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లిలో జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కుమ్మరికుంట రాజయ్య(69) గ్రామ శివారులో కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు శుక్రవారం మధ్యాహ్నం సైకిల్‌పై వెళ్లాడు. వడ్లను నేర్పిన అనంతరం ఎండలో ఇంటికి తిరుగు పయనమయ్యాడు. మార్గంమధ్యలోనే రాజయ్య తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు రాజయ్య అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శీలం లక్ష్మణ్ వివరించారు.

ఎన్డీఎస్‌ఏ నివేదికపై క్యాబినెట్‌లో చర్చిస్తాం: ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అందజేసిన నివేదికపై మంత్రివర్గంలో చర్చిస్తామని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నివేదికపై సమగ్రమైన అధ్యయనం చేస్తామని వెల్లడించారు. క్యాబినెట్‌లో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అదేవిధంగా ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలకు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.

మరో రూ.1,400 కోట్ల అప్పు

29న ఈ-వేలం ద్వారా తీసుకోనున్న రేవంత్‌రెడ్డి సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు మరో రూ.1,400 కోట్ల రుణం తీసుకోనున్నది. త్వరలో బహిరంగ మార్కెట్ నుంచి ఈ రుణాన్ని తీసుకునేందుకు ఇండెంట్ పెట్టింది. ఈ నెల 29న నిర్వహించే ఈ-వేలం ద్వారా రూ.700 కోట్ల చొప్పున ఈ రుణ సమీకరణ చేయనున్నట్టు పేర్కొన్నది. 2025-26 తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఏప్రిల్‌లో రూ.4 వేల కోట్ల అప్పు తీసుకోనున్నట్టు తెలిపింది. అందులో ఇప్పటికే రూ.3 వేల కోట్లు తీసుకున్నది.

ఇందిరమ్మ ఇల్లుకు 10 వేలు లంచం అడుగుతున్రు..!



ములుగు జిల్లా వాజేడు మండలానికి వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు శుక్రవారం ఓ కాంగ్రెస్ కార్యకర్త గోడు వెల్లబోసుకున్నాడు. ఇందిరమ్మ ఇంటి మంజూరు కోసం కొందరు రూ.10వేలు అడుగుతున్నారని కొప్పుసూరు గ్రామానికి చెందిన కార్యకర్త ముత్యాలరావు ఫిర్యాదు చేశాడు. అర్హత ఉన్నా తన భార్య జమున పేరు జాబితాలో రాలేదని తెలిపాడు. -వాజేడు

మా ఇష్టమొచ్చినోళ్లకు ఇచ్చుకుంటం..!



నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని అంబేద్కర్‌నగర్‌లో అధికారులు శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా విడుదల చేశారు. అందులో అనర్హుల పేర్లు ఉండడంతో స్థానికులు అధికారులను నిలదీశారు. ఓ కాంగ్రెస్ నేత స్పందించి 'మాకు ఇష్టం వచ్చిన వారికే ఇండ్లను కేటాయిస్తున్నాం.. ఇది మా ప్రభుత్వం..' అంటూ తెగేసి చెప్పాడు. - మక్తల్

ఎంపికలో అవకతవకలు... రోడ్డెక్కిన గ్రామస్థులు



'ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయి. ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులిచ్చినోళ్లను.. నచ్చినోళ్లనే ఎంపిక చేస్తున్నరు. అర్హులందరికీ న్యాయం చేయాలి' అని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కిష్టంపేట జీపీ పరిధిలోని ఎల్లక్కపేట కాలనీవాసులు రోడ్డెక్కారు. -చెన్నూర్ రూరల్

ఇండ్లు లేనోళ్లకిస్తరా.. ఇష్టమొచ్చినోళ్లకిస్తరా?



తలదాచుకునేందుకు గూడు లేని తమకు ఇండ్లు ఎందుకు ఇవ్వరని భద్రాద్రి జిల్లా గుర్రాలచెరువు గ్రామస్థులు అధికారులను నిలదీశారు. అర్హుల జాబితాపై అధికారుల విచారణలో మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీల బాధ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. - అశ్వారావుపేట టౌన్

కాపీ పేస్ట్ నివేదిక!

మొదటిపేజీ తరువాయి...

కుంగుబాటుకు అనేక ఊహాజనిత కారణాలను విశ్లేషిస్తూ నివేదికను విడుదల చేసింది. మళ్లీ ఈ ఏడాది మార్చి వరకు బరాజ్ ఊసెత్తలేదు. అటు తర్వాత ఎట్టకేలకు బరాజ్ కుంగుబాటుకు కారణాలను అధ్యయనం చేసి, పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసేందుకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ 2024 మార్చిలో రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీల నుంచి వివరాలను సేకరించింది. నిపుణుల కమిటీకి రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పలు అంశాలను వివరించారు.

రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు చేసిన సూచనలు

- అన్ని బరాజ్‌లలో రాఫ్ట్ కిందున్న రంధ్రాలను గుర్తించి, వాటిని పూడ్చాలి.
- బ్లాకుల వారీగా గేట్ల నిర్వహణకు ఆధునిక స్కాడా విధానం అమలు చేయాలి.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఓఅండ్ఎం పనులను ఐఎస్ కోడ్ ప్రకారం చేపట్టేందుకు నిర్మాణసంస్థలకు అవకాశం కల్పించాలి.
- బరాజ్‌ల ఎగువన, దిగువన వాటర్ ప్రూఫ్ కోసం సిమెంట్ గ్రౌటింగ్ చేపట్టాలి. ప్రవాహాలకు ఆటంకంగా మారే రాళ్లను తొలగించాలి.
- మేడిగడ్డలో బ్లాక్ 7లో జామ్ అయిన గేట్లను తొలగించాలి. స్టీల్ షీట్‌పైల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలి.
- బరాజ్‌లపై వరద ఒత్తిడిని తగ్గించేందుకు ఎగువ భాగంలో నదిపై రెగ్యులేటరీలు నిర్మించాలి.
- బరాజ్‌ల ఎగువ, దిగువన నదీగర్భంలోని ఇసుక మేటలను ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో తొలగించాల్సి ఉంటుంది.

మళ్లీ గత నివేదికలోని అంశాలే

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల భద్రతకు సంబంధించి ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ తాజాగా 378పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఇందులోని సిఫారసులు అన్నీ కూడా గతంలో జారీ మార్గదర్శకాలే కావడం ఇక్కడ గమనార్హం. మేడిగడ్డ బరాజ్‌లోని 85 రేడియల్ గేట్లలో 77 గేట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అనాడే తేల్చిచెప్పింది. తాజాగా కుంగుబాటుకు గురైన 7వ బ్లాక్ మొత్తాన్ని తొలగించాలని వెల్లడించింది. తాజా రిపోర్టులోనూ మళ్లీ అవే అంశాలనే కాస్త వివరణాత్మకంగా, సాంకేతిక పదజాలంతో ఎన్డీఎస్‌ఏ నివేదించిందే తప్ప మరేమీలేదని నిపుణులు చెప్తున్నారు. అదీగాక అండర్‌పైపింగ్ జరగడం వల్లే పిల్లర్ కుంగుబాటుకు గురైందని తాము మొదటి నుంచీ చెప్తున్నామని, అదే విషయాన్ని ఇప్పుడు ఎన్డీఎస్‌ఏ నిర్ధారించిందని వివరిస్తున్నారు. ఎక్కడా స్పష్టమైన కారణాలను వివరించకుండా, సూచనలు చేయకుండా ఊహాజనిత అంశాలతోనే రిపోర్టును వండివార్చిందని ఇరిగేషన్ శాఖ అధికారులు మండిపడుతున్నారు.

ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ తాజా సిఫారసులు

- మేడిగడ్డ, ఇతర బరాజ్‌లలో సమస్యలకు కారణాలను తెలుసుకునేందుకు, నిర్మాణ సమగ్రతను అంచనా వేయడానికి తదుపరి పరిశోధనలు చేయాల్సి ఉంది.
- జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను నిర్వహించాలి.
- మేడిగడ్డ బరాజ్ మధ్యరేఖ నుంచి 5,000 మీటర్ల దూరం వరకు నది క్రాస్ సెక్షన్లను అధ్యయనం చేయాలి.
- నీటి ప్రవాహ గేజ్‌లను పరిశీలించాలని, జియోఫిజికల్ పరిశోధనల గుణాత్మక ఫలితాలను బోర్‌హోల్ ఇన్వెస్టిగేషన్ల ద్వారా ధ్రువీకరించాలి.
- రుతుపవనాల తర్వాత బరాజ్‌ల అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లోని సెకెంట్ పైల్స్, కటాఫ్‌ల పారామెట్రిక్ జాయింట్ల సమగ్రత/కొనసాగింపును అంచనా వేసేందుకు భౌగోళిక పరిశోధనలు నిర్వహించాలి.
- బరాజ్‌ల పునాది పటిష్ఠతను అంచనా వేయాలి. పగుళ్ల పరీక్షలను నిర్వహించి విశ్లేషించాలి.
- ఐఎస్ కోడ్ 13578 నిబంధనల ప్రకారం ఉపరితల పరిశోధనలు నిర్వహించాలి. ఆయా పరిశోధనలు/పరీక్షలన్నింటినీ సీఎస్ఎంఆర్ఎస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్, ఐఐటీ వంటి సంస్థలతో చేయించాలి.

ఆధారాల్లేకుండానే ఆరోపణలు

అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎన్డీఎస్‌ఏ నిపుణులు కమిటీ పలు ఆరోపణలు చేసిందని రాష్ట్ర ఇంజినీర్లు విమర్శిస్తున్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్‌ను మార్చారని, ఎలాంటి ఇన్వెస్టిగేషన్ చేయలేదని తెలపడం సరికాదని వివరిస్తున్నారు. బ్యారేజీల నిర్మాణ స్థలం మార్చిన మాట వాస్తవమేనని, అలాంటి మార్పులు కొత్తదేమీ కాదని, రకరకాల కారణాల వల్ల నిర్మాణ స్థలాన్ని మార్చే పరిస్థితులు ఏర్పడడం సహజమని ఇంజినీర్లు చెప్తున్నారు. స్థలం మార్చినా కూడా భూభౌతిక పరిశోధనలు లేకుండా బరాజ్‌లను నిర్మించారనేది పూర్తిగా అవాస్తవమని ఇంజినీర్లు కొట్టిపడేస్తున్నారు. భూభౌతిక పరిశోధనలు చేసి వాటి ఫలితాలను సీడీవోకి పంపించారని, డిజైన్లను తీసుకున్నారని నొక్కిచెబుతున్నారు. ఆ డిజైన్లను కూడా 'డిజైన్ ఆఫ్ బరాజ్ ఆన్ పర్మియబుల్ ఫౌండేషన్'పై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ), సీడబ్ల్యూసీ జారీ చేసిన డిజైన్ మాన్యువల్‌లు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జారీ చేసిన కోడ్స్‌ను తూచా తప్పకుండా పాటించి, డిజైన్లను రూపొందించారని వివరిస్తున్నారు. దేశంలో ఎవరైనా వాటి ఆధారంగానే బరాజ్‌ల డిజైన్లు రూపొందిస్తారని, మరి భూభౌతిక పరిశోధనలు జరపలేదని ఏ ఆధారాలతో ఎన్డీఎస్‌ఏ తెలిపిందో అర్థంకానీ విషయమని, ఇది తెలంగాణ ఇంజినీర్ల ఇంజినీరింగ్ పరిజ్ఞానం, సమగ్రతను అపహాస్యం చేయడమేనని రాష్ట్ర అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బరాజ్‌ల నిర్మాణానికి ముందు తెలంగాణ ఇంజినీరింగ్ రీసర్చ్ ల్యాబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్) ద్వారా మోడల్ స్టడీస్ చేయించలేదని, ల్యాబ్స్‌లో అధ్యయనాలను చేసేందుకు వసతులు లేవనడం కూడా నిరాధారమైన ఆరోపణనేనని వివరించారు. నిజాం జమానాలో స్థాపించిన ఆ ల్యాబ్‌లో అన్ని వసతులు, పరికరాలు ఉన్నాయని, 3 బరాజ్‌లపై 2డీ మోడల్ స్టడీస్ నిర్వహించారని వాటి ఫలితాల ఆధారంగా బరాజ్‌ల వెంట్‌వే పెంచడమేగాక, నిర్మాణాన్ని పర్యవేక్షించారని ఇంజినీర్లు వివరిస్తున్నారు. సూచనలు ఏమీ చేయకుండా ఆరోపణలు చేస్తూ, అసంబద్ధమైన అంశాలతో ఎన్డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిందే తప్ప మరేమీ కొత్తదనం లేదని మండిపడుతున్నారు.

విలువైన సమయం వృథా

ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదికపై రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ మాత్రం రిపోర్ట్ ఇవ్వడానికి ఏడాదిన్నర తీసుకోవాల్సిన అవసరంలేదని చెప్తున్నారు. తాము సూచించిన రక్షణ చర్యలనే ఎన్డీఎస్‌ఏ తిరిగి తమకు పంపించిందని, అంతకుమించి ఏమీలేదని మండిపడుతున్నారు. ఈ మాత్రందానికి విలువైన సమయాన్ని వృథా చేసిందని ఇంజినీర్లు విమర్శిస్తున్నారు. మేడిగడ్డ 7బ్లాక్ తరహాలోనే మిగతా బ్లాకుల్లో కూడా నిర్మాణ లోపాలు, సొరంగాలు, కటాఫ్ వాల్స్‌లో రంధ్రాలు ఉండవచ్చు..? అంటూ ఊహగానాలు చేయడమేకాగా, బరాజ్ మొత్తానికి ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించడం హాస్యాస్పదని వివరిస్తున్నారు. గతంలో పరీక్షలను నిర్వహించిన సమయంలోనే మిగతా బ్లాకుల్లో ఎలాంటి సమస్యాలేదని తేలిపోయిందని ఇంజినీర్లు గుర్తుచేస్తున్నారు. 2024లో వరదలు కూడా సాక్ష్యమని ఉదహరిస్తున్నారు. 15 లక్షల క్యూసెక్కుల వరదను బరాజ్‌లు సురక్షితంగా ఎటువంటి అదనపు డ్యామేజీలు లేకుండా కిందకు పంపించాయని, ఎన్డీఎస్‌ఏ ఊహలే నిజమైతే, ప్రమాదాలు సంభవించి ఉండేవని, కానీ అలాంటివేమీ జరగలేదని చెప్తున్నారు. ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకు 3 బరాజ్‌లలోని అన్ని బ్లాకుల్లో జీయోలాజికల్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేసి వాటి ఫలితాల ఆధారంగా పునర్నిర్మాణ డిజైన్లు రూపొందిచుకోవాలంటే కనీసం మూడు, నాలుగు పంటకాలాలు నష్టపోయినట్టేనని వివరిస్తున్నారు. జూన్ రెండో వారానికల్లా గోదావరిలో ప్రవాహాలు పెరుగుతాయని, నవంబర్ వరకు కొనసాగుతాయి కాబట్టి 2025లో పరీక్షల నిర్వహణ అసాధ్యమని, 2026 జనవరిలో మాత్రమే పరిశోధనలు ప్రారంభించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. మొత్తం బ్యారేజీ అంతా పరిశోధించాలంటే మరింత సమయం పడుతుందని తెలిపారు. ఎన్డీఎస్‌ఏ విలువైన సమయాన్ని వృథా చేసిందని ఇరిగేషన్ అధికారులు విమర్శిస్తున్నారు.

1 రోజులో..



ఎల్కతుర్తి రజతోత్సవ సభా ప్రాంగణం డ్రోన్ ఫొటో



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా వేదిక లైటింగ్ పనులు పూర్తయ్యి పండుగ వాతావరణం సంతరించుకోవడంతో చూసేందుకు వచ్చిన ఎల్కతుర్తి ప్రజలు. రాత్రివేళ ధగధగ వెలిగిపోతున్న 'గులాబీ మైదానం' వద్ద అక్కడికి వచ్చిన స్థానిక మహిళలు.. పిల్లలతో కాసేపు సరదాగా గడపడం కనిపించింది.

1,213 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ

ఎల్కతుర్తిలోని 1,213 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం సిద్ధమైంది. 500 మంది కూర్చునే సామర్థ్యంతో వేదిక గులాబీ రంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట-పాట కోసం ప్రత్యేకంగా మరో వేదికను ఏర్పాటుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే దాదాపు 50 వేల వాహనాల కోసం 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. మహాసభ ప్రాంగణంలో వాహనాలు, ప్రజలు వచ్చేందుకు వీలుగా గ్రీన్, రెడ్ కార్పెట్లు ఏర్పాటుచేశారు. మహాసభకు ముందుగా వచ్చిన వారు కూర్చునేలా లక్షకుపైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. పగటిపూటను తలపించేలా వెలుగులు విరజిమ్మేలా లైట్లను అమర్చారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు.

గులాబీ పండుగకు సర్వం సిద్ధం

రేపు బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ • ఎల్కతుర్తి పరిసరాలు గులాబీమయం
6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు • ఆవరణంలో 23 భారీ ఎల్ఈడీ స్క్రీన్లు
1,200 టెంపరరీ మరుగుదొడ్ల ఏర్పాటు • భారీఫ్లెక్సీలు, కటౌట్లు, గులాబీ తోరణాలు

వరంగల్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ రజతోత్సవ పండుగకు సర్వం సిద్ధమైంది. ఎల్కతుర్తి పరిసరాలు గులాబీమయం అయాయి. లక్షలాదిగా తరలివచ్చే జనానికి తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. మొత్తంగా గులాబీ పార్టీ 25 ఏండ్ల పండుగ అద్భుతంగా జరిగేలా ఏర్పాట్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన గులాబీ పార్టీ 25 ఏండ్ల పండుగకు లక్షలాది మంది తరలిరానున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే ఈ సభ చరిత్రలో నిలిచిపోతుంది. 14 ఏండ్ల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, 2014 నుంచి పదేండ్లపాటు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన బీఆర్‌ఎస్ సుపరిపాలన మేళవింపుగా ఈ రజతోత్సవ మహాసభ ఆసాంతం ఉండనున్నది. బీఆర్‌ఎస్‌కు చెందిన జెండాలు, ఫ్లెక్సీలు, భారీ కటౌట్లతో ఎల్కతుర్తి పూర్తిగా గులాబీశోభను సంతరించుకుంది. మహాసభ ప్రాంగణానికి వచ్చే అన్ని దారుల్లో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఉన్న జెండాలతో ఆ ప్రాంతం మొత్తం గులాబీ మయమైంది. ఎల్కతుర్తి ప్రధాన జంక్షన్‌లో పెట్టిన కేసీఆర్ భారీ కటౌట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. వేదిక ముందు 25 వసంతాల బీఆర్‌ఎస్, కేసీఆర్, కేటీఆర్ కటౌట్లు విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అభిమానులు, కార్యకర్తలు అక్కడ ఉత్సాహంగా ఫొటోలు దిగుతున్నారు.

బీఆర్‌ఎస్ నేతల నిర్విరామ కృషి

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షణలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు జరిగాయి. నేతల నిర్విరామ కృషితో సర్వం సిద్ధమైంది.

ఎల్కతుర్తి రోడ్లకు కొత్తరూపు

బీఆర్‌ఎస్ మహాసభతో ఎల్కతుర్తి పూర్తిగా కొత్త రూపును సంతరించుకున్నది. బండ్ల బాటలు పెద్ద రోడ్లుగా మారాయి. పెద్ద రోడ్లు మరింత బాగా తయారయ్యాయి. ఎల్కతుర్తిలోని దాదాపు 10 కిలోమీటర్ల దూరం వరకు అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముండ్ల చెట్లను తొలగించారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు. రైతుల పొలాల్లో ఎక్కడా ఒక్క పిచ్చి మొక్క కనిపించకుండా, ముండ్లకంప లేకుండా చదనయ్యాయి. బీఆర్‌ఎస్ మహాసభ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారు. ఎల్కతుర్తి పరిసర ప్రాంతాల్లోని ప్రజల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. బీఆర్‌ఎస్ మహాసభతో ఎల్కతుర్తికి కొత్త గుర్తింపు వచ్చిందని అంటున్నారు.

వసతి, సదుపాయాల ఏర్పాట్లు

- 10 లక్షల వాటర్ బాటిళ్లు
- 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు
- పరిసరాల్లో 12 వైద్యశిబిరాలు
- 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు
- పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వలంటీర్లు



సిద్దిపేటలోని రంగధాంపల్లిలో యువత పాదయాత్రను ప్రారంభించి వారితో కలిసి నడుస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

లక్ష్యాన్ని ముద్దాడిన పార్టీ బీఆర్‌ఎస్

- కోట్ల మందిని ఏకం చేసింది కేసీఆరే
- బీఆర్‌ఎస్ ఎప్పటికీ తెలంగాణ పక్షమే
- బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్
- రజతోత్సవ సభకు యువత పాదయాత్ర ప్రారంభం.. వారితో కలిసి 6 కి.మీ నడిచిన హరీశ్

సిద్దిపేట, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి. కానీ, బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్ చరిత్రలో నిలిచింది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి, సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉన్నదని, ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైనా సిద్దిపేటకు పేగు బంధం ఉన్నదని గుర్తుచేశారు. శుక్రవారం సిద్దిపేటలోని రంగధాంపల్లిలో అమరవీరుల స్తూపానికి పూలువేసి నివాళులర్పించారు. అనంతరం వరంగల్ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1500 మంది యువత పాదయాత్ర చేపట్టగా హరీశ్ జెండా ఊపి ప్రారంభించారు. వారితో కలిసి దాదాపు 6 కిలోమీటర్లకు పైగా పాదయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వారితో కలిసి భోజనం చేసి కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మీరు చేస్తున్న ఈ పాదయాత్ర రేపటి బీఆర్‌ఎస్ విజయ యాత్ర కాబోతున్నది' అని పేర్కొన్నారు. పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులు, ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు ఉగ్రదాడి మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధించు, సమీకరించు, పోరాడు అని చెప్పారని, అదే పద్ధతిలో కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్, ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారని గుర్తుచేశారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. 1969లో పోలీసుల కాల్పుల్లో 369 మంది చనిపోయారని, ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో గాంధీ చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుకు నడిపారని చెప్పారు. 14 ఏండ్ల ఉద్యమం, 10 ఏండ్ల పాలన.. ఏడాదిన్నరగా ప్రతిపక్షం. ఇలా ఏ పాత్ర అయినా బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ధాన్యం ఉత్పత్తి, తలసరి ఆదాయం, జీఎస్డీపీలో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని కొనియాడారు. డాక్టర్ల ఉత్పత్తిలోనూ తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌కు చెంపపెట్టు కావాలె

'ఈ రోజు యువత చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలె..ఆ రోజు లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించేందుకు రామదండు కదిలింది. ఈరోజు కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించేందుకు ఈ గులాబీ దండు కదిలింది' అని హరీశ్ చెప్పారు. పాదయాత్రలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను వివరించాలని సూచించారు. మూడు రోజులపాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి గులాబీ దండు రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు కదిలిందని చెప్పారు. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ కోసం స్వచ్ఛందంగా తరలివచ్చినందుకు అభినందించారు.

ఇంటింటికీ వెళ్లి.. బొట్టు పెట్టి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : ఎల్కతుర్తి సభకు రావాలని మహబూబాబాద్‌లోని 35వ వార్డులో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ శుక్రవారం మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ సందేశం వినాలని ప్రజలు సభకు స్వచ్ఛందంగా వస్తున్నట్టు తెలిపారు.





కేసీఆర్‌ది సంక్షేమం.. రేవంత్‌ది విధ్వంసం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

కంఠేశ్వర్, ఏప్రిల్ 25: పదేండ్ల కేసీఆర్ పాలన సంక్షేమమైతే.. 17 నెలల రేవంత్‌రెడ్డి పాలన విధ్వంసమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వేముల మాట్లాడారు. టీఆర్‌ఎస్ పుట్టింది తెలంగాణ ప్రజల కోసమని చెప్పారు. 15 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించి ప్రజలకు విముక్తి కలిగించిందని తెలిపారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టారని గుర్తుచేశారు. రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 2,400 వాహనాల్లో 40 వేల మంది తరలివెళ్లనున్నట్టు చెప్పారు.



బీఆర్‌ఎస్ దండు కదలాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : గులాబీ రజతోత్సవ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు దండులా కదలాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొనగా.. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు పాలమూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు.



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, తుంగ బాలు

మేడారం జాతరలా బీఆర్‌ఎస్ సభ

- రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తి
- అంతా సాఫీగా చేరేలా ప్లాన్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కేసీఆర్
- కాంగ్రెస్‌పై కసిగా ఉన్న ప్రజానీకం
- అది కాంగ్రెస్, బీజేపీల నివేదిక
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరను తలపించేలా ఎల్కతుర్తి సభ ఉంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో పురుడు పోసుకున్న టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పార్టీ 25 ఏండ్లు పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా ఎల్కతుర్తి సభకు సజావుగా చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయని వివరించారు. సభా ఏర్పాట్లను రోజూ కేసీఆర్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సభకు వచ్చే వాహనాల కోసం 1,200 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌పై కసిగా ఉన్నారని, బీఆర్‌ఎస్ సభకు తరలివచ్చేందుకు తమ సొంత పనిగా భావిస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి 80 ఏండ్ల వృద్ధులు కూడా ఈ సభకు వచ్చేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ 25 ఏండ్ల సభ జరుపుకుంటుంటే.. ప్రజలు మాత్రం దీనిని కాంగ్రెస్ వ్యతిరేక సభగా భావించుకుంటున్నారని జగదీశ్‌రెడ్డి చెప్పారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద భారీ సభలు నిర్వహించిన చరిత్ర ఉన్నదని, అలాంటి సభల రికార్డులు తిరిగే రాసేది కూడా బీఆర్‌ఎస్ అవుతుందని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి జనం తరలి వచ్చేందుకు సిద్ధమయ్యారని, కాంగ్రెస్, బీజేపీలు మాత్రం ఓర్వలేక పోతున్నాయని దుయ్యబట్టారు.

అది ఎన్‌డీఏ రిపోర్టు

మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్లపై ప్రాజెక్టులపై ఇచ్చింది ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కాదని, అది ఎన్‌డీఏ రిపోర్టు అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఇచ్చిన నివేదిక అంటూ ఆయన ఎద్దేవా చేశారు. గతంలో కూడా ఎన్నికలప్పుడు హడావుడి చేశారని, రజతోత్సవ సభ నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు అదే హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కే అది పనికిమాలిన రిపోర్టు అని, అది చెత్తబుట్టలో వేయడానికే పనికొస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కే కిషోర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్‌ఎస్ నేతలు నరసింహారెడ్డి, ధర్మేందర్, సంజీవరావు పాల్గొన్నారు.

వర్ధన్నపేట పౌరుషాన్ని నిలబెట్టుకోవాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 : ఎల్కతుర్తిలో 27న నిర్వహించే రజతోత్సవ సభలో వర్ధన్నపేట నియోజకవర్గ పౌరుషాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని వర్ధన్నపేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో శుక్రవారం ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించగా.. ఎర్రబెల్లి ఎడ్లబండి నడుపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉదయమే పార్టీ జెండా ఎగరవేసి సభాస్థలికి చేరుకోవాలని సూచించారు. సభలో ఎడ్లబండ్లు హైలెట్ కావాలని తెలిపారు.





శేరిలింగంపల్లికి చెందిన రవీందర్‌యాదవ్ ఒడిశాలోని పూరీ బీచ్‌లో కేసీఆర్ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పం వీడియోను శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించి రవీందర్‌ను అభినందించారు. – హైదరాబాద్



చరిత్రలో నిలిచేలా రజతోత్సవం

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25: దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచేలా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. చలో వరంగల్ ఏర్పాట్లపై ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ రాక్షస పాలనపై వరంగల్ సభ యుద్ధభేరి మోగిస్తుందని చెప్పారు. అనంతరం ఆర్మూర్‌లో రేవంత్ గోబ్యాక్ – కేసీఆర్ కమ్ బ్యాక్ అని వాల్ పెయింటింగ్ రాశారు.


చలో వరంగల్
చుట్టూ గాఢాంధకారం...
కనిపించని ఆ చోట వినిపించే వెతలెన్నో...
కన్నీళ్లు ఇంకిన కండ్లు... తడారిన గొంతుకలు..
అంత చీకట్లోనూ లక్ష్యాన్ని చూసింది మాత్రం... ఒకే ఒక్కడు...
తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా స్థాపించిన బీఆర్ఎస్ పార్టీకి
పాతికేండ్ల పండుగ (రజతోత్సవ) శుభాకాంక్షలు...
రేపు సాయంత్రం 4 గంటలకు
ఎల్కతుర్తి లో జరిగే
మన ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్
రజతోత్సవంలో భాగస్వాములమవుదాం
జి. గోవర్ధన్ రెడ్డి
మండల అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ
శంకరపల్లి
బిసోల్ల శ్రీధర్
మాజీ సర్పంచ్ - శంకరపల్లి
పి.వేణుగోపాల్ రెడ్డి
యూత్ ఉపాధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ
రంగారెడ్డి జిల్లా
ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి - మాజీ ఎంపిపి శంకరపల్లి మండలం
చేవెళ్ళ నియోజకవర్గం

4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 26 ఏప్రిల్ 2025
www.ntnews.com

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ద్రోహమే కాంగ్రెస్ నైజం



సిరికొండ మధుసూదనాచారి

భాషా ప్రయుక్త రాష్ర్టాల ప్రాతిపదికన భారతదేశం పలు రాష్ర్టాలుగా ఏర్పాటైంది. దేశంలో మెజారిటీ ప్రజలు హిందీ మాట్లాడగా, ఆ ప్రాంతాలు అనేక రాష్ర్టాలుగా ఏర్పాటు చేయబడ్డాయి. హిందీ తర్వాత ఎక్కువమంది ప్రజలు మాట్లాడేది తెలుగు భాష. 1956కు పూర్వం మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్రా ప్రాంతం, హైదరాబాద్ స్టేట్‌లో తెలంగాణ ప్రాంతం ఉండేవి. మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్రా ప్రాంతం బ్రిటిష్ వారి పాలనలో ఉండగా, హైదరాబాద్ స్టేట్‌లోని తెలంగాణ ప్రాంతం రాచరిక పాలనలో ఉండేది.

ఈ రెండు ప్రాంతాల భాష తెలుగే అయినప్పటికీ అనేక విషయాల్లో ఈ రెండు ప్రాంతాల ప్రజల్లో సామీప్యత లేదు. ఇద్దరి యాస వేరు, ఆహారపు అలవాట్లు వేరు, పండుగలు వేరు, సంస్కృతి సంప్రదాయాలు వేరు, ఆచార వ్యవహారాలు వేరు, కట్టూ బొట్టు వేరు, ఆనాటి వారి పేర్లలో తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఉదా-ఓబులేసు, మద్దిలేటి, రెడ్డమ్మ, మునెమ్మ, పెంచలయ్య, సుబ్బారావు, అప్పారావు, పాత్రుడు, నూక రాజు, అప్పల నరసింహ, సన్నాసి ఆంధ్ర ప్రాంతం పేర్లు కాగా.. సమ్మయ్య, కొము రయ్య, రాజమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, జానయ్య, సైదమ్మ, నరసింహ, యాదయ్య, పోశెట్టి, బొందాలు, లింబాద్రి, గంగవ్వ, సంగయ్య, పర్వతాలు, పెంటయ్య, ఇస్తారి, సోమన్న తెలంగాణ పేర్లు. ఆంధ్రా ప్రాంతం బ్రిటిష్ వారి పాలనలో ఉండి విద్య తదితర రంగాల్లో ముందుండగా తెలంగాణ విద్యలో వెనుకబాటుకు లోనైంది. సంపదను దోచుకోవడం, ఎదుటివారిపై పెత్తనం చెలాయించడమనే లక్షణం బ్రిటిష్ వారితో సహచర్యం వల్ల ఆంధ్రులకు అబ్బింది. రాచరిక పాలనలో ఉన్న తెలంగాణ ప్రజలకు అమాయకత్వం, మంచితనం తప్ప వంచన ఎరుగరు. నిజాం పాలనలో రజాకార్ల, పోలీసుల అరాచకాల వల్ల తమను తాము రక్షించుకోవడానికి ఆంధ్ర ప్రాంతానికి పోయి కొన్ని ఇండ్లలో తలదాచుకున్న వారిని ఆశ్రయం ఇచ్చినవారు ఏ విధంగా నిలువు దోపిడీ చేసినారో కథలు కథలుగా చెప్పేవారు. అందుకే, తెలంగాణ ప్రాంతం వారు ఆంధ్రతో కలిపే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. రాచరిక పాలన కంటే భయంకర దోపిడీకి, అణచివేతకు గురౌతామని గగ్గోలు పెట్టారు. ఇదే విషయాన్ని తెలంగాణ ప్రజలు నాటి విద్యార్థులు, మేధావులు కొత్త రాష్ర్టాల ఏర్పాటుకోసం నియమించబడిన కమిషన్ చైర్మన్ ఫజల్ అలీకి నివేదించారు. ఫజల్ అలీ కమిషన్ కూడా తెలంగాణ ప్రజల ఆవేదనతో ఏకీభవించింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆవేదనను, ఆక్రందనను, ఏ మాత్రం పట్టించుకోక తెలంగాణ ప్రజల అభీష్టానికి భిన్నంగా ఆంధ్రా తెలంగాణను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేసింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్ 1.**

తెలంగాణ ప్రజలు అనుమానించినట్టుగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన మరుక్షణం నుంచే తెలంగాణ పట్ల వివక్ష మొదలైంది. వారి ఆధిపత్య అణచివేత, దోపిడి, దురహంకార, ధోరణి తెలంగాణ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ బాధలు కొన్నేండ్లు భరించిన తెలంగాణ ప్రజలు తెలంగాణ గడ్డ మీద రెండవ శ్రేణి పౌరులుగా బతుకడం సహించలేక స్వరాష్ట్ర ఏర్పాటు దిశగా ఆలోచన మొదలు పెట్టారు. 1969లో రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రారంభమై తెలంగాణ నలుచెరుగుల శరవేగంగా వ్యాపించింది. విద్యార్థులు యువకులు ముందుండి నడిపిన ఈ ఉద్యమాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వందల మందిని కాల్చి చంపి వేలాది మందిని జైళ్ల పాలు చేసి అప్రజాస్వామికంగా, కర్కశంగా అణచివేసి తెలంగాణకు ద్రోహం తలపెట్టింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్ 2.**

> **1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అప్రతిహతమైన విజయం సాధించగా, ఆ ప్రభంజనాన్ని ఎదిరించి టీపీఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు ఘనమైన విజయాన్ని కట్టబెట్టి తమ ఆకాంక్షలోని హేతుబద్ధతను పవిత్రతను ఓటు తీర్పుగా ప్రకటించారు.**

తెలంగాణలోని 14 పార్లమెంట్ సీట్లలో 10 మంది (టీపీఎస్) అభ్యర్థులను గెలిపించారు. అప్రతిహతమైన, ఆలోచనాభరితమైన ఈ ప్రజా తీర్పును శిరసా వహించి తెలంగాణ రాష్ర్టాన్ని ఏర్పాటుచేయవలసిన ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సిగ్గుగా తెలంగాణ ప్రజా సమితి లోక్‌సభ సభ్యులను కాంగ్రెస్‌లో విలీనం చేసుకొని ప్రజాస్వామ్య పవిత్రతకు మాయని మచ్చ తెచ్చింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-3.**

తదనంతర కాలంలో 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చేవరకు పెద్ద మనుషుల ఒప్పందం, 6 సూత్రాల పథకాలకు తిలోదకాలిచ్చి తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు, భూములు యథేచ్ఛగా దోపిడీ కావడానికి, అన్యాక్రాంతం కావడానికి కాంగ్రెస్ అగ్ర నాయకత్వం కనుసన్నలలో ఆంధ్ర నాయకత్వం దురాగతాలకు పాల్పడింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-4.**

టీడీపీ హయాంలోనూ ఈ వైఖరే కొనసాగింది. 2001లో ఆవిర్భవించి, తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో ఎదుగుతున్న టీఆర్ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగగా 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ అనుకూలం, కట్టుబడి ఉన్నామని ప్రకటించి టీఆర్ఎస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకొని రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్నికల్లో గెలిచింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని చేర్చి, అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నోట పలికించి, తదనంతర కాలంలో ఉలుకూ పలుకు లేని నాన్చివేత ధోరణిని ప్రదర్శించింది. యూపీఏకు నాయకత్వం వహించిన కాంగ్రెస్ మోసాన్ని నిరసించిన కేసీఆర్ రాష్ట్రంలోని ఆరుగురు టీఆర్ఎస్ మంత్రులచే రాజీనామా చేయించారు. అయినప్పటికీ కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. తదనంతరం లోక్‌సభ సభ్యత్వానికీ కేసీఆర్ రాజీనామా చేయడం కాంగ్రెస్ ద్రోహ ఫలితమే. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-5.**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దేశంలోని 37 పార్టీలు తమ అంగీకార పత్రాలను సమర్పించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోగా, రాష్ట్రంలోని నాటి ముఖ్యమంత్రి వైఎస్ మిత్ర ధర్మానికి భిన్నంగా 11 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, చీల్చి టీఆర్ఎస్‌ను అస్థిరపరిచే ద్రోహానికి తలపడ్డాడు. 2009 ఎన్నికల్లో మరోసారి అధికారం చేపట్టిన కాంగ్రెస్ టీఆర్ఎస్ శాసనసభ్యులను చేర్చుకొని టీఆర్ఎస్ ఉనికి లేకుండా చేయాలని చూసింది. ఆ తర్వాత 2009, అక్టోబర్‌లో 14 ఎఫ్‌కు సంబంధించిన ఒక కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సాధనే జీవిత లక్ష్యంగా ఉద్యమాన్ని సాగిస్తున్న 'కేసీఆర్ సచ్చుడో-తెలంగాణ వచ్చుడో...', 'తెలంగాణ జైత్రయాత్రో- కేసీఆర్ శవయాత్రో' అంటూ భీష్మించి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణలోని ప్రతి గుండెను తట్టి లేపింది. తెలంగాణ యావత్ ఆందోళనలతో అట్టుడికింది. ఎగిసిపడుతున్న ఉద్యమం, సబ్బండ వర్గాలు ఏకమై సాగుతున్న నిరసనలు, తెలంగాణే దీక్ష శిబిరంగా పరిణమించగా పూర్తిగా క్షీణించిన కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై పార్లమెంట్ ఆందోళన వ్యక్తం చేయగా కేంద్ర ప్రభుత్వం తరపున నాటి హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, కేసీఆర్ నిరహారదీక్ష విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటన ఫలితంగా కేసీఆర్ దీక్షను విరమించారు. ఆగమేఘాల మీద సీమాంధ్రులు సృష్టించిన నకిలీ ఉద్యమం ప్రభావానికి, ఒత్తిడికి లోనైన కేంద్రం యూ-టర్న్ తీసుకొని ఘోరాతి ఘోరమైన ద్రోహం చేసింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-6.**





కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టగా అరెస్టు చేశారన్న వార్త విని ఖిన్నుడైన శ్రీకాంతాచారి అదే రోజు తనపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా డిసెంబర్ 3న అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి బలిదానం యావత్ జాతిని కలచివేసింది, కదిలించింది. తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షలోని పవిత్రతను, దాని తీవ్రతను చాటడానికి మూర్ఖుల, ద్రోహుల, దుర్మార్గుల కండ్లు తెరిపించడానికి, లక్ష్యసాధన కోసం వందలాది మంది యువకులు కావాలని జాతి విముక్తికి ప్రాణత్యాగం చేశారు. దీనంతటికీ కారణం కాంగ్రెస్. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-7.**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి, ఆ లక్ష్యాన్ని సాకారం చేసి, నిన్న అధికార పార్టీగా రాష్ర్టాన్ని పదేండ్ల పాటు సుభిక్షంగా, సుఖ, సంతోషాలకు ఆలవాలంగా నిలబెట్టి, నేడు ప్రతిపక్ష పార్టీగా 16 నెలలుగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ దుర్మార్గాన్ని అడుగడుగునా చీల్చి చెండాడుతూ తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ఆశగా, శ్వాసగా కేసీఆర్ నాయకత్వాన రజతోత్సవం జరుపుకొంటున్న వేళ చరిత్రాత్మకమైన భారీ బహిరంగసభకు తెలంగాణలోని ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరు తరలివెళ్దాం. చరిత్రలో అనేక సందర్భాల్లో తెలంగాణకు ద్రోహం తలపెట్టిన, ఇప్పటికీ తలపెడుతూనే ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని ప్రజా సమూహంగా నిలదీద్దాం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకులు)

కేసీఆర్.. మాటలే తూటాలై..



సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

మనిషి జీవితంలో ప్రాణానికి మించిందేదీ లేదు. అటువంటిది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం వందల మంది తమ ప్రాణాలను ధారపోశారు. అలాంటి అమరవీరులను స్మరించడం అనివార్యం. 'తెలంగాణ ప్రజలను రాజకీయంగా చైతన్యపరిచి ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటును ఒప్పించి ప్రత్యేక తెలంగాణ రాష్ర్టాన్ని సాధించడమే తెలంగాణ రాష్ట్ర సమితి అంతిమ లక్ష్యం' అని తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం సందర్భంగా జలదృశ్యంలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ వ్యాఖ్యానించారు.

తాను కోల్పోయిన ఉనికిని తెలంగాణ తిరిగి ఎలా ప్రతిష్ఠించుకున్నదన్న విషయం తెలుసుకోవాలంటే చరిత్ర లోతుల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. భారత స్వాతంత్ర్యానికి ముందు కొన్ని సంస్థానాలు మినహా దేశమంతా బ్రిటిష్ పాలనలో ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో అంతర్భాగమైన తెలంగాణ నిజాం పాలనలో ఉండేది. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణ 1948, సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనమైంది. హైదరాబాద్ రాష్ర్టాన్ని భారతదేశంలో విలీనం చేసుకునేందుకు నిజాం రాజును లొంగదీసుకోవడం కోసం 'ఆపరేషన్ పోలో' పేరుతో కేంద్రం పోలీస్ యాక్షన్ చేపట్టిందని చరిత్ర లిఖించబడినది. తెలంగాణలో జరుగుతున్న సాయుధ రైతాంగ పోరాటం దేశమంతా విస్తరించకుండా అణచివేసేందుకే నిజాంను లొంగదీసుకోవడం అనే ముసుగులో నాటి నెహ్రూ ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' పేరిట తెలంగాణ మీదికి సాయుధ బలగాలను పంపారని తర్వాత కాలంలో ప్రజలకు అర్థమైంది. ఆ తర్వాత తెలంగాణలో సాధారణ ఎన్నికలు నిర్వహించేవరకు ఎంకే వెల్లోడి తెలంగాణకు ముఖ్యమంత్రిగా వ్యవహరించే విధంగా కాంగ్రెస్ కుట్ర పన్నింది. వెల్లోడి ప్రభుత్వ కాలంలోనే చాపకింద నీరులా భాష పేరుతో, ఇతర కారణాలతో ఇక్కడికి చేరి ప్రభుత్వంలో ఇతర ప్రాంతాల వారు, ముఖ్యంగా ఆంధ్ర వారు ఉద్యోగాలు పొందారు.

> **1952లో తెలంగాణలో ఎన్నికలు జరిగాక బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1956 వరకు కూడా వెల్లోడి చీఫ్ అడ్వైజర్‌గా నెహ్రూ ప్రభుత్వం కొనసాగించింది. ఫజల్ అలీ కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా భాషా ప్రయుక్త రాష్ర్టాలు అనే కుట్రకు తెరలేపి హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాలో విలీనం చేశారు.**

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తెలంగాణలో ఉద్యోగాలు పొందడమనేది నిజాం కాలంలో మొదలై, వెల్లోడి పాలన, ఉమ్మడి ఏపీలో కూడా కొనసాగింది. ఇది తెలంగాణ ఏర్పాటయ్యే వరకు కొన్ని దశాబ్దాలుగా కొనసాగింది. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేయడానికి తెలంగాణ సాధించిన కేసీఆర్ ఎంతో ముందు చూపుతో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ యువతకే దక్కే విధంగా చట్టసవరణ చేశారు. నిజాం కాలం నుంచే హైదరాబాద్ ప్రపంచానికి ఒక మోడల్‌గా నిలిచింది. నిజాం రాచరిక పాలనతో పాటు ఫ్యూడల్ దోపిడీ ఉన్నప్పటికీ తెలంగాణలో విద్య, వైద్యం, సాగునీరు, రవాణా, విద్యుత్తు రంగాలలో ఆధునిక దేశాల సరసన హైదరాబాద్ సంస్థానం ఉన్నాయనేది చారిత్రక సత్యం. తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన తర్వాత తిరిగి తెలంగాణ ఏర్పాటు ఏ విధంగా తెలంగాణ వెనుకపడేయబడిందో అందరికీ తెలిసిందే.

చెరువులు, కుంటలతో భాసిల్లిన ప్రాంతం తెలంగాణ. కులమతాల అంతరాలు దైనందిన జీవితంలో కనిపించకుండా ఒక సమతుల్యత పాటించిన ప్రాంతం తెలంగాణ. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా తెలంగాణలోని జలాలను ఆంధ్రాకు మళ్లించుకుపోవడం, చెరువులు, కుంటలను నిర్లక్ష్యం చేయడం, కట్టిన ప్రాజెక్టుల సామర్థ్యం కుదించడం, తెలంగాణకు చేకూరాల్సిన ప్రయోజనం కలిగించకుండా, దశాబ్దాల పాటు ప్రాజెక్టుల నిర్మాణం సాగదీయడం, కట్టాల్సినవి కట్టకపోవడం ఉమ్మడి పాలనలో నిరంతరం జరిగింది. అన్ని రంగాల్లో తెలంగాణ మీద వివక్ష ప్రదర్శించి చివరికి తెలంగాణ అన్న పదం ఉచ్ఛరించలేని స్థితికి తీసుకువచ్చారు.



> **1969 తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసిన తర్వాత అహంకారంతో యథేచ్ఛగా ఆంధ్రా పరిపాలన కొనసాగింది. అంతటి వివక్ష పాలనలో ప్రజలు విసిగి వేసారి ఉన్న సమయంలో తెలంగాణ జనసభ, మహాసభలు తెలంగాణ ప్రజల్లో కొంతమేరకు చైతన్యపరిచే ప్రయత్నం కొన్ని ప్రాంతాల్లో చేశాయి. కోల్పోయిన తెలంగాణ రాష్ట్రం తిరిగి ఉనికిలోకి ఎలా తీసుకురాగలమన్న విషయంలో మాత్రం స్పష్టత 2001 నాటికి లేని పరిస్థితి.**

తెలంగాణ రాష్ట్ర అవతరణ మాత్రమే లక్ష్యంగా కేసీఆర్ 2001, ఏప్రిల్ 27న టీఆర్ఎస్‌కు అంకురార్పణ చేశారు. అప్పుడు జలదృశ్యంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ బానిసత్వానికి అలవాటుపడిన తెలంగాణ టీడీపీ, కాంగ్రెస్ నేతలు, పరిమితంగా ఉన్న బీజేపీ నేతలు మింగుడుపడక ఎగతాళి చేశారు. స్వామిభక్తి పేరుతో వారు అడుగడుగునా బానిసత్వాన్ని చాటుతూ వచ్చారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలకు ఊడిగం చేశారు నాటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు. తెలంగాణ పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోగా ఉద్యమంలోని క్లిష్ట సమయాల్లో తెలంగాణ ఉద్యమాన్ని అవహేళన చేసేవారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వేసిన ఎత్తుగడలు, ఆలోచనతో కూడిన వ్యూహాత్మకంగా వదిలిన మాటలే తూటాలై తెలంగాణ సమాజాన్ని ఏకం చేశాయి. ఒకరు పదులుగా, పదులు వందలుగా, వందలు వేలుగా, వేలు లక్షలుగా, లక్షలు కోట్లయి సకల జనులను కదిలించి వారి ఐక్యతకు పునాది వేసింది కేసీఆర్ ఆలోచనలే. తెలంగాణ ఒక్క కేసీఆర్ వల్ల రాలేదన్న వంకర మాటలు మాట్లాడే వారి పాత్ర తెలంగాణ ఉద్యమంలో విద్రోహ పాత్రనే. కేసీఆర్ ఎంతో చతురత, వ్యూహంతో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను ముగ్గులోకి లాగి వారిని తెలంగాణ అనక తప్పని అనివార్య పరిస్థితిని తీసుకువచ్చారు. వారి శ్రేణులను, పార్టీలను సందర్భానుసారంగా పార్టీలోకి చేర్చుకుంటూనే ఉద్యమం వైపు నడిపించారు. రాజీనామాలు, ఉప ఎన్నికలు, ప్రత్యక్ష ఆందోళనా రూపాలు, ఒకటి కాదు, టీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఈ 25 ఏండ్ల కాలంలో బీఆర్ఎస్, కేసీఆర్ ప్రస్తావన లేకుండా ఏపీ, తెలంగాణలో రాజకీయాలు నడిచిన పరిస్థితి లేదు. ఇదొక ప్రాంతీయ పార్టీగా ఉద్భవించిన పార్టీ 25 ఏండ్ల ఉజ్వల ప్రస్థానం. ఎన్నికల్లో గెలుపోటములు ముఖ్యం కాదు. తెలంగాణ ప్రజలకు కోల్పోయిన తమ అస్తిత్వాన్ని తిరిగి పొందేలా చేసింది బీఆర్ఎస్. ఉనికినే కోల్పోయి, తానెక్కడుందో భారత చిత్రపటంలో తెలియని పరిస్థితిలో తెలంగాణను సుస్థిరం చేయడమే కాదు, అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలిపి ఒక నమూనాగా చూయించింది కేసీఆర్.

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణను ఆర్థికంగా, సమృద్ధిగా మార్చే దిశగా అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ (జీడీపీ) రూ.4.9 లక్షల కోట్ల నుంచి రూ.13.5 లక్షల కోట్లకు పెరుగగా, ప్రతి వ్యక్తికి ఆదాయం రూ.1.12 లక్షల నుంచి రూ.3.47 లక్షలకు గణనీయంగా పెరిగింది. ద్రవ్యవ్యాప్తిలో సైతం 200 శాతం వృద్ధి నమోదైంది. నీటి పరిపాలనలో తెలంగాణ కొత్త అధ్యాయం లిఖించింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు, మిషన్ కాకతీయ ద్వారా 46,000 చెరువుల పునరుద్ధరణ జరిగింది. ఫలితంగా భూగర్భ జల మట్టాలు 6 మీటర్ల మేర పెరిగాయి. రైతుల సంక్షేమం దిశగా రైతుబంధు ద్వారా రూ.72,000 కోట్ల పెట్టుబడి మద్దతును అందించగా, రైతు బీమా పథకంతో లక్షల మంది రైతుల కుటుంబాలకు 5 లక్షల బీమా భద్రతను కల్పించింది. అంతేకాదు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తును అందించి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది.

> **ఈ దేశంలో పుట్టిన ఎన్నో రాజకీయ పార్టీలు రాజకీయ అస్తిత్వం కోసం, రాజకీయ పదవుల కోసం, అధికారం కోసమే పుట్టాయి. కాలగమనంలో కొన్ని అంతరించిపోయాయి. కానీ, దేశంలో ఉన్న ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకుని ఆలోచించినప్పుడు భిన్న భాషా సంస్కృతులు, భిన్న ఆచారవ్యవహారాలు, భిన్న వైవిధ్యభరితమైన సువిశాల దేశంలో రాష్ర్టాల ప్రాధాన్యాలను, ఆయా ప్రాంతాల అభిలాషలను సమన్వయపరచడం గానీ, అర్థం చేసుకోవడం గానీ చేయని కారణంగానే జాతీయపార్టీలు విఫలమయ్యాయి. అందుకే ఈ దేశంలో అత్యంత బలీయమైన శక్తులుగా ప్రాంతీయ పార్టీలున్నాయి.**

కొన్ని జాతీయ పార్టీలు అంతరించిపోతున్నాయి కానీ, ప్రాంతీయ పార్టీలేవీ కనుమరుగైన దాఖలాలు లేవు. అన్ని ప్రాంతీయ అభిలాషకన్నా బలమైన, భిన్నమైన అభిలాష తెలంగాణది. భిన్నమైన చరిత్ర, భిన్నమైన పోరాటం తెలంగాణ సొంతం. అందుకే, తెలంగాణ అజేయంగా నిలిచింది. దీన్ని ఎవరూ రూపు మాపలేరు. దీన్ని ఎవరూ చరిత్ర నుంచి చెరపలేరు. ఈ 25 ఏండ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రస్థానం అనేది ఒక తెలంగాణలోనే కాదు, భారతదేశ రాజకీయాల్లోనే ఒక అద్వితీయమైన ఘట్టం. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలను ఎంత గొప్పగా నిర్వహించవచ్చో ఆధునిక యుగంలో రుజువు చేసినటువంటిది కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ ఉద్యమం. ఇది దేశానికే కాదు, ప్రపంచ పోరాటాలకే అనుసరణీయం. అది తెలంగాణ సాధించిన శాశ్వతమైన గెలుపు. కోల్పోయిన ఉనికిని తిరిగి సాధించిన పార్టీగా రజతోత్సవం సందర్భంగా తన విజయాన్ని తానే నమోదు చేసుకుంటున్నది.

(వ్యాసకర్త: వ్యవసాయ శాఖ మాజీ మంత్రి)

తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన స్వరాష్ట్రం అనే లక్ష్యాన్ని ముద్దాడిన తర్వాత అది కొంతమందికి సాదాసీదాగా అనిపించవచ్చు. అది సాధారణ విషయమేనని కొందరు కొట్టిపారేయనూ వచ్చు. కానీ, పాతికేండ్ల కిందట అది మహోజ్వల, చారిత్రక, అనితర సాధ్యమైన విషయం.

ఎన్నో ఘట్టాలు, ఎన్నెన్నో...



బోయినపల్లి వినోద్ కుమార్



ఉద్యమ రథ సారథి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పాటు ఆలోచన, నిర్ణయం వెనుక ఉన్న కథ ఇదీ.. గతంలోకి వెళ్తే.. ''1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కొనసాగుతుండగానే... 1971లో దేశంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు దేశంలో ఇందిరాగాంధీ ప్రభంజనం వీస్తున్నది. దాన్ని ఎదిరించి ప్రత్యేక తెలంగాణ రాష్ర్టాన్ని డిమాండ్ చేస్తున్న చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)కు తెలంగాణ ప్రజలు పట్టంగట్టారు. తెలంగాణలోని 14 పార్లమెంట్ సీట్లలో 11 మంది (టీపీఎస్) అభ్యర్థులను గెలిపించారు. ఆ తొలి దశ ఉద్యమంలోనే 365 మంది విద్యార్థులు తెలంగాణ కోసం అమరులయ్యారు. దీంతో ఉద్యమం ఉధృతమైంది. కర్ఫ్యూలు విధించారు. ఇన్ని జరిగినా తెలంగాణ ఎందుకు ఇవ్వలేదు? స్వరాష్ట్రం కల ఎందుకు సాకారం కాలేదు? టీపీఎస్‌కు చెందిన 11 మంది ఎంపీలు ఢిల్లీలో తెలంగాణ గళాన్ని వినిపించినా, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ వారిని కాంగ్రెస్‌లో కలుపుకున్నారు.'' ఇలాంటి అనేక విషయాలపై టీఆర్ఎస్ పార్టీ స్థాపనకు ముందే ఏడాది పాటు కేసీఆర్ సుదీర్ఘ చర్చలు జరిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, సాధ్యాసాధ్యాలపై సంపూర్ణ అధ్యయనం చేశారు. ఈ విషయాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్వయంగా చెప్పారు. 'పార్టీ పెట్టాలా, వద్దా? పార్టీ పెడితే తెలంగాణ కచ్చితంగా రావాలి. అంతే తప్ప, తెలంగాణ పేరిట ఉద్యమాలు చేసి ప్రజలను మభ్యపెట్టవద్దు. వారికి ఆశలు కల్పించి మళ్లోసారి తెలంగాణను కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టొద్దు. కాంగ్రెస్ చేతుల్లో తెలంగాణవాదం అణచివేయబడొద్దు. పోలీసుల చేతిలో తెలంగాణ ప్రజలు మళ్లీ లాఠీ దెబ్బలు తినవద్దు. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో రక్తపాతం జరగొద్దు. అసలు తెలంగాణ రాష్ట్రం వచ్చే అవకాశం ఉందా, లేదా?' అనే అంశాలపై కేసీఆర్ లోతైన అధ్యయనం చేశారు.

టీఆర్ఎస్ స్థాపనకు ఏడాది ముందునుంచే కేసీఆర్ ప్రతిరోజు గంటల తరబడి పలురంగాల మేధావులు, నిష్ణాతులు, పెద్దలతో మేధో మథనం చేశారు. పార్టీలో సిద్ధాంతాలను పక్కనపెట్టి టీడీపీలోని తన సహచరులు, పలు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులను, నేతలను, భిన్న భావజాలాలు కలిగిన వారు, 1969 ఉద్యమకారులు, తెలంగాణవాదులు, న్యాయ నిపుణులు, మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, యువత సహా అన్నిరంగాల వారితో చర్చోపచర్చలు జరిపారు. పండితులు, పామరులతో సహా అందరి ఆలోచనలను పంచుకున్నారు. 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాలు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టడం, కొత్త రాష్ర్టాల ఏర్పాటు ప్రక్రియలపై కేసీఆర్ చాలా లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. రాజ్యాంగంలో కొత్త రాష్ర్టాల ఏర్పాటుకు సంబంధించిన ఆర్టికల్-3పై న్యాయ కోవిదులతో చర్చించారు. అంతేకాదు, ఆర్టికల్-3ని రాజ్యాంగంలో పొందుపరిచే సమయంలో రాజ్యాంగసభలో జరిగిన చర్చలపై సుదీర్ఘంగా అధ్యయనం చేశారు. ఈ క్రమంలోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రసంగంపై అధ్యయనం చేశారు. ఏదైనా రాష్ట్రం నుంచి కొత్త రాష్ట్రం ఏర్పడాలంటే.. ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం అవసరమని రాజ్యాంగసభలోని మెజారిటీ సభ్యులు ప్రతిపాదించారు. దీన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఈ ప్రతిపాదనను రాజ్యాంగంలో పొందుపరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త రాష్ర్టాలు ఏర్పడవు. ఎందుకంటే, ఒక రాష్ట్రం నుంచి విడిపోవాలని ఆకాంక్ష ఒక ప్రాంత ప్రజల నుంచి వస్తుంది. ఆ ప్రాంత శాసనసభ్యులు తక్కువగా ఉంటారు. కొత్త రాష్ట్రం ఏర్పాటుకు ఉమ్మడి రాష్ట్రం తీర్మానం అవసరమైతే.. కొత్త రాష్ట్రం ఏనాటికీ ఏర్పడదు. ఆ ప్రజల స్వప్నం ఎప్పటికీ నెరవేరదు. కాబట్టి ఉమ్మడి రాష్ట్ర శాసనసభ అభిప్రాయం మాత్రమే తెలుసుకోవాలి తప్పితే, సమ్మతి అవసరం లేదు' అనే విషయాన్ని కేసీఆర్ అధ్యయనం చేశారు.

ఆర్టికల్-3 ఆధారంగా ఈ అంశాన్ని పసిగట్టిన కేసీఆర్, నాటి తెలంగాణ ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 2001, ఏప్రిల్ 27న టీఆర్ఎస్‌ను స్థాపించారు. తదనంతరం 2004 ఎన్నికల వరకు తెలంగాణ ప్రాంతంలోని 10 జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేక తెలంగాణ వస్తే తప్ప మన బతుకులు మారవనే విషయాన్ని ప్రజలకు తెలియపరిచారు. పల్లె, నగర బాట, తండా బాట, దళితవాడల్లో బస లాంటి వినూత్న కార్యక్రమాలతో తెలంగాణవ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో వరంగల్‌లోని ఓ గిరిజన తండాకు వెళ్లగా.. ఇల్లు అగ్నికి ఆహుతై, బిడ్డ పెండ్లి చేసేందుకు అరిగోస పడుతున్న ఓ లంబాడా ఇంటిని సందర్శించారు. అన్నీ తానై ఆ బిడ్డ పెండ్లి చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మదిలో పుట్టిన ఆలోచనే తెలంగాణ వచ్చాక కల్యాణలక్ష్మి పథకం రూపంలో ఆచరణలోకి వచ్చింది. అంతేకాదు, తెలంగాణ ప్రాంతంలోనే నాగార్జునసాగర్ ఉన్నా.. నల్లగొండ జిల్లాలో పంట లెండుతున్న వైనాన్ని చూసి చలించిపోయిన కేసీఆర్ పాదయాత్రకు పూనుకున్నారు. నల్లగొండలోని ఓ పల్లెలో నీళ్లు లేక, పంటను కాపాడుకునేందుకు వందల బోర్లు వేసిన బోర్ల రాంరెడ్డి ఉదంతాన్ని సమాజం దృష్టికి తీసుకొచ్చారు. వలసలతో బక్కచిక్కిన పాలమూరు గోసను ప్రపంచానికి తెలియజేశారు. ఇలా ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను అందరికీ అర్థమయ్యేలా చాటిచెప్పారు.

2004 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో ఐదుగురు ఎంపీలను గెలిపించుకొని, ఢిల్లీలో తెలంగాణ గళాన్ని వినిపించారు. 2004లో టీఆర్ఎస్ తరపున కేసీఆర్ నాయకత్వంలో ఆయనతో పాటు, నేను, ఆలె నరేంద్ర, మధుసూదన్ రెడ్డి, రవీందర్ నాయక్ ఎంపీలుగా గెలుపొంది ఢిల్లీ గడ్డపై అడుగు పెట్టాం. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ మంత్రివర్గంలో కేసీఆర్‌తో పాటు ఆలె నరేంద్ర చేరినప్పుడు... 'కేసీఆర్ మళ్లీ తెలంగాణను కాంగ్రెస్‌ను తాకట్టు పెట్టారు' అని చాలామంది అర్భకులు ఆరోపణలు చేశారు. అలాంటి ఆరోపణలు, విమర్శలు ఎన్ని ఎదురైనా కేసీఆర్ లెక్కచేయలేదు. తెలంగాణ ఏర్పాటు అనే అంశాన్ని రాష్ట్రపతి ప్రసంగంలో చేర్పించి, కామన్ మినిమం ప్రోగ్రాంలో పొందుపరిచి, వివిధ రాజకీయ పక్షాలను ఒప్పించి, తెలంగాణ ఏర్పాటుకోసం ప్రణబ్ ముఖర్జీ కమిటీని ఏర్పాటు చేయించడంలో సఫలీకృతమయ్యాం. తెలంగాణ ఏర్పాటు పట్ల తమ అభిప్రాయాలను తెలపాలని ప్రణబ్ ముఖర్జీ కమిటీ చెప్పినప్పుడు... కేసీఆర్ దేశంలోనే అనేక రాజకీయ పార్టీలను కలిశారు. గంటల తరబడి సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను ఆయా పార్టీలకు వివరించారు. వారిని ఒప్పించి, తెలంగాణకు అనుకూలంగా లేఖలు ఇప్పించారు. ఈ సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బలమైన పునాది పడింది.

> **2004లో యూపీఏ ప్రభుత్వంలో చేరిన కేసీఆర్ కేంద్రమంత్రిగా 2006 వరకు కొనసాగారు. తెలంగాణ ప్రకటనపై కాంగ్రెస్ మరోసారి మోసం చేయడంతో తన మంత్రి పదవితో పాటు ఎంపీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. ఆ తర్వాత కరీంనగర్‌లో ఆయన మళ్లీ గెలిచారు. తెలంగాణ ఏర్పాటుపై కాంగ్రెస్ కాలు ముందుకు కదపకపోవడంతో 2008లో కేసీఆర్‌తో సహా మేమంతా ఎంపీ సభ్యత్వాలకు మళ్లీ రాజీనామా చేసి పార్లమెంట్ నుంచి బయటకు వచ్చేశాం. ఈ క్రమంలో 2004 నుంచి 2009 మధ్యకాలంలో తెలంగాణ ఏర్పాటుకు కేసీఆర్ ఓ బలమైన పునాది వేశారు. తెలంగాణ ఆకాంక్షను ఢిల్లీ వేదికగా దేశమంతా వినిపించారు. ఆ సమయంలో ఆయనను దగ్గరి నుంచి చూసిన వ్యక్తుల్లో నేనూ ఒక్కడిని.**

2009 సాధారణ ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ నిరాహార దీక్ష చేయడం, 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదం ప్రజలను కదిలించింది. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఉద్యమాలు జరగడం అందరికీ తెలిసిందే. తెలంగాణ ఉద్యమ చరిత్రలో 2009 నుంచి 2014 ఒక ఘట్టం అయితే అంతకుముందు 2004 నుంచి 2009 వరకు కేసీఆర్ ఢిల్లీలో తెలంగాణ పట్ల ఒక అనుకూల వాతావరణాన్ని సృష్టించారు. అందులో భాగంగానే దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలతో తెలంగాణకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయించారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో లోక్‌సభ, రాజ్యసభల్లో పలు పార్టీల మద్దతు కూడగట్టడంలో కేసీఆర్ పాత్ర కీలకమైనది, మరువలేనిది. ఇలా ఎన్నో ఘట్టాలు, ఎన్నెన్నో... తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఇది కీలక ఘట్టం.

(వ్యాసకర్త: పార్లమెంట్ మాజీ సభ్యులు)


జై తెలంగాణ!
భారత రాష్ట్ర సమితి
జై జై తెలంగాణ!!
రజతోత్సవ శుభాకాంక్షలు
ఛలో వరంగల్
బీఆర్ఎస్ రజతోత్సవ సభ
APRIL
27
2025
Muta Gopal
MLA, MUSHEERABAD
గులాబీ జెండా తెలంగాణ ప్రజలకు అండ
పోరుగడ్డ తెలంగాణను మనకు మనమే తీర్చిదిద్దుకున్న విజయ గాథ!
సమస్యలు సాగరాలైనా - పరిష్కారాలను పల్లకీగా మోసిన నాయకత్వం..
బీఆర్ఎస్ 25 ఏళ్ల ప్రస్థానం - ప్రజల హృదయాల్లో చెరగని అభివృద్ధి చిరునామా !!
లక్షలాదిగా తరలివెళదాం..
బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం.
ఏప్రిల్ 27, ఎల్కతుర్తి X రోడ్ హనుమకొండ
MUTA JAISIMHA
MUSHEERABAD CONSTITUENCY

ఓరుగల్లులో గులాబీ హోరే



మొదటిపేజీ తరువాయి...

తున్నామని తెలిపారు. ఆదివారం తెల్లవారగానే పల్లెలు, కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ బాధ్యులు గులాబీ జెండాలను ఎగురవేసి వాహనాల్లో బయల్దేరాలని సూచించారు. తాను కూడా తెలంగాణభవన్‌లో జెండా ఎగురవేసి బయల్దేరి వెళ్తానని చెప్పారు. రజతోత్సవ సభ ప్రాంగణానికి ఐదు వైపులా దారులు ఉన్నాయని వివరించారు. వివిధ ప్రాంతాల వారు తమ సమీప దారులను ఎంచుకొని సమయానికి చేరుకోవాలని సూచించారు. పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో కేటీఆర్ శుక్రవారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. సభ నిర్వహణ తీరుతెన్నులు, ఏర్పాట్లను వివరించారు. 25 ఏండ్ల ప్రస్థానంలో పార్టీ సాధించిన విజయాలు, తగిలిన ఎదురుదెబ్బలు, ఎదుర్కొన్న ఆటుపోట్లు, పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ ప్రణాళికలు, ప్రతిపక్షంగా చేసిన పోరాటాలు, సమస్యలను ఎలుగెత్తిచాటిన తీరును సోదాహరణంగా వివరించారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు

నమస్తే తెలంగాణ: రజతోత్సవ సభకు ఏ విధమైన ఏర్పాట్లు చేశారు?

కేటీఆర్: 2001లో పురుడు పోసుకున్న బీఆర్ఎస్ ఏప్రిల్ 27న 24 ఏండ్లు పూర్తి చేసుకొని 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నది. ఆనవాయితీ ప్రకారం వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో బ్రహ్మాండమైన సభ నిర్వహించాలని నిర్ణయించినం. ఈ సభ చరిత్రలో గొప్ప సభల్లో ఒకటిగా నిలుస్తుంది. పార్టీ అధినేత కేసీఆర్ డైరెక్షన్‌లో 1,300 ఎకరాల్లో అన్ని ఏర్పాట్లు చేసినం. ఇందులో దాదాపు 900 ఎకరాలు పార్కింగ్‌కు కేటాయించినం. మిగిలిన 400 ఎకరాల్లో సభ నిర్వహిస్తాం. సభకు వచ్చేవారికి సేవలందించేందుకు 1,500 మంది వలంటీర్లను నియమించినం. 10 లక్షల చొప్పున మంచినీళ్ల బాటిళ్లు, చల్ల ప్యాకెట్లకు ఆర్డరిచ్చినం. 250 జనరేటర్లు, 200 మొబైల్ పెట్రోలింగ్ వాహనాలు, 250 సీసీ కెమెరాలు అమర్చినం. తాత్కాలిక కంట్రోల్ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసినం. 200 వైర్‌లెస్‌సెట్లు అందుబాటులో ఉంచినం. గూగుల్ ట్రాన్స్‌లొకేషన్ మ్యాపుల ఆధారంగా ప్రవేశమార్గాలు ఏర్పాటు చేసినం. మూడు వేల బస్సులను అందుబాటులో ఉంచినం. వాహనాలు చెడిపోతే, ఆగిపోతే తీసుకెళ్లేందుకు 25 టోయింగ్ వెహికిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున సభను సాయంత్రం 5:00 గంటలకు మొదలు పెడతం. కేసీఆర్ గులాబీ జెండాను ఆవిష్కరించిన తర్వాత తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేస్తారు. తదనంతరం అమరులవీరులకు నివాళులర్పిస్తారు. వచ్చినవారందరూ చీకటి పడకముందే ఇండ్లళ్లకు చేరుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

నమస్తే తెలంగాణ: ఇంత పెద్ద ఎత్తున నిర్వహించనున్న సభ ద్వారా ప్రజలకు ఏ సందేశం ఇస్తారు?

కేటీఆర్: కేసీఆర్ చేసే ప్రసంగం కోసం యావత్ తెలంగాణ సమాజం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నది. మళ్లీ అందరూ టీవీలకు అతుక్కుపోయే పరిస్థితి. మేం కూడా ఆయన ఏం చెప్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నం. పొరుగు రాష్ట్రాల ప్రజలు సైతం అమితాసక్తి ప్రదర్శిస్తున్నారు. గొప్పగా నిర్వహించే సభ ద్వారా కేసీఆర్ కచ్చితంగా రాష్ట్ర దశ, దిశను నిర్దేశిస్తారనే విషయంలో ఎంతమాత్రం సందేహంలేదు.

నమస్తే తెలంగాణ: ఏయే జిల్లాల నుంచి ఎంతమంది వస్తారని అంచనావేస్తున్నారు?

కేటీఆర్: ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తారు. కానీ, ఎక్కువగా వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్, నల్లగొండ జిల్లాల నుంచి వస్తారు. ఈ జిల్లాలతో పోల్చుకుంటే ఇతర జిల్లాల నుంచి కొద్దిగా తక్కువగా వస్తారని భావిస్తున్నాం.

నమస్తే తెలంగాణ: ఏడాది పొడుగునా ఉత్సవాలు నిర్వహిస్తారా? లేదంటే సభకే పరిమితం చేస్తారా?

కేటీఆర్: మా పార్టీకి వివిధ దేశాల్లో ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. అక్కడ కూడా ఘనంగా వేడుకలు జరుగుతాయి. పార్టీ ముఖ్యనేతలు హాజరవుతారు. రాష్ట్రంలోనూ పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తం. ఇందుకోసం పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తం. జిల్లాలవారీగా, నెలలవారీగా కొన్ని కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నాం. త్వరలోనే అన్ని విషయాలు చెప్తాం. మధ్యలో స్థానిక ఎన్నికలు వస్తే దీటుగా ఎదుర్కొంటం. ప్రజల్లోకి వెళ్లి సత్తాచాటుతాం.

నమస్తే తెలంగాణ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మీకు ప్రధాన ప్రత్యర్థి బీజేపీనా? కాంగ్రెస్ పార్టీనా?

కేటీఆర్: ముమ్మాటికీ కాంగ్రెస్సే. బీజేపీకి తెలంగాణలో స్థానంలేదు. ఇది అనేక సందర్భాల్లో రుజువైంది. ఆ పార్టీ కేవలం పార్లమెంట్ ఎన్నికల్లోనే కొంత మెరుగైన స్థానాలు సాధిస్తుంది. అది కూడా మోదీ హవాతోనే. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎనిమిది మంది మాత్రమే గెలువడం ఇందుకు నిదర్శనం. ఆ పార్టీకి చెందిన హేమాహేమీలుగా భావిస్తున్న బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి, అర్వింద్, రఘునందన్‌రావును అసెంబ్లీ ఎన్నికల్లో మట్టి కరిపించింది బీఆర్ఎస్సే. అసెంబ్లీ ఎన్నికల్లో గెలువని వారు ఇతర అభ్యర్థులను గెలిపిస్తారా? అది సాధ్యమయ్యే పనికాదు.

నమస్తే తెలంగాణ: పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఎప్పటి నుంచి దృష్టిసారిస్తారు? అధ్యక్షుడి ఎన్నిక ఎప్పుడు?

కేటీఆర్: సభ ముగిసిన ఒకటి రెండు రోజుల్లో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెడతం. పార్టీ రాజ్యాంగం ప్రకారం ప్రతి నాలుగేండ్లకోసారి కార్యవర్గాన్ని ఎన్నుకుంటం. మే నెలలో సభ్యత్వ నమోదు ప్రారంభించి ఆగస్టులోగా పూర్తిచేస్తాం. తర్వాత వివిధ స్థాయి ల్లో కమిటీలను ఎన్నుకుంటం. అక్టోబర్‌లో అధ్యక్షుడిని ఎన్నుకుంటం. ఇందుకు పార్టీలోని ఎవరైనా పోటీపడవచ్చు.

నమస్తే తెలంగాణ: బీఆర్ఎస్ సంస్థాగతంగా ఎందుకంత వీక్‌గా ఉన్నది? ఎక్కడా కమిటీలు ఎందుకు లేవు?

కేటీఆర్ : అలా అని ఎందుకు అనుకుంటారు? మాకు పూర్తి స్థాయిలో రాష్ట్ర కమిటీ ఉన్నది. జిల్లా పార్టీ ప్రెసిడెంట్లు ఉన్నారు. నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ఉన్నారు. మిగతా పార్టీలకు మాకు తేడా ఏంటంటే.. ప్రతి నియోజకవర్గ బాధ్యుడే స్టేట్ కమిటీ మెంబర్‌గా ఉన్నాడు. తెలంగాణ వచ్చాక మేము కొట్లాడింది మూడు ఎన్నికలు. వాటిల్లో మా పని తీరు చూడండి. రెండు జీహెచ్ఎంసీ ఎన్నికలు కొట్లాడాం. గతంలో 32కి 32 జిల్లా పరిషత్‌లు గెలిచాం. 143 మున్సిపాలిటీలకు 136 గెలిచాం. మేము సంస్థాగతంగా బలంగా లేకపోతే ఇవన్నీ ఎలా సాధ్యమవుతాయి?

నమస్తే తెలంగాణ: గ్రామ శాఖ నుంచి నిర్మాణం లేదనే వాదన వినిపిస్తున్నది.

కేటీఆర్: ఎందుకు లేదు? గ్రామాల్లో మాకు కావల్సినంత బలం ఉన్నది. కొన్ని పార్టీలను క్యాడర్ బేస్డ్ పార్టీలని చెప్తారు. సొంతంగా, పొత్తులు లేకుండా ఒక్క ఎలక్షన్ గెలిచారా? తమిళనాడులో రెండు పార్టీల్లో ఒకసారి వాళ్లు గెలిస్తే.. మరోసారి వీళ్లు గెలుస్తారు. క్యాడర్ చాలా ముఖ్యమే కానీ, ఒక్కోసారి క్యాడర్ గెలుస్తామనే నమ్మకాన్ని ఇవ్వకపోవచ్చు. పార్టీ నిర్మాణం చాలా ముఖ్యం. ఉద్దేశాలు, ట్రెండ్, మూడ్ అన్నీ పరిగణనలోకి వస్తాయి. మేము గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే ఓడిపోయాం. క్యాడర్ బేస్డ్ పార్టీలని చెప్పుకుంటున్న వారితో పోల్చితే మేము చాలా ఉన్నత స్థాయిలోనే ఉన్నాం.

నమస్తే తెలంగాణ: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎందుకు దూరంగా ఉన్నారు?

కేటీఆర్: మేం ఎన్‌రోల్‌మెంట్ చేయలేదు. పోస్ట్ గ్రాడ్యుయేట్‌నైన నేను కూడా ఓటు నమోదు చేసుకోలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికతో గవర్నమెంట్ మారేది లేదు. పెద్దగా ప్రయోజనమేమీలేదు. అందుకే దూరంగా ఉన్నం. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేంత బలం మాకు లేదు. ఈ పరిస్థితుల్లో ఓటింగ్‌ను బహిష్కరించినం. అయినా ఎన్నికల్లో పాల్గొననంత మాత్రాన ఏదో అయిపోతుందని అనుకోవడం అపోహే. మన కండ్ల ముందే ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఏపీలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు బలవంతంగా స్థానిక సంస్థల్లో పోటీ చేస్తే ఏమైంది? ఆయన సొంతూరు కుప్పంలో కూడా ఆశించిన ఫలితం రాలేదు. కానీ, ఏమైంది? అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించలేదా? మేం కూడా కొన్ని సందర్భాల్లో వ్యూహాత్మకంగానే ఎన్నికలకు దూరంగా ఉంటున్నం.

నమస్తే తెలంగాణ: మీరు ఇంకా అధికారంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి? దీనికి మీ సమాధానం..?

కేటీఆర్: తెలంగాణలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నట్టు మాట్లాడుతున్నరు. ఏడాదిన్నర కావస్తున్నా బీద అరుపులు అరుస్తున్నరు. ఆయన ఎవరినీ గుర్తించడంలేదు. ఆయనను ఎవరూ గుర్తుపట్టడంలేదు. ఒకాయేమో ఉత్తమ్ ముఖ్యమంత్రి అంటడు. ఇంకొకాయన పొంగులేటి పేరు చెప్తాడు. మరో ఎమ్మెల్యే తుమ్మల మా సీఎం అంటున్నడు. వారి పార్టీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను ముఖ్యమంత్రి అంటున్నరు. వాళ్లు అధికారంలో ఉన్నామా? ప్రతిపక్షంలో ఉన్నామా? అనే కన్ఫ్యూజన్‌లో ఉన్నరు. అందుకే మీడియాకు వాళ్లు ప్రతిపక్షంలా కనబడుతున్నరు. వాళ్లడిగిన ప్రశ్నలకు దీటుగా బదులిస్తున్న మమ్మల్ని అధికార పక్షం అనుకుంటున్నరు అంతే.

నమస్తే తెలంగాణ: మీరు ప్రతిపక్షంగా సాధించిన విజయాలేంటి?

కేటీఆర్: ప్రజలకు భరోసా ఇవ్వగలిగినం. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపినం. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటిగా వ్యవహరిస్తున్నా ఒంటరిగా ప్రజా సమస్యలపై పోరాడినం. ప్రజలు తమ కష్టాలు చెప్పుకొనేందుకు ఓ వేదిక ఉన్నదనే భావన కలిగింది. ఈరోజు తెలంగాణభవన్ జనతాగ్యారేజీగా మారింది. హైడ్రా, మూసీ బాధితులు, ఆటో డ్రైవర్లు, ఆపదలో ఉన్న రైతులు మా తలుపుతడుతున్నరు. న్యాయపరంగానో, ఏదోవిధంగానో అండగా ఉండాలని కోరుతున్నారు. లగచర్ల లంబాడా గిరిజన రైతుల తరుపున అలుపెరగని పోరాటం చేసినం. అందుకు గర్వపడుతున్నం. సమస్యను ఢిల్లీ స్థాయిలో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినం. ఇటీవలే ఎన్‌హెచ్ఆర్సీ కూడా ప్రభుత్వానికి మొట్టికాయలేసింది. ఇది బీఆర్ఎస్ విజయం కాదా? హెచ్‌సీయూ విషయంలో దేశం దృష్టిని ఆకర్షించగలిగినం. సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ కూడా ఇందులో ఆర్థిక అక్రమాలు ఉన్నాయని తేల్చి విచారణ జరిపించాలని నివేదించింది. ఇది బీఆర్ఎస్ ఘనత కాదా? అలాగే అనేక ఎదురుదెబ్బలు తగిలినయ్. పార్లమెంట్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినం, కవిత అరెస్టు, కేసీఆర్ గాయపడటం, పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ఫిరాయించడం. కానీ, ఇవేవీ శాశ్వతం కాదు. ప్రజల కోసం పోరాడినప్పుడే ప్రజాస్వామ్యంలో విజయం వరిస్తుంది.

నమస్తే తెలంగాణ: ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో కొందరు వెనక్కి వస్తామంటున్నారు. ఇది నిజమేనా? మళ్లీ వస్తే తీసుకుంటారా?

కేటీఆర్: వాళ్లను వెనక్కి తీసుకోవద్దన్నదే నా వ్యక్తిగత అభిప్రాయం. ఫిరాయింపు ఎమ్మెల్యేలను తీసుకుంటే మా కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయి. ఒకవేళ తీసుకోవాల్సిన సందర్భం వస్తే, పార్టీగా అందరం కూర్చొని నిర్ణయం తీసుకోవాలి. వ్యక్తిగతంగా ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్లను తీసుకోవద్దనే చెప్తా. ఎందుకంటే, అది మా కార్యకర్తలకు అవమానం. వాళ్లు వెళ్లిన తర్వాత పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలు, నాయకుల అభిప్రాయమే మాకు ముఖ్యం.

నమస్తే తెలంగాణ: మళ్లీ పార్టీలోకి వస్తామని వాళ్ల నుంచి ఏమైనా సంకేతాలు వచ్చాయా?

కేటీఆర్: మస్తు వచ్చినయ్. చాలామంది ఆసక్తి చూపుతున్నారు కూడా. కానీ, నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రం వాళ్లను పార్టీలోకి మళ్లీ తీసుకోవద్దనే చెప్తా. ఇది పెద్ద పార్టీ కదా. తెరిచిన ద్వారంలాగా.. ఎప్పుడంటే అప్పుడు వెళ్లడం.. రావడం కుదరదు. ఇదేం పద్ధతి? పోయినోడు పోయిండు.. కొత్తవాళ్లకు అవకాశం ఇచ్చి, రెండుమూడు దశాబ్దాలకు సరిపడా మంచిగా నాయకత్వాన్ని తయారు చేసుకుంటాం. ఇదిమాకు అరుదైన అవకాశం.

నమస్తే తెలంగాణ: ఫిరాయింపుదారులను వెనక్కి తీసుకునే అంశంపై పార్టీ అధినేత కేసీఆర్ ఏమంటున్నారు?

కేటీఆర్: ప్రస్తుతానికి అలాంటి చర్చ ఏమీ లేదు. ఇలాంటి సందర్భాలు వస్తే కేసీఆర్ కూడా పార్టీలో అందరి అభిప్రాయం తీసుకునే నిర్ణయాలు తీసుకుంటారు. అనేక ఉదాహరణలున్నాయి. 2009లో కేసీఆర్ పీఆర్పీతో పొత్తు పెట్టుకోవాలని అన్నారు. మా పార్టీలో కొంతమంది టీడీపీతో పొత్తు పెట్టుకుందామని చెప్పారు. మెజారిటీ నిర్ణయం ప్రకారం టీడీపీతోనే పొత్తు పెట్టుకున్నాం. కేసీఆర్ ప్రజాస్వామ్యవాది. పార్టీలో, రాష్ట్ర కమిటీలో, ఎంపీలు, ఎమ్మెల్యేల్లో మెజారిటీ అభిప్రాయం తీసుకుంటారు. తప్ప.. సొంతంగా ఇలాంటి వాటిపై నిర్ణయాలు తీసుకోరు.

కలిసిపోయారు కదా. ఇందులో మా బంధం ఏమున్నది?

నమస్తే తెలంగాణ: ఈ ఏడాది జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తరా?

కేటీఆర్: అసలు ప్రభుత్వం ఎన్నికలు పెడుతుందా? జీహెచ్ఎంసీని ఏం చేస్తున్నదనే విషయంలో స్పష్టత లేదు. ఒకసారి మూడు ముక్కలు చేస్తామంటున్నరు. విభజించినా మళ్లీ డీలిమిటేషన్ చేయాలి. సాంకేతిక చిక్కులు కూడా వస్తాయి. వారి చేతిలో అధికారం ఉన్నది. ఏం చేస్తారో చూడాలి. ఒకవేళ ఎన్నికలు నిర్వహిస్తే తప్పకుండా పోటీ చేస్తాం. ప్రజల్లోకి వెళ్లి మా బలమేంటో నిరూపించుకుంటం.

నమస్తే తెలంగాణ: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) రిపోర్టును 'ఎన్డీయే' రిపోర్టు అని అనడానికి కారణమేంటి?

కేటీఆర్: మేడిగడ్డలో ఒక ఘటన జరిగిందనగానే ఆగమేఘాల మీద 24 గంటల్లో ఎన్డీఎస్ఏ పరుగుపరుగున వచ్చింది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు మేడిగడ్డలోని ఓ పిల్లర్‌లో పగులు వచ్చిందని దుష్ప్రచారం చేశారు. మరి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయినా... సుంకిశాల రిటైనింగ్ వాల్ దెబ్బతిన్న సందర్భంలో ఎన్డీఎస్ఏ ఎటుపోయింది? వట్టెంలో పంపుహౌస్ మునిగిపోయింది.. కేంద్రం నుంచి ఒక్క ఏజెన్సీ వచ్చిందా? పెద్దవాగు కొట్టుకునిపోయిందని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎవరైనా అడిగారా? కేసీఆర్, బీఆర్ఎస్‌పై ద్వేషంతో కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులతో తెలంగాణ ప్రజలు నష్టపోతున్నారు. ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు గత సంవత్సరం డిసెంబర్‌లో వస్తే.. ఈ నెల 24, 25న ఎందుకు విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఉన్నదనగానే బీఆర్ఎస్‌ను బద్నాం చేసే కుట్రలో భాగంగానే బీజేపీ వండివార్చి ఎన్డీయే రిపోర్టును విడుదల చేసింది. బీహార్‌లో రోజుకో బ్రిడ్జి కూలితే ఎన్డీఎస్ఏ ఎందుకు ఒక్క రిపోర్టు ఇవ్వడం లేదు. గుజరాత్‌లోని మోర్బి బ్రిడ్జి కూలి 140 మంది చనిపోతే ఏ రిపోర్టూ లేదు. బీహార్, గుజరాత్‌కు రూల్స్ ఉండవా? రాజకీయ ప్రేరేపితంలో భాగంగానే ఎన్డీఎస్ఏ రిపోర్టు తయారుచేశారు.

నమస్తే తెలంగాణ: బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు..కదా?

కేటీఆర్: ఈ ప్రభుత్వం ఇచ్చినమాట తప్పిందని సీఎం రేవంత్‌రెడ్డిపై మా కార్యకర్త పోస్టు పెడితే.. సైబర్‌క్రైమ్ బ్యూరోలో పనిచేసే కానిస్టేబుల్ తన మనోభావాలు దెబ్బతిన్నాయంటూ కేసు పెట్టాడు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తీస్తాం. పోలీసులు ఎక్కడ ఏం చేస్తున్నారో మాకు అంతా తెలుసు. భూదాన్ భూముల్లో ఏం చేస్తున్నారు.. ముగ్గురు పోలీసు అధికారులు విల్లాలు కడుతున్నారని పత్రికల్లో వచ్చింది. అన్నింటినీ వెలికి తీసే సమయం వస్తుంది. రీ పోస్టు చేస్తే కేసులు పెడతారా? హెచ్‌సీయూలోకి బుల్డోజర్లు పంపి అరాచకం చేసింది ప్రభుత్వం.. కేసు పెడితే సీఎం రేవంత్‌రెడ్డిపై పెట్టాలి.



నమస్తే తెలంగాణ: పెహల్గాం ఉదంతాన్ని బీజేపీ రాజకీయం చేయాలని చూస్తున్నట్టుంది..?

కేటీఆర్: ఇట్లాంటి సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలనుకోవడం నీచమైన చర్య. నీచమైన నాయకులు మాత్రమే ఇట్లాంటి ఘటనలను రాజకీయం చేస్తారు. మాకు ఆ ఖర్మ పట్టలేదు. మేము ఎన్నడూ ధర్మాన్ని రాజకీయం చేయలేదు. యాదగిరిగుట్టలో రూ.1,800 కోట్ల ప్రభుత్వ డబ్బుతో దేశంలోనే అద్భుతమైన ఆలయం కట్టిన ఏకైన నాయకుడు కేసీఆర్. మేము స్పిరిచువల్లీ హిందూ.. నాట్ పొలిటికల్ హిందూస్. ఇట్లాంటి సమయంలో ప్రభుత్వానికి, దేశానికి అండగా నిలబడటం దేశభక్తి.

నమస్తే తెలంగాణ: ఎంఐఎంతో మీ బంధం ఎలా ఉండబోతున్నది?

కేటీఆర్: మొన్నటి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాళ్లు కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొనే ఓట్లు వేసుకున్నారు కదా. వాళ్లు వాళ్లు

నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నేతలు మీ పార్టీది టీఆర్ఎస్ ఆవిర్భావమా? లేక బీఆర్ఎస్ ఆవిర్భావమా? అని ప్రశ్నిస్తున్నారు కదా..?

కేటీఆర్: కేసీఆర్ నాయకత్వంలో పుట్టి టీఆర్ఎస్‌గా ఒక విజయం సాధించి.. బీఆర్ఎస్‌గా మారిన పార్టీగా ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నాం. అయినా మా పార్టీ పండుగ మేము చేసుకుంటే కాంగ్రెస్ వాళ్లకు వచ్చిన బాధ ఏంటీ..? కాంగ్రెస్ నాయకులు ముందు పాలనపై దృష్టి పెట్టి ప్రభుత్వాన్ని నడపాలి.



నమస్తే తెలంగాణ: మీకు బీజేపీతో పొత్తు పెట్టుకునే ఆలోచన ఏమైనా ఉన్నదా?

కేటీఆర్: బీజేపీతో పొత్తు పెట్టుకునే ఖర్మ మాకేం పట్టలేదు. అవసరం అంతకంటే లేదు. ఒక పార్టీగా వాళ్లే రోజురోజుకూ దిగజారిపోతున్నారు. 2014లో మాకు 63 సీట్లు వచ్చాయి. అదే సమయంలో మోదీ 278కిపైగా సీట్లు సాధించారు. రెండోసారి మాకు 88 సీట్లు వచ్చాయి. మోదీకి 303 సీట్లు వచ్చాయి. మొన్నటి ఎన్నికల్లో మాకు 39 వచ్చాయి. మోదీకి 240 వచ్చాయి. మోదీ నైతికంగా ఓడిపోయారు. మేమూ ఓడిపోయాం. ఆయన పొత్తుతో అధికారంలోకి వచ్చారు. దేశంలో మోదీ, బీజేపీ ప్రభ రానున్న రోజుల్లో ఇంకా తగ్గుతుంది. కేంద్రంలోనే వాళ్ల పరపతి తగ్గుతున్నప్పుడు వారితో పొత్తు మాకెందుకు? పదేండ్లలో తెలంగాణకు ఏమీ చేయనివాళ్లు.. తెలంగాణలో ఓట్లు ఏమని అడుగుతారు. గుడికట్టారా? బడి కట్టారా? ఓ కాలేజీ ఇచ్చారా? పరిశ్రమ తెచ్చారా? ఇక్కడ్నుంచి తీసుకున్నదే తప్ప.. వాళ్లు చేసింది ఏమున్నది?

నమస్తే తెలంగాణ: డబుల్ ఇంజిన్ సర్కార్‌తో తెలంగాణకు మేలు జరుగుతుందని అంటున్నారు కదా?

కేటీఆర్: మన దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రం ఏది బాగున్నదో చెప్పండి? కేసీఆర్ నాయకత్వంలో సింగిల్ ఇంజిన్ సర్కార్ కంటే.. ఏ డబుల్ ఇంజిన్ సర్కార్ మెరుగ్గా పనిచేసిందో చెప్పాలి? అలా చెప్తే.. మేము కూడా నేర్చుకుంటాం.

నమస్తే తెలంగాణ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు కదా..?

కేటీఆర్: కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి రేవంత్‌రెడ్డి దుర్భాషలు, దిక్కుమాలిన మాటలు వినాల్నా? కేసీఆర్ అభిమానిగా, పార్టీ కార్యకర్తగా నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీకి కేసీఆర్ ట్రంప్ కార్డు లాంటి వాళ్లు. అసెంబ్లీలో బజారుభాష మాట్లాడే సీఎం రేవంత్‌రెడ్డికి గట్టిగా సమాధానం ఇవ్వడానికి నాతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కేసీఆర్‌లాంటి నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండాలి. లగచర్ల, హెచ్‌సీయూ లాంటి అంశాల్లో మాకు మార్గనిర్దేశనం చేస్తున్నది కేసీఆరే. కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం దాసోహం అయితే నల్లగొండలో కేసీఆర్ గర్జిస్తే ఒక్క రోజులో పరిస్థితి మారిపోలేదా? 46-47 ఏండ్ల రాజకీయ అనుభవం కేసీఆర్ సొంతం. ఎన్టీఆర్, జయలలిత, కరుణానిధి లాంటి వాళ్లు చాలా సందర్భాల్లో అసెంబ్లీలో కాలు పెట్టలేదు. మా పోరాటాలకే సీఎం రేవంత్‌రెడ్డి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్‌రెడ్డి అసెంబ్లీ నుంచి పారిపోవడం ఖాయం.

నమస్తే తెలంగాణ: గత ప్రభుత్వం చేసిన అప్పులను కట్టడానికే డబ్బులు సరిపోతున్నాయని రేవంత్ సర్కార్ అంటున్నది? దీని గురించి మీరేమంటారు?



కేటీఆర్: రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతనైత లేదు. ముఖం బాగలేక అద్దం పగలగొట్టినట్టుంది. పాలన చేతగాక పక్కనోళ్ల మీద దుమ్మెత్తిపోస్తుండు. ఎన్నిరోజులు తప్పించుకుంటారు? హామీలు ఇచ్చినప్పుడు వాళ్లు అసెంబ్లీలో లేరా? మేము అసెంబ్లీలో అప్పుల లెక్కలు చెప్పినప్పుడు లేరా? కాగ్ నివేదిక ఇచ్చినప్పుడు లేరా? మీదసలు పొలికల్ పార్టీనా? లేక సర్కస్ కంపెనీనా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియకుండానే హామీలు ఇస్తారా? మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌కు ఇవి తెల్వదా? భట్టి విక్రమార్కకు, నాటి పీసీసీ చీఫ్‌కు, సునీల్ కనుగోలుకు తెల్వదా? అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. పాలన చేతగాక అప్పులో అప్పులో అని అంటున్నారు. అప్పులు చేసిన రాష్ట్రాల్లో కింది నుంచి 5వ స్థానంలో తెలంగాణ ఉన్నట్టు మొన్న పార్లమెంట్‌కు ఇచ్చిన నివేదిక చెప్పింది. అప్పులపై వాళ్లు చేసే ప్రచారం తప్పని శాసనసభలో చెప్పాం. మేము ఏడాదికి రూ.41 వేల కోట్ల అప్పు చేస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఏడాదికి రూ.లక్షా 60 వేల కోట్లు అప్పు చేసిండు. మాతో పోల్చుకుంటే నాలుగు రెట్లు. మొన్న బడ్జెట్‌లో కూడా మనది మిగులు రాష్ట్రం అని భట్టి విక్రమార్క చెప్పారు. అప్పులు, మిత్తీలు కట్టంగ, సబ్సిడీ, జీతాలు, పెన్షన్లు ఇవ్వంగా ఇంకా డబ్బులు మిగిలే ఉన్నాయని చెప్పారు. మిగులు రాష్ట్రమని మీరే చెప్పి.. అప్పుల వడ్డీలు కట్టడం కోసం అప్పులు చేస్తున్నామని చెప్పడం తప్పు కాదా? బడ్జెట్‌లో మీరే గొప్పగా చెప్తారు. బయటికొస్తే మీరే బీద అరుపులు అరుస్తారు. రూపాయిలో 47 పైసలు కమిటెడ్ ఎక్స్‌పెండేచర్ అని సోషియో ఎకనామిక్ బుక్‌లో చెప్పారు. సీఎంకు ఇవ్వన్నీ తెల్వదు. ఆయనకు పాలనా అనుభవం లేదు. ఎవరో రాసిస్తారు.. ఆయన చదివేస్తారు.

నమస్తే తెలంగాణ: 2001లో తెలంగాణ అస్తిత్వం పేరుతో ఉద్యమ పార్టీగా వచ్చిన టీఆర్ఎస్.. కాల క్రమేణా బీఆర్ఎస్‌గా మారింది. అప్పట్నుంచే తెలంగాణతో వారికి బంధం పోయిందని కొన్ని పార్టీల నేతలంటున్నారు. బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతుందా?

కేటీఆర్: కాంగ్రెస్ ఎన్నిసార్లు పేర్లు మార్చుకున్నది. బీజేపీ ఎన్నిసార్లు పేర్లు మార్చుకున్నది. ఇందిరా కాంగ్రెస్, కాంగ్రెస్ ఐ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, రెడ్డి కాంగ్రెస్.. ఇలా ఎన్నోసార్లు మార్చుకున్నది. అలాగే బీజేపీ కూడా. అసలు పేరు ఎందుకు మారిందంటే.. రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. తెలంగాణ చేపట్టిన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా మారుతున్నాయి. రైతుబంధు, మిషన్ భగీరథ వంటివి ఎన్నో రూపాల్లో దేశమంతా ఉన్నాయి. రెండోది మహారాష్ట్రలో బీఆర్ఎస్ నుంచి ఎంతోమంది సర్పంచ్‌లు గెలిచారు. తమ గ్రామాలను తెలంగాణలో కలుపండి అంటూ మొరపెట్టుకున్నారు. భవిష్యత్ అంతా సంకీర్ణ ప్రభుత్వాలే కదా.. అలాంటప్పుడు మనమెందుకు 25-30 ఎంపీ సీట్లు తెచ్చుకొని కేంద్రంలో కీలకంగా మారకూడదనుకున్నాం. తెలంగాణ పవర్, సత్తా దేశానికి ఎందుకు చాటొద్దు అని అనుకున్నాం. మారింది పేరే కదా.. ఆ సత్తా అలాగే ఉంది కదా. టీఆర్ఎస్ అనే పేరు మీద మహారాష్ట్రలోనో, ఇతర రాష్ట్రాల్లోనో పోటీ చేయలేం కదా. ఒకవేళ చేస్తే.. అది తెలంగాణ పార్టీ అంటారు. అందుకే సాంకేతికంగా పేరు మార్చుకున్నాం. మా నాయకుడు మారలేదు. గుర్తు మారలేదు. జెండా, అజెండా మారలేదు. మొదటి ప్రయత్నంలో విఫలం అయ్యామేమో కానీ, విజయాన్ని తప్పకుండా ముద్దాడతాం. ఒక ఎదురుదెబ్బకే వెనక్కి పోతే.. తెలంగాణ వచ్చేదే కాదు కదా! మాకు ఇదే పేరుకి 37% మంది ఓట్లు వేశారు కదా. కేవలం 1.8% ఓట్ల తేడాతోనే కదా ఓడిపోయింది. 14 చోట్ల ఆరు వేల కంటే తక్కువ ఓట్లతో ఓడిపోయాం. జుక్కల్‌లో 1,100 ఓట్లు, దేవరకద్రలో 1,300 ఓట్లతో, కాగజ్‌నగర్, ఆదిలాబాద్, బోధన్ వంటి చోట్ల సుమారు 3,000 ఓట్లతో ఓడియాం. సామాన్యుల్లో బీఆర్ఎస్, టీఆర్ఎస్ అనే మీమాంస లేదు. గులాబీ జెండా అంటే.. తెలంగాణ పార్టీ అంతే. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి రావడం మా మొదటి లక్ష్యం. ఇంట గెలిచి రచ్చ గెలుస్తాం.

నమస్తే తెలంగాణ: మీ హయాంలో ఉద్యోగ నియామకాలపై ఏం చెప్తారు?

కేటీఆర్: మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం.. కాంగ్రెస్ విధానం. మా ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి కూడా ప్రచారం చేసుకోలేకపోయాం. ఏడాదికి 16 వేల ఉద్యోగాలు ఇచ్చాం. అంతకుముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి వెయ్యి ఉద్యోగాలు ఇవ్వలేదు. పదేండ్లలో ఆరున్నర లక్షల రేషన్‌కార్డులు ఇచ్చాం. ఉద్యోగులకు 73% జీతాలు పెంచాం. రైతులకు రూ.73 వేల కోట్ల రైతుబంధు అందజేశాం. మా ప్రభుత్వంలో చేసిన నియామకాలకు ఇప్పుడు ఉద్యోగ నియామక పత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నది. ఇలా ఇవ్వని ఉద్యోగాలను తామే ఇచ్చామని చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ అంశంపై రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు?

నమస్తే తెలంగాణ: నేటి తరాన్ని ఆకట్టుకొనేందుకు ఏం చేయబోతున్నారు?

కేటీఆర్: ఈ విషయంలో మాకు పూర్తి స్పష్టత ఉన్నది. కొందరికి కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం గురించి తెలియకపోవచ్చు. ఇంకొందరికి ఆయన అమలు చేసిన పథకాలపై అవగాహన లేకపోవచ్చు. మరికొందరికి ఆయన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ విధంగా ముందు కెళ్తున్నారనేది అవగతం కాకపోవచ్చు. మేం వీరందరికీ కేసీఆర్ నాయకత్వ పటిమ, పాలనాదక్షత గురించి వివరిస్తం. ఆయన పాలనలో చేపట్టిన రైతుబంధు, మిషన్ భగీరథ లాంటి పథకాలను వివరిస్తం. తెలంగాణ కోసం చేసిన పోరాటాలను విడమరిచి చెప్తాం. ఈ దిశగా పార్టీ విద్యార్థి, యువజన విభాగాలను పటిష్ఠం చేస్తం. తెలంగాణలోని నేటి యువత ముందు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అనే మూడు పార్టీలు కనబడుతున్నయ్. మేం ఆ రెండు జాతీయ పార్టీల కంటే ఏ విధంగా ప్రత్యేకమో, మాకు ఓటేయడం ద్వారా కలిగే ప్రయోజనాలేమిటో వివరించి వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించేందుకు చర్యలు చేపడతం.

నమస్తే తెలంగాణ: ఈ బహిరంగ సభ తర్వాత కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉంటారా?

కేటీఆర్: కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. ప్రతిరోజూ తనను కలవడానికి వచ్చే 50 నుంచి 100 మందితో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకుంటున్నారు. నిత్యం ప్రెస్‌మీట్‌లు పెడితేనే నాయకులు ప్రజల మధ్య ఉన్నట్టా? తన నియోజకవర్గంలోనే కేసీఆర్ ఉంటున్నారు కదా? ఢిల్లీ లేదా చెన్నైలో ఉండటం లేదు. హైదరాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో గజ్వేల్‌లో ఉంటున్నారు.



నమస్తే తెలంగాణ: రజతోత్సవ సభ ద్వారా ప్రజల్లోకి ఏ సందేశం తీసుకెళ్లనున్నారు?

కేటీఆర్: ఒక జాతీయ పార్టీని నమ్మి ఇప్పటికే మోసపోయాం. మరో ఢిల్లీ పార్టీని నమ్మితే భవిష్యత్తులో పూర్తిగా మోసపోతాం. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీ పార్టీలు. దొందూదొందే. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందినట్టు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా జరిగిందా? ఆ పార్టీ నాయకులు చెప్పాలి. మన ఇంటి పార్టీని, తెలంగాణ గొంతుకను ప్రజలు కాపాడుకోవాలి.

నమస్తే తెలంగాణ: ఉద్యమ పార్టీగా 14 ఏండ్లు, అధికార పార్టీగా పదేండ్లు, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. మూడు విభిన్న పరిస్థితులకు ఉన్న తేడా ఏమిటి?

కేటీఆర్: ఉద్యమ పార్టీగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం అనేకసార్లు పదవులను త్యజించినం. తెగించి కొట్లాడి గమ్యాన్ని ముద్దాడినం. ప్రజలు మా చిత్తశుద్ధిని గుర్తించి అధికారమిచ్చారు. గతంలో దేశంలో ఒక్క జార్ఖండ్ ముక్తి మోర్చాకు మాత్రమే ఈ ఘనత దక్కింది. ఆ తర్వాత బీఆర్ఎస్‌కే అవకాశం వచ్చింది. అధికారాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించినం. తొలినాళ్లలో ఎదురైన అనేక ఇక్కట్లను అధిగమించినం. ప్రజా సమస్యల పరిష్కారానికి దారి చూపినం. అన్ని రంగాల్లో అట్టడుగున ఉన్న రాష్ట్రాన్ని అన్నింటా ముందు నిలిపినం. తలసరి ఆదాయం, జీఎస్‌డీపీలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దినం. కాళేశ్వరంలాంటి మహత్తర ప్రాజెక్టు నిర్మించి గోదావరిని బీళ్లకు మళ్లించినం. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ మరింత బాధ్యతగా వ్యవహరిస్తున్నం. 17 నెలల్లో సర్కారు వైఫల్యాలను ఎత్తిచూపినం. ప్రజల పక్షాన పోరాడినం. హైడ్రా, మూసీ బాధితులకు అండగా నిలిచినం. హెచ్‌సీయూ, లగచర్ల వంటి అంశాల్లో బాధితులపక్షాన కొట్లాడినం. అందుకే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతున్నది. మళ్లీ అధికారంలోకి వస్తామనే ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నది.

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

కౌంట్‌డౌన్ 1

శనివారం SATURDAY 26.4.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+4 Pages: 16+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 321 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

కర్తవ్య దీక్షా సమయం

తెలంగాణ ప్రజల తోడు నీడగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 25 ఏండ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని, రజతోత్సవానికి సిద్ధమైన చరిత్రాత్మక సన్నివేశమిది. తెలంగాణ మేలు కోసం, తెలంగాణలో పుట్టి, తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా నిలిచి, పోరాడి గెలిచి, తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా అనితర సాధ్యమైన పరిపాలన సాగించి, తెలంగాణ పార్టీగా ఇంటింటికీ చేరి, 25 ఏండ్లుగా ప్రజల గుండె గుడిలో కొలువై, చెక్కు చెదరని రాజకీయ శక్తిగా నిలవడమనేది అనుకున్నంత ఆషామాషీగా, అంత అలవోకగా జరిగిందేమీ కాదు. బీఆర్ఎస్, దాని నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎదుర్కొన్నంత ప్రతికూలతను, అణచివేతను, దూషణను, ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారత చరిత్రలో మరే రాజకీయ పార్టీ లేదా దాని రథ సారథి ఎదుర్కొనలేదంటే అతిశయోక్తి కాదు. బీఆర్ఎస్ ఎట్ల పుట్టింది? ఉద్యమాన్ని కేసీఆర్ ఎంత వైవిధ్యంగా నడిపారు? ప్రత్యేక రాష్ట్రం ఎట్ల సాకారమైంది? పదేండ్లలో అద్భుతమైన ప్రగతి ఎట్ల సాధ్యమైంది? ఇదంతా మన కండ్ల ముందే జరిగిన మహత్తర చరిత్ర. మళ్లీ చెప్తే చర్విత చర్వణం! ఇప్పుడు మన ముందున్న సందేహం.. రజతోత్సవం కేవలం సంబురాల సమయమా? లేక అంతకుమించి ఇంకేమైనా ఉన్నదా?

ఒకప్పుడు ప్రత్యేక రాజ్యంగా ఉన్న తెలంగాణ, కాల ప్రవాహంలో ఒకానొక రాష్ట్రమై, తర్వాత కేవలం ఉప ప్రాంతమై ఉనికినే కోల్పోయే ఉత్పాతాన్ని ఎదుర్కొంటున్న ప్రమాదభరిత వాతావరణంలో కేసీఆర్ ఉద్యమ జెండాఎత్తుకున్నరు. తమిళనాడులో ద్రవిడ ఉద్యమాన్ని పరివ్యాప్తం చేసిన అన్నాదురై తరహాలో, అక్కడాఇక్కడా చెల్లాచెదురుగా ఉన్న తెలంగాణ భావజాలాన్ని ముద్దగా చేసి, అఖండ శక్తిగా మలిచారు. మూడు కోట్ల మంది ఆవేశాన్ని గుట్టుగా తన గుండెలో దాచుకుని, వారి ఆగ్రహాన్ని సభల్లోకి పొదిగి, వారి ఆక్రోశంలోకి తనకు తానై ఒదిగి, తెలంగాణ ఉక్రోషాన్ని ఉరకలెత్తే ఉపన్యాసంగా మార్చి, బతుకు బంధాలనే ఉద్యమ రూపాలుగా మలిచి, ఆటుపోట్లకు ఎదురునిలిచి, విజయ తీరంలో తెలంగాణను నిలిపిన తెగువ కేసీఆర్‌ది! బీఆర్ఎస్ రజతోత్సవం... ఓపికగా ఎత్తులకు పైఎత్తులు వేసి పోరాడే తత్వం మనలో ఇంకా ఉన్నదా? ఉడిగిపోయిందా? అని తరచిచూసుకునే సందర్భం.



తిగుళ్ల కృష్ణమూర్తి
సంపాదకుడు- నమస్తే తెలంగాణ

1969 ఉద్యమం అణగారిపోయిన తర్వాత, ఇక ఎప్పటికైనా తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించగల నాయకుడు వస్తాడా? అని ముక్కోటి దేహాలు ముప్పిరిగొన్న సందేహాలతో వెతుకుతున్న తరుణంలో, నేనున్నానంటూ వచ్చి, వెనుకబడిన వేదనలో నుంచి గులాబీ జెండాను రెపరెపలాడించి, తెలంగాణను ఊగించి, ఉరికించి, ప్రేమించి, శాసించి, గెలిపించిన నాయకుడు కేసీఆర్. బీఆర్ఎస్ ప్రస్థానం ప్రారంభమైన రోజు దేశంలోని అన్ని పార్టీలూ తెలంగాణకు వ్యతిరేకం. పద్నాలుగేండ్ల ఉద్యమం తర్వాత దేశంలోని దాదాపు అన్ని పార్టీలూ తెలంగాణకు అనుకూలం. పార్టీలైనా, వ్యవస్థలైనా, రాజకీయమైనా తెలంగాణకు అనుకూలంగా మారవలసిందే అనే అనివార్యతను సృష్టించిన వ్యూహకర్త కేసీఆర్. బీఆర్ఎస్ రజతోత్సవం... కేసీఆర్ నేర్పించిన వ్యూహ చతురత మనలో ఇంకా మిగిలి ఉన్నదా? ఉద్యమంతోనే మాయమైపోయిందా? అని ప్రశ్నించుకునే సందర్భం.

గుప్పెడు మందితో మొదలైన ఉద్యమాన్ని ఉప్పెనగా ఎలా మార్చవచ్చో చూపించిన నేర్పరి కేసీఆర్. ధన బలానికి జన బలంతో జవాబు ఎలా చెప్పాలో చూపించిన సాహసి కేసీఆర్. పెద్దగా వనరులు లేకున్నా వ్యూహం ఉంటే విజయం సాధ్యమేనని నిరూపించిన దార్శనికుడు కేసీఆర్. మాట, పాట, ఆటలతోనూ ఢిల్లీ కోటలను బద్దలు కొట్టి, కావాల్సిన ఫలితాన్ని గుంజుకోవచ్చని, కాటగల్సిన రాష్ట్రాన్ని మళ్లీ వెతికి పట్టుకోవచ్చని రుజువుచేసిన పోటుగాడు కేసీఆర్. కవులలో కవిగా, కళాకారుల్లో కళాకారుడిగా, పాత్రికేయుల్లో పాత్రికేయుడిగా, ఉద్యమకారుల్లో ఉద్యమకారుడిగా, నాయకుల్లో నాయకుడిగా కలిసిపోయి, గమనాన్ని వీడకుండా, గమ్యాన్ని మరువకుండా లక్ష్యాన్ని చేరడం ఎట్లాగో చూపిన చుక్కాని కేసీఆర్. బీఆర్ఎస్ రజతోత్సవం... కేసీఆర్ చూపించినవన్నీ కాకున్నా, కనీసం తెలంగాణవాదుల్లో తెలంగాణ వాదిగానైనా మనం ఉన్నామా? అని ఎవరికి వారుగా తేల్చుకునే సందర్భం.

ప్రజా సమూహంగా కలిసికట్టుగా కలబడినప్పుడల్లా తెలంగాణ ఎదురులేని విజయం సాధించింది. తడబడి విడిపోయిన ప్రతిసారీ విషమ స్థితిలోకి జారుకున్నది. తొందరపాటులో 'ఎవరు మన? ఎవరు పరాయి?' అని తేల్చుకోవడంలో తికమకపడ్డ అన్నిసార్లూ తెలంగాణ కకావికలమయ్యింది. 13 ఏండ్ల వీరోచిత ఉద్యమం, 10 ఏండ్ల వైభవోపేత పాలన తర్వాత కూడా తెలంగాణ ఇప్పుడు మళ్లీ చౌరస్తాలో నిలబడి, దిక్కులు చూడాల్సిన స్థితికి చేరుకున్నదంటే కారణం అదే. కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ కేవలం రాజకీయ పార్టీ కాదు. అది మూడున్నర కోట్ల మందిని ఒక్కతాటి మీదికి తెచ్చిన వేదిక. తెలంగాణ ప్రజలు తమను తాము పరిపాలించుకోవాలనే ఉమ్మడి ఆకాంక్షకు రాజకీయ వ్యక్తీకరణగా ఆవిర్భవించిన బీఆర్ఎస్‌ను మరిచి, కొత్త ముసుగులో వచ్చిన వలసవాదపు సుడిగాలిని నమ్ముకోవడం వల్లే తెలంగాణ ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకున్నది. బీఆర్ఎస్ రజతోత్సవం... ఈ పరీక్షా సమయం నుంచి బయటపడే దీక్షాదక్షత మనకు ఉన్నదా? లేదా? అని సమీక్షించుకునే సందర్భం.

మలిదశ ఉద్యమం మొదలైన 25 ఏండ్ల తర్వాత, రాష్ట్రం ఏర్పడిన 11 ఏండ్ల తర్వాత తెలంగాణ ఇప్పుడు మళ్లీ మొదటికొచ్చింది. పదేండ్ల వెలుగులో నుంచి జారిపోయి పద్నాలుగుకు ముందున్న చీకటిలో చిక్కుకున్నది. నిన్నటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేని ఇబ్బందిలో ఇరుక్కున్నది. అందులో తప్పెవరిది? ఒప్పెవరిది? అని తర్జనభర్జన పడాల్సిన తరుణం కాదిది. చేయగలిగినంత మంచి చేసిన కేసీఆర్ ఒకవైపు. చేయకూడనంత చెడు చేస్తున్న కాంగ్రెస్ మరోవైపు. కావాల్సింది సమీక్ష కాదు. 'బతుకులను కాలుస్తున్న, కూలుస్తున్న ఈ మలుపు నుంచి బయటపడటం ఎట్ల? కలుపు మొక్కలను ఏరేయడం ఎట్ల? రేపటి మన తెలంగాణను నిలబెట్టుకోవడం ఎట్ల?' అని మథనం చేయాల్సిన సమయమిది. బీఆర్ఎస్ రజతోత్సవం.. మన కర్తవ్య పరాయణతను కాచి వడబోస్తున్న సందర్భం.

'అన్నా కేసీఆర్ అన్నా! నువ్వు రావాలన్నా' అని పెడబొబ్బలు పెడితే దబ్బున అరుగు మీంచి లేచి రావడానికి ఇది ఉద్యమ సమయం కాదు. ప్రజాస్వామ్యం. రాజకీయాలు, ఓట్లు, సీట్లు, ఎన్నికలు, ప్రభుత్వాలు సవ్వశేరు నిబంధనలు, సవాలక్ష నిర్బంధాలు! కేసీఆర్ మళ్లీ మనకోసం మన దగ్గరకు రావాలంటే, ముందు మనం కేసీఆర్ దగ్గరికి పోవాలి. బీఆర్ఎస్ రజతోత్సవం... 2001లో పార్టీ పెట్టి పది నాళ్లు కాకముందే, కరీంనగర్ సింహగర్జనకు పిలిచినా పిల్వకున్నా, ఎడ్ల బండ్లు కట్టుకుని ఎగురుకుంటూ దుంకుకుంటూ పోయిన ఆప్యాయత మనలో ఇంకా మిగిలే ఉన్నదా? లేదా? అని తడిమి చూసుకునే సందర్భం.

ఇది తెలంగాణ మరోసారి దీక్ష బూనాల్సిన సమయం. 25 ఏండ్లలో మన కండ్ల ముందు ఏం జరిగిందో మననం చేసుకుని కదలాల్సిన సమయం. రైతుల కోసం చేసిన మంచిని, ఇచ్చిన పథకాలను తిరిగి తెచ్చుకునేందుకు పోరాడాల్సిన సమయం. నదీ జలాల్లో మరోసారి మన వాటా కొల్లగొట్టబడకుండా కాపాడుకోవాల్సిన సమయం. మన ఉమ్మడి ఆస్తి అయిన ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు ఒత్తిడి తేవాల్సిన సమయం. మన సొత్తుతో మనం కట్టుకున్న మన ప్రాజెక్టులు మళ్లీ వాడకంలో పెట్టేలా డిమాండ్ చేయాల్సిన సమయం. మన పల్లెను, పట్నాన్ని మళ్లీ గాడిన పెట్టేందుకు కర్రుగాల్చి వాతపెట్టాల్సిన సమయం. ఢిల్లీ గులాములకు వారి స్థానమేమిటో చూపించాల్సిన సమయం. దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి, 'బోడి మల్లన్నా' అని తెడ్డు చూపించేవాళ్లకు.. తిరగబడ్డ తెలంగాణ సరైన గుణపాఠం నేర్పిందిరా! అని దేశానికి చాటిచెప్పాల్సిన సమయం.

బీఆర్ఎస్ రజతోత్సవం.. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ తెర్లై పోతుంటే మనం చూస్తూ కూర్చుంటామా? అని తెగించి అడుగుతున్న సందర్భం. తెలంగాణ పరిరక్షణ కోసం మనం మరో ఉద్యమానికి సిద్ధులమై, సన్నద్ధులమై, కంకణ బద్ధులమై కదలగలమా? అని ఆరాతీస్తున్న సందర్భం. మన గుండెల్లో కేసీఆర్ నాటిన తెలంగాణ పోరాట పటిమ మిగిలే ఉన్నదా? అని నిలదీస్తున్న సందర్భం. ఒక సమాజంగా, సమూహంగా తెలంగాణ వాదులందరూ ఒక ప్రశ్న వేసుకోవాల్సిన సందర్భం..

మరో విముక్తి పోరాటానికి మనం సిద్ధంగా ఉన్నామా?

చలో వరంగల్!!





శుక్రవారం కశ్మీర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న ఆర్మీ చీఫ్.. సరిహద్దులో భారత భద్రతా బలగాలు

సరిహద్దులో ఉద్రిక్తత

ఎల్వోసీ వెంబడి కాల్పులకు తెగబడ్డ పాక్



పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- సమర్థంగా తిప్పికొట్టిన భారత సేనలు
- భారత్-పాక్ సరిహద్దులు మూసివేత
- కశ్మీర్ అంతటా బలగాల మోహరింపు
- పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు
- ఎల్వోసీకి భారీగా పాకిస్థాన్ బలగాలు
- అఫ్గాన్, బలూచ్ సరిహద్దుల నుంచి తరలింపు

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పులకు తెగబడగా, భారత సైనికులు సమర్థంగా తిప్పికొట్టారు. జమ్ముకశ్మీర్‌లో భారీగా బలగాలను మోహరించారు. ఉగ్రమూకలను ఏరివేసేందుకు ఇళ్లు, అడవులను జల్లెడ పడుతున్నారు. బందిపొరాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. మరోవైపు, పారామిలిటరీ బలగాలకు రక్షణ శాఖ సెలవులను రద్దు చేసింది. సెలవుల్లో ఉన్న వారు వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పాకిస్థాన్ జాతీయులను గుర్తించి, వెంటనే వారి స్వదేశానికి పంపించివేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదేశించారు. మరోవైపు పాకిస్థాన్ కూడా ఎల్వోసీ వెంబడి భారీగా సైనికులను మోహరిస్తున్నది. బలూచ్, అఫ్గాన్ సరిహద్దుల్లో మోహరించిన జవాన్లను కూడా ఎల్వోసీకి తరలిస్తున్నది.

› IV



బందిపొరాలో ఎన్‌కౌంటర్

లష్కరే టాప్ కమాండర్ హతం

› IV

ఉగ్రదాడి సిగ్గుచేటు!

- ఈ దాడితో పాకిస్థాన్ మన చెంపపై చాచి కొట్టింది
- ప్రకటనలు, ఊహా చిత్రాలతో సరిపెట్టడమేంటి?
- రిక్రూట్‌మెంట్ లేకపోవడంతోనే ఆర్మీ బలహీనం
- పహల్గాం ఉగ్రదాడికి నిఘా వైఫల్యమే కారణం
- బీజేపీ సర్కారుపై మాజీ ఆర్మీ చీఫ్‌ల మండిపాటు
- ఉగ్రవాదం అంతమైందన్నారు.. ఇదేంటి?: పవార్

› IV

మా దేశంలో ఉగ్రవాదులు ఉన్నది నిజమే

- వారికి నిధులు, శిక్షణ వాస్తవమే
- అమెరికా కోసమే ఈ చెత్త పనులు
- అంగీకరించిన పాక్ రక్షణ మంత్రి
- భారత్ దాడి చేస్తే, ఈ సారి పూర్తి యుద్ధమేనని వ్యాఖ్య

› IV

బీఎస్ఎఫ్ జవాన్ అప్పగింతకు పాక్ నిరాకరణ

- మూడో రోజూ జరగని చర్చలు
- తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని తండ్రి అభ్యర్థన

› IV

కాపీ పేస్ట్ నివేదిక!

అంతా ఊహాజనితం.. ఊకదంపుడే!

- వివరణలు, సూచనలు, కొత్త విషయాల్లేవ్
- కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ అసంబద్ధ నివేదిక
- విలువైన కాలం వృథా, ఇక మిగిలింది పది నెలలే
- రిపోర్టుపై రాష్ట్ర ఇంజినీర్లు, నిపుణుల అసహనం
- తాము చేసిన సూచనలే ఇచ్చారని అసంతృప్తి
- పరీక్షల నిర్వహణ ఇప్పట్లో అసాధ్యమని వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణకు సంబంధించి ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికపై రాష్ట్ర ఇంజినీర్లు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. పిల్లర్ కుంగడానికి స్పష్టమైన కారణాలను తెలపకుండా, సూచనలు చేయకుండా, ఊహాజనితమైన, అసంబద్ధమైన అంశాలనే ప్రస్తావించిందని కొట్టిపడేస్తున్నారు. మరమ్మతు పనులకు తాము ఎప్పుడో సూచించిన అంశాలనే మార్గదర్శకాల పేరిట జారీ చేశారు తప్ప అందులో కొత్తగా ఏమీ లేదని విమర్శిస్తున్నారు. అదీగాక విలువైన సమయాన్ని వృథా చేశారని, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నివేదిక విడుదల చేసి మరికొన్ని పరీక్షలను నిర్వహించాలని, పనులను పూర్తి చేయాలని ఆదేశించడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20 పిల్లర్ కుంగుబాటునకు గురైన వెంటనే రెండు రోజుల్లోనే ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్‌ఏ అధికారుల బృందం రాష్ట్రానికి విచ్చేసింది. వారం తిరగకముందే, ఎలాంటి పరీక్షలను నిర్వహించకుండానే బరాజ్

› 7వ పేజీలో




ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హులను ఎంపిక చేశారని ఎల్లక్కపేటలో కాంగ్రెస్ నేతను నిలదీస్తున్న మహిళలు

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వరా?

- పూరి గుడిసెలు, తాటాకు ఇండ్లలో ఉన్నోళ్లం అనర్హులమా?
- అశ్వారావుపేటలో అధికారులను నిలదీసిన నిరుపేదలు
- అర్హుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని
- జాతీయ రహదారిపై ఎల్లక్కపేటవాసుల రాస్తారోకో
- ఇల్లు మంజూరుకు రూ.10వేలు అడుగుతున్నరు
- ఎమ్మెల్యే వెంకట్రావుకు కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదు
- మాకు నచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తం
- మక్తల్‌లో అర్హులపై కాంగ్రెస్ నేత చిందులు

› 7

కార్మిక స్వేదంతో సమ్మిట్ సోకులు!



- కాలంచెల్లిన జీవోకు జీవం పోసి కార్మిక సంక్షేమ నిధి నుంచి రూ.300 కోట్లు డ్రా
- అదే సొమ్ములోంచి రూ.30 కోట్లు భారత్ సమ్మిట్ కోసం ఖర్చు చేస్తున్న సర్కారు
- సమగ్ర విచారణకు కార్మిక సంఘాల డిమాండ్
- 100 దేశాల ప్రతినిధులతో భారత్ సమ్మిట్ ప్రారంభమైనట్టు ప్రకటించిన నిర్వాహకులు
- ఏఐసీసీ ప్రతిపాదిత భారత్ సమ్మిట్‌ను నెత్తికెత్తుకున్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): కార్మిక సంక్షేమ నిధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదారిలో వినియోగిస్తున్నదా? కార్మికుల సంక్షేమం కోసమే వాడాల్సిన డబ్బును దారిమళ్లించి భారత్ సమ్మిట్ సదస్సు నిర్వహణ కోసం ఖర్చు పెడుతున్నదా? వివాహ కానుక పథకం కోసం కార్మికులు పెట్టుకున్న 600 అర్జీలను పక్కనపెట్టి మరీ సంక్షేమ నిధి నిధులను పక్కకు మళ్లించారా? ఒక్క రూపాయి కూడా పారిశ్రామిక పెట్టుబడులకు

› 7వ పేజీలో

హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

- క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను వెనక్కిపంపాలి
- యూనివర్సిటీ భూములను రిజిస్ట్రేషన్ చేయించాలి
- అకడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ నేతలు అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని కోరారు. వర్సిటీలోని విధానపరమైన నిర్ణయాలు, కార్యాచరణపై నిర్వహించే అకడమిక్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కార్ పర్యావరణ, జీవవైవిధ్య విధ్వంసానికి పాల్పడిందని సమావేశంలో విద్యార్థి నేతలు

› 7వ పేజీలో

వైద్యశాఖలో 'అబాస్' చిచ్చు

- ఫేస్ రికగ్నైజేషన్, జియోట్యాగింగ్‌పై వైద్యుల వ్యతిరేకత
- డాటాప్రైవసీకి విరుద్ధమైన విధానమంటూ మండిపాటు
- వైద్యుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం
- డుమ్మా కొట్టే డాక్టర్లకు చెక్‌పెట్టేందుకే అంటున్న సర్కారు

› 10

సరిహద్దుల్లో ఉద్రిక్తత

- ఎల్వోసీ వెంబడి కాల్పులకు తెగబడ్డ పాకిస్థాన్ సైన్యం
- సమర్థంగా తిప్పికొట్టిన భారత భద్రతా బలగాలు
- భారత్-పాకిస్థాన్ సరిహద్దులు మూసివేత
- కశ్మీరు అంతటా భారీగా బలగాల మోహరింపు
- పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం రాత్రి జమ్ముకశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్వోసీ) వెంబడి పాకిస్థాన్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. వీటిని భారత దళాలు సమర్థంగా తిప్పికొట్టాయి. అయితే ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదని సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశంలోని పారామిలిటరీ దళాలకు రక్షణ శాఖ సెలవులు రద్దు చేసింది. సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

సరిహద్దులు మూసివేత

జమ్ములోని సుచేత్‌గఢ్ వద్ద భారత్-పాకిస్థాన్ సరిహద్దును పౌరులకు మూసివేశారు. సుచేత్‌గఢ్‌లోని ఆక్ట్రాయ్ పోస్టు వద్ద పౌర కదలికలను సరిహద్దు భద్రతా సిబ్బంది(బీఎస్ఎఫ్) శుక్రవారం నిలిపివేసింది. పంజాబ్‌లోని భారత్-పాక్ సరిహద్దు వెంబడి ఉన్న అటారీ, హుస్సేనీవాలా, సడ్కీ వద్ద రిట్రీట్ కవాతులను రద్దు చేసినట్లు బీఎస్ఎఫ్ ప్రకటించిన నేపథ్యంలో సుచేత్‌గఢ్ వద్ద తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. సుచేత్‌గఢ్‌లో కూడా రిట్రీట్ కవాతు జరగడం సంప్రదాయంగా వస్తోంది. భారత అంతర్జాతీయ సరిహద్దు ఉత్తరాన జమ్ము నుంచి ప్రారంభమై పంజాబ్, రాజస్థాన్ మీదుగా పశ్చిమాన గుజరాత్ వరకు వెళుతుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమన్న భారత్ సంకల్పాన్ని తాజా పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయి.

జమ్ముకశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం

జమ్ముకశ్మీర్ పరిస్థితులపై చర్చించడానికి అన్ని సైనిక విభాగాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. జమ్ము కశ్మీరు వ్యాప్తంగా భద్రతా దళాలు మోహరించాయి. శ్రీనగర్‌లోని విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కశ్మీరులో పరిస్థితిని సమీక్షించేందుకు భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది శ్రీనగర్ చేరుకున్నారు.

సరిహద్దుల వద్ద పాక్ భారీగా బలగాలు

పహల్గాం ఉగ్ర దాడి దరిమిలా భారత్‌తో ఉద్రిక్తతలు తీవ్రతరమైన నేపథ్యంలో పాకిస్థాన్ సైన్యం శుక్రవారం గతన సిబ్బందికి ఇచ్చిన సెలవులను రద్దు చేసింది. రానున్న రోజుల్లో ఎవరికీ కొత్త సెలవులు మంజూరు చేయవద్దని సైనిక త్రివిధ దళాలకు చెందిన కమాండర్లను ఆదేశించింది. గతంలో అఫ్గానిస్థాన్, బలూచిస్థాన్‌కు సరిహద్దు భద్రతను నిర్వహించిన సైనిక సిబ్బందిని భారత్-పాకిస్థాన్ సరిహద్దు వద్ద పాక్ నియమించినట్లు కూడా వార్తలు వచ్చాయి. 10 కోర్ కమాండర్ పరిధిలోని భారత్-పాక్ వాస్తవాధీన రేఖ సమీపంలో గణనీయమైన సంఖ్యలో సైనిక సిబ్బందిని నియమించాలని బలూచిస్థాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో నియమించిన 11 కోర్, 12 కోర్‌కు చెందిన కమాండర్లను పాక్ సైన్యం ఆదేశించింది. భారత్ నుంచి చొరబాటు ఉండని కారణంగా గతంలో ఎన్నడూ వాస్తవాధీన రేఖ వెంబడి భారత్-పాక్ సరిహద్దు సైనిక బలగాలను పాక్ నియమించలేదు.

పహల్గాం నిందితుల కోసం వేట

పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన అనుమానిత ఉగ్రవాదులను చూశానని ఓ మహిళ చెప్పడంతో జమ్ము కశ్మీర్‌లోని కథువాలో శుక్రవారం ప్రత్యేక పోలీస్ బృందం గాలింపు చేపట్టింది. పుల్వామా, బారాముల్లాలోనూ అనుమానిత టెర్రరిస్టుల కోసం వేట కొనసాగుతున్నది. భారత వ్యతిరేక ఉగ్రవాద సంస్థగా ఆరోపణలున్న జేకేఎన్ఎఫ్ కార్యకలాపాలపైనా సోదాలు ప్రారంభమయ్యాయి. పట్టాన్‌లోని గులామ్ మొహమ్మద్ గనేయి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. అక్కడ లభించిన జేకేఎన్ఎఫ్ సామగ్రిని సీజ్ చేశారు.

సంయమనం పాటించండి

భారత్, పాక్‌కు ఐక్యరాజ్యసమితి పిలుపు

ఐక్యరాజ్యసమితి, ఏప్రిల్ 25: భారత్, పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితిని అత్యంత నిశితంగా పరిశీలిస్తున్నామని, రెండు దేశాలు పూర్తి సంయమనం పాటించాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గెటెరస్ కోరారు. పరిస్థితి మరింత దిగజార్చే చర్యలు చేపట్టవద్దని రెండు దేశాలకు విజ్ఞప్తి చేశారు. పెద్ద సంఖ్యలో పహల్గాం ఉగ్రదాడిని తాము ఖండిస్తున్నట్లు సెక్రటరీ జనరల్‌కు చెందిన అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు.

కశ్మీర్‌లోని స్థానికేతరులపై ఉగ్ర మూకల గురి!

నిఘా వర్గాల హెచ్చరిక

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి సృష్టించిన జ్వాలలు రగులుతుండగానే నిఘా వర్గాలు ఓ హెచ్చరిక చేశాయి. జమ్ముకశ్మీరులోని స్థానికేతరులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్), దాని అనుబంధ ఉగ్రవాద సంస్థలు దాడులు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. పర్యాటకులు, స్థానికేతరులు, కశ్మీరీ పండిట్లు, పోలీసులు, రైల్వే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. ముఖ్యంగా శ్రీనగర్, గందర్‌బల్ జిల్లాల్లో ఉన్నవారిపై, అదేవిధంగా, రైలు పట్టాలు, రైల్వే శాఖకు చెందిన నిర్మాణాలు వంటి వాటిపై దాడులు జరగవచ్చునని తెలిపాయి.



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. శ్రీనగర్‌లో స్థానికులతో మాట్లాడారు.

పాకిస్థానీయులను గుర్తించి.. పంపించేయండి

- అన్ని రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఆదేశాలు
- 14 రకాల వీసాల రద్దు
- గడువులోగా దేశాన్ని వీడాలని పాకిస్థానీయులకు నిర్దేశం



న్యూఢిల్లీ: పాకిస్థానీ జాతీయులందరినీ గుర్తించి వారిని వెంటనే వారి స్వదేశానికి పంపించివేయాలని కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలను కోరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అందరు ముఖ్యమంత్రులతో మాట్లాడినట్లు శుక్రవారం అధికార వర్గాలు వెల్లడించాయి. జమ్ముకశ్మీరులోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను బలిగొన్న ఉగ్రవాదుల పాశవిక దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఐదు అంచెల దౌత్యపరమైన ప్రతీకార చర్యలను చేపట్టిన భారత ప్రభుత్వం అందులో భాగంగా పాక్ జాతీయులకు చెందిన అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఏప్రిల్ 27 నుంచి వీసాలు రద్దవుతాయని విస్పష్ట ప్రకటన చేసిన భారత్ మెడికల్ వీసాలకు మాత్రం అదనంగా 48 గంటల గడువు ఇచ్చింది.

గడువులోగా దేశాన్ని వీడండి

పాకిస్థానీ జాతీయులకు జారీచేసిన 14 రకాల వీసాలను భారత ప్రభుత్వం శుక్రవారం రద్దు చేసింది. వీటిలో వ్యాపారం, సమావేశాలు, పర్యాటక, యాత్రలు, వైద్యం తదితర అంశాలకు చెందినవి ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులకు వీసాలను రద్దు చేసినట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

పాక్‌కు చుక్క నీటినీ వెళ్లనీయం

పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ నుంచి పాకిస్థాన్‌కు చుక్క నీటిని కూడా వెళ్లనీయమని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. ఉగ్రదాడి పరిణామాల నేపథ్యంలో హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ పలు ఆదేశాలను జారీ చేశారని, వాటిని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ తీసుకున్న చారిత్రక నిర్ణయం పూర్తి సమర్థనీయమైనదని ఆయన అన్నారు. కాగా, సింధూ జలాలు పాకిస్థాన్‌లోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలను భారత్ మొదలు పెట్టినట్టు సమాచారం.

లష్కరే టాప్ కమాండర్ హతం

బందిపొరాలో ఎన్‌కౌంటర్ ■ ఇద్దరు పోలీసులకు గాయాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్ర దాడి వెనుక ఉన్న సూత్రధారులను మట్టుబెట్టే ఆపరేషన్‌లో భారత్ తొలి విజయం సాధించింది. జమ్ము కశ్మీరులోని బందిపొరాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తాయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. 26 మంది పర్యాటకులను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడితో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న లష్కరే తాయిబా ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టాయి. బందిపొరాలో కొందరు ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందుకున్న భారత సైన్యం, జమ్ము కశ్మీరు పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదులు దాక్కుని ఉన్న ప్రదేశాన్ని చుట్టుముట్టారు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించడంతో ప్రతిగా భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల పోరులో ఓ సీనియర్ అధికారికి చెందిన వ్యక్తిగత భద్రతా బృందంలోని ఇద్దరు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. భద్రతా దళాల ఎదురుకాల్పులలో లష్కరే తాయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ మరణించాడు. బందిపొరాలోజరుగుతున్న ఆపరేషన్ గురించి శ్రీనగర్ చేరుకున్న ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి అధికారులు వివరించారు.

బలగాలకు టెర్రరిస్టుల ట్రాప్!

- ఇళ్లలో ఐఈడీలు పెట్టి యాక్టివేట్
- త్రుటిలో తప్పించుకున్న భద్రతా సిబ్బంది
- ఇద్దరు టెర్రరిస్టుల ఇళ్లు ధ్వంసం



అనంత్‌నాగ్ జిల్లాలో పేలుళ్లల్లో ధ్వంసమైన ఉగ్రవాది ఆదిల్ నివాసం

శ్రీనగర్, ఏప్రిల్ 25: ఉగ్రవాదులు పన్నిన ట్రాప్ నుంచి భద్రతా దళాలు త్రుటిలో తప్పించుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. పహల్గాం దాడిలో ఒక నిందితుడైన ఆసిఫ్ ఫౌజీ.. దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌లో ఉన్న తన ఇంటిని వెతుక్కుంటూ భద్రతా దళాలు వస్తాయని ఊహించి వారు రాగానే యాక్టివేట్ అయ్యేలా ఐఈడీలు ఉంచాడు. అతను ఊహించినట్టే ఇంటిని తనిఖీ చేయడానికి జమ్ముకశ్మీర్ పోలీసులు వెళ్లారు. వారు ఇంట్లోకి రాగానే పేలుడు పదార్థాలు యాక్టివ్ అయ్యాయి. ఇది గుర్తించిన పోలీసులు వెంటనే బయటకు వచ్చిన కాసేపటికే భారీగా పేలుళ్లు సంభవించాయి. మరో ఉగ్రవాది ఆదిల్ థోకర్ ఇంట్లో కూడా ఇలాగే బాంబు ద్వారా ట్రాప్ పెట్టినా పోలీసుల అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ఈ పేలుళ్లతో ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లు ధ్వంసమయ్యాయి.

జవాన్ అప్పగింతకు పాక్ నిరాకరణ

- *మూడో రోజూ జరగని చర్చలు*
- *తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని తండ్రి అభ్యర్థన*

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పొరపాటున పాకిస్థాన్ సరిహద్దుల్లోకి చొరబడిన బీఎస్ఎఫ్ జవాన్‌ను అప్పగించేందుకు పాకిస్థాన్ రేంజర్లు వరుసగా మూడవ రోజు నిరాకరించారు. ఆ జవాన్ ఆచూకీ చెప్పడానికి కూడా రేంజర్లు ఇష్టపడడం లేదని అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా వెంబడి ఉన్న ఓ పొలంలో బీఎస్ఎఫ్‌కు చెందిన జవాన్ కానిస్టేబుల్ పూర్ణం సాహును పాకిస్థాన్ రేంజర్లు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం పాక్ రేంజర్లను పలుమార్లు సంప్రదించి చర్చలను కోరినప్పటికీ అవతలి వైపు నుంచి ఇప్పటి వరకు సానుకూల స్పందన లేదు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో ఈ ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. జవాన్ విడుదల కోసం రేంజర్లతో ఫీల్డ్ కమాండర్ స్థాయి సమావేశం నిర్వహించాలని బీఎస్ఎఫ్ పాక్‌ను కోరుతూనే ఉందని వర్గాలు తెలిపాయి. సాహు క్షేమంగా తిరిగిరావాలని పశ్చిమ బెంగాల్ హుగ్లీలో నివసిస్తున్న అతని కుటుంబ సభ్యులు ప్రార్థిస్తున్నారు. తన కుమారుడు దేశానికి సేవ చేస్తున్నాడని, అతను క్షేమంగా ఉన్నాడో లేడో కూడా తమకు తెలియడం లేదని సాహు తండ్రి భోలానాథ్ సాహు తెలిపారు. అతను పాకిస్థానీ బందీగా ఉన్నట్లు తమకు తెలిసిందని ఆయన చెప్పారు. తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు.

పాక్‌లో ఉగ్రవాదులున్నది నిజమే

- వారికి నిధులు, శిక్షణ అందిస్తున్నది వాస్తవమే
- అమెరికా కోసమే ఈ చెత్త పనులన్నీ చేశాం
- అంగీకరించిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా
- భారత్ దాడి చేస్తే, ఈ సారి పూర్తి యుద్ధమేనని వ్యాఖ్య



ఇస్లామాబాద్, ఏప్రిల్ 25: తమ దేశంలో ఉగ్రవాదులు లేరంటూ ఇన్నాళ్లూ బుకాయిస్తూ వస్తున్న పాకిస్థాన్.. ఇప్పుడు అంతర్జాతీయ మీడియా సాక్షిగా యూటర్న్ తీసుకుంది. గత మూడు దశాబ్దాలపాటు ఉగ్రవాద సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ అందిస్తున్నది నిజమేనని అంగీకరించింది. ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. అయితే ఆ పాపానికి అమెరికా, పశ్చిమ దేశాలే కారణమని ఆరోపించారు. స్కైన్యూస్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి చేసిన ప్రకటనతో పాక్‌ను ఉగ్రదేశమని, ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నదని భారత్ చేస్తున్న ఆరోపణలు నిజమేనని మరోసారి రుజువైంది.

అమెరికా, పశ్చిమదేశాల కోసమే..

జమ్ముకశ్మీర్‌లోని పెహల్గాంలో టెర్రరిస్టు దాడిలో పరోక్షంగా పాకిస్థాన్‌దే బాధ్యత అని భారత్ ఇప్పటికే పేర్కొనగా, పహల్గాం దాడిని భారతే నాటకంగా తెరకెక్కించిందని ఖవాజా ఆరోపించారు. చాలాకాలంగా ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న చరిత్ర పాకిస్థాన్‌కు ఉంది కదా? అని జర్నలిస్టు యాల్డా హకీమ్ ప్రశ్నించగా, 'మేము ఈ పాడుపనిని గత మూడు దశాబ్దాలుగా అమెరికా, బ్రిటన్, ఇతర పశ్చిమ దేశాల కోసం చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. తాము ఇన్నాళ్లుగా చేసింది తప్పేనని ఆయన తెలిపారు. సోవియట్ యూనియన్, అఫ్గాన్‌లపై దండయాత్రలకు ఉగ్రవాదులను అమెరికా పావుగా వాడుకుందని ఆరోపించారు.

లష్కర్ తాయిబా ఉనికే లేదు

తమ దేశంలో లష్కరే తాయిబా సంస్థ ఉనికే లేదని మంత్రి స్పష్టం చేశారు. లష్కర్ అనేది పాత పేరని, ఇప్పుడది ఉనికిలోనే లేదని ఆయన పేర్కొన్నారు. 2019లో జరిగిన బాలాకోట్ తరహాలో పాకిస్థాన్‌పై భారత్ వైమానిక దాడి జరిపే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు, అలాంటి ప్రయత్నమే కనుక పునరావృతం అయితే ఈసారి పూర్తిస్థాయి యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. అయితే రెండు అణ్వాయుధ శక్తుల మధ్య ఘర్షణ ఎప్పుడూ ఆందోళనకరమైనదేనని మంత్రి ఆసిఫ్ అన్నారు.

పహల్గాం దాడిలో హమాస్ హస్తం?

పలుసార్లు పీవోకేను సందర్శించిన నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ టెర్రరిస్టులకే కాక మరికొందరి హస్తం కూడా ఉంచవచ్చునన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడి తరహాలోనే ఇప్పుడు పహల్గాంలో కూడా దాడి జరిగినట్టు పోలికలు కన్పించడంతో పాటు, గత ఏడాది కాలంలో హమాస్‌కు చెందిన పలువురు సీనియర్ నేతలు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను సందర్శించినట్టు వెలుగులోకి రావడంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన నివేదిక ప్రకారం జైషే మహమ్మద్ హెడ్‌క్వార్టర్స్ ఉన్న బహల్వపూర్‌ను హమాస్ బృందం ఇటీవల సందర్శించింది. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా పీవోకేలోని రావల్‌కోట్‌లో జరిగిన ర్యాలీలో హమాస్ నేతలు ప్రసంగించారు. ఎల్ఈటీ, జైషే మహ్మద్ నేతలు కూడా దీనికి హాజరయ్యారు. ఇవన్నీ చూస్తుంటే పహల్గాం దాడి విషయంలో వీరి హస్తం, సహకారం కూడా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉగ్రదాడి ఘటన.. సిగ్గుచేటు!

- ఈ దాడితో పాకిస్థాన్ మన చెంపపై చాచి కొట్టింది
- ప్రకటనలు, ఊహా చిత్రాలతో సరిపెట్టడమేంటి?
- రిక్రూట్‌మెంట్ లేకపోవడంతోనే ఆర్మీ బలహీనం
- పహల్గాం ఉగ్రదాడికి నిఘా వైఫల్యమే కారణం
- బీజేపీ సర్కారుపై మాజీ ఆర్మీ చీఫ్‌ల మండిపాటు
- ఉగ్రవాదం అంతమైందన్నారు.. ఇదేంటి?: పవార్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి ఘటనపై యావత్తు జాతి ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నది. 26 మంది అమాయకులను బలితీసుకొన్న ముష్కరులను శిక్షించాల్సిందేనంటూ సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టులు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పర్యాటకులకు కనీస భద్రతను కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యంపై కూడా పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడి ఘటన ఓ సిగ్గుచేటని, నిఘా వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందని మాజీ ఆర్మీ చీఫ్‌లు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని పరోక్షంగా తప్పుబడుతున్నారు. ఇంతటి ఘాతుకానికి తెగబడిన పాక్‌పై ఆంక్షల ప్రకటనలు, ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని మండిపడుతున్నారు.

రిక్రూట్‌మెంట్ కూడా లేదు



పహల్గాం ఉగ్రదాడి ఘటన మనకు నిజంగా సిగ్గుచేటు. ఈ ఘటనతో పాకిస్థాన్ మన చెంపపై చాచి కొట్టింది. పాక్ చర్యలను బట్టి చూస్తే.. మనతో యుద్ధానికి 'సై' అన్నట్టే కనిపిస్తున్నది. అయితే, ఉగ్ర దాడి ఘటనలో మనం అమాయకులను పోగొట్టుకొన్నాం. మరణాల ప్రకటనపై నాన్చివేత ధోరణి ప్రదర్శించడమెందుకు? ఇక, యూరి, పుల్వామా తర్వాత దీన్ని మనకు జరిగిన మరో పెద్ద అవమానంగానే భావించాలి. దీనికి బదులుగా మనం ఏం చేయాలి? కానీ, మనం ఏం చేశాం? పాక్‌పై ఏవో దౌత్యపరమైన ఆంక్షలు విధిస్తూ.. ఉగ్రవాదుల ఊహా చిత్రాలను విడుదల చేశాం. ఇది కరెక్టేనా? దేశ ప్రజలందరూ పాక్‌కు తగినరీతిలో బుద్ధి చెప్పాలని కోరుకొంటున్నారు. అదే జరగాలి. ఇక్కడ మరో విషయం మనం గుర్తించి తీరాలి. గడిచిన మూడేండ్లుగా సైన్యంలో రిక్రూట్‌మెంట్ నిలిచిపోయింది. 1.8 లక్షల పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో సైన్యంపై ఒత్తిడి పెరుగుతున్నది. రిక్రూట్‌మెంట్ నిలిచిపోవడంతో సైన్యం బలహీనపడింది కూడా. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉన్నది.

– మేజర్ జనరల్ (రిటైర్డ్) జీడీ బక్షీ



నిఘా వైఫల్యమే!

నిఘా వైఫల్యం వల్లే పహల్గాం ఉగ్రదాడి జరిగిందని నేను అనుకొంటున్నా. వైఫల్యానికి కారణమైన వాళ్లే జరిగిన పరిణామాలకు బాధ్యత వహించాలి. ఉగ్ర దాడికి పాకిస్థానే కారణం.పాక్‌పై దౌత్యపరమైన ఆంక్షలు సరిపోవు. ప్రతిఘటన ఉండాల్సిందే.

– మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ (రిటైర్డ్) శంకర్ చౌదరి



కశ్మీర్‌లో శాంతి తాత్కాలికమే

కశ్మీర్‌లో మొన్న ఎన్నికలు జరిగాయి. పర్యాటకుల సంఖ్య పెరిగింది. దీంతో కశ్మీర్‌లో శాంతి అనేది తాత్కాలికమే అని చూపించడానికే పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేశారు.

– ఈస్టర్న్ కమాండ్ మాజీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రాణా ప్రతాప్



తక్షణ చర్యలు అవసరం

కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. మరి, పహల్గాంలో ఉగ్రదాడి జరగడమేంటి? భద్రతాపరమైన లోపాల వల్లే ఈ దాడి జరిగింది. దిద్దుబాటు చర్యలు తీసుకోవడం ఇప్పుడు అత్యవసరం.

– ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్

మనమే 'పవర్' ఫుల్!

సైనిక, ఆయుధ సంపత్తిలో పాక్ కంటే భారత్ ముందంజ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు పూర్తిగా దిగజారాయి. ఒప్పందాల నిలిపివేత, పౌరుల గెంటివేత వంటి కఠిన నిర్ణయాలను ఇరు దేశాలూ తీసుకొన్నాయి. ఈ క్రమంలో భారత్-పాక్ మధ్య సైనిక చర్య ఉండొచ్చున్న ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో ఆయుధ సంపత్తి, సైన్యం పరంగా ఏ దేశం శక్తిమంతంగా ఉందన్నదానిపై చర్చ మొదలైంది. గ్లోబల్ ఫైర్ పవర్ 2025 నివేదిక ప్రకారం.. సైనిక శక్తి జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉండగా.. పాక్ 12వ స్థానానికి పరిమితమైంది. దీంతో ఆయుధ సంపత్తి, సైనిక శక్తి విషయంలో పాక్ కంటే భారత్ ఎంతో ముందంజలో ఉన్నట్టు అర్థమవుతున్నది.



గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంక్ — భారత్ 4



గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంక్ — పాక్ 12


	భారత్	పాక్
రక్షణ బడ్జెట్	రూ. 6.8 లక్షల కోట్లు	రూ. 2.2 లక్షల కోట్లు
సైనికులు	51,37,550	16,55,000
యుద్ధ ట్యాంకులు	4,201	2,627
సాయుధ వాహనాలు	1,48,594	49,530



ఎయిర్‌ఫోర్స్



	భారత్	పాక్
మొత్తం విమానాలు	2,229	1,399
ఫైటర్ జెట్స్	513	328
ఏరియల్ ట్యాంకర్స్	6	4
హెలికాప్టర్స్	899	373
అణ్వస్త్ర క్షిపణులు	180	170



నావికా దళం

	భారత్	పాక్
యుద్ధ నౌకలు	293	121
జలాంతర్గాములు	18	8

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శనివారం SATURDAY 26.4.2025

హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+4 Pages: 16+4

సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 321 ॥ వెల (Price) రూ.6.50

త్రయోదశి

శనివారం, సూర్యోదయం: 5-53, సూర్యాస్తమయం: 6-35. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: త్రయోదశి ఉదయం 8-28 వరకు, తదుపరి చతుర్దశి. నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉదయం 6-27 వరకు, తదుపరి రేవతి తెల్లవారుజామున 3-38 వరకు. వర్జ్యం: సాయంత్రం 5-01 నుంచి సాయంత్రం 6-26 వరకు. రాహుకాలం: ఉదయం 9-03 నుంచి ఉదయం 10-38 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-53 నుంచి ఉదయం 6-44 వరకు. అమృతకాలం: రాత్రి 1-31 నుంచి రాత్రి 2-56 వరకు. శని త్రయోదశి.



కౌంట్‌డౌన్ 1



ఇస్రో మాజీ చైర్మన్

కస్తూరి రంగన్ కన్నుమూత

వృద్ధాప్య సమస్యలతో బెంగళూరులో మృతి

రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి సంతాపం

› 7



తూప్రాన్ ఆటోడ్రైవర్

కన్నుమూత

ఉపాధి కరువై వారం క్రితం గడ్డి మందు తాగిన బాబు

సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో కన్నుమూత › 7

రేవంత్‌దే బాధ్యత అని యూనియన్ నేతల ఆగ్రహం

ఇప్పటికే రాలిన మట్టిపూలు **484**

పంట చేతికి రాక.. అప్పులు తీర్చలేక

గడ్డి మందు తాగి పత్తి రైతు ఆత్మహత్య

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్లారంలో విషాదం › 7

ఓరుగల్లులో గులాబీ హోరే

పయనమవుతున్న పల్లె-పట్నం.. కనీవినీ ఎరుగని రీతిలో రజతోత్సవ సభ.. దశ-దిశ చూపించేలా కేసీఆర్ సందేశం



అయ్యా కేసీఆర్.. మళ్లా నువ్వే రావాలి...

మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్‌లో బీఆర్‌ఎస్ సభ వాల్ పోస్టర్‌లో ఉన్న కేసీఆర్ చిత్రపటానికి దండం పెడుతున్న వృద్ధురాలు చిన్న పోశమ్మ

ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- కేసీఆర్ ప్రసంగం కోసం ప్రజల ఎదురుచూపులు
- కాళేశ్వరంపై కమిషన్ నివేదికలంటూ లీకులు
- ఫిరాయింపుదారులను మళ్లీ పార్టీలోకి తీసుకుంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలను అవమానించినట్టే..
- దేశవ్యాప్తంగా మోదీ, బీజేపీ ప్రభ తగ్గుతున్నది
- పహల్గాంను రాజకీయానికి వాడుకోవడం నీచం
- మేం స్పిరిచువల్లీ హిందూ.. పొలిటికల్లీ కాదు
- ఒక జాతీయ పార్టీని నమ్మి ఇప్పటికే మోసపోయినం
- మరో ఢిల్లీ పార్టీని నమ్మితే పూర్తిగా మోసపోతం: కేటీఆర్

1300 ఎకరాల్లో ఏర్పాట్లు

సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సభ

1500 మంది వలంటీర్లు

3000 అందుబాటులో బస్సులు

25 టోయింగ్ వెహికిల్స్

10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు రెడీ

ఉద్యమ పార్టీగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం అనేకసార్లు పదవులను త్యజించినం. తెగించి కొట్లాడి గమ్యాన్ని ముద్దాడినం. అన్ని రంగాల్లో అట్టడుగున ఉన్న రాష్ట్రాన్ని అన్నింటా ముందు నిలిపినం. కాళేశ్వరంలాంటి మహత్తర ప్రాజెక్టు నిర్మించి గోదావరి నీళ్లను బీళ్లకు మళ్లించినం. 17 నెలల కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎత్తిచూపినం. ప్రజల పక్షాన పోరాడినం. హైడ్రా, మూసీ బాధితులకు అండగా నిలిచినం. హెచ్‌సీయూ, లగచర్ల వంటి అంశాల్లో బాధితుల పక్షాన కొట్లాడినం. అందుకే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతున్నది. మళ్లీ అధికారంలోకి వస్తామనే ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నది. - కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న పండుగలా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహించి చరిత్ర సృష్టిస్తాం. సభ కోసం కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసినం. తెలంగాణ ఇంటి పార్టీ నిర్వహిస్తున్న జనజాతరకు పెద్ద ఎత్తున తెలంగాణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పిలుపునిచ్చారు. ఈ సభలో కేసీఆర్ చేసే ప్రసంగం కోసం యావత్ తెలంగాణ సమాజం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నదని చెప్పారు. దేశ చరిత్రలో నిలిచిపోయేలా సభలను నిర్వహించడంలో బీఆర్‌ఎస్, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఇప్పటికే పేరున్నదని, ఇప్పుడు మరో చారిత్రక సభను వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో నిర్వహించబో › 2వ పేజీలో




చలో వరంగల్
మహేష్ బిగాల
తన్నీరు మహేష్
ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో జరిగే
బహిరంగ సభకు లక్షలాదిగా తరలుదాం
తన చేతనమే చేతలై ధిక్కార బావుటాను ఎగురవేసిన ఉక్కుపిడికిలి కేసీఆర్ !
ఆరున్నర దశాబ్దాల ఆరాటాన్ని పోరాటంగా మలచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కార్య సాధకుడు కేసీఆర్ !
సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని గులాబి పాలనలో నందనవనంలా తీర్చిదిద్దింది బీఆర్ఎస్ !
అప్పుడైనా.. ఇప్పుడైనా ఇకముందు అయినా తెలంగాణకు నలుదిక్కుల రక్షణవలయం బీఆర్ఎస్ యే !
రెండున్నర దశాబ్దాలుగా జనం గుండెల్లో గూడుకట్టుకున్నది గులాబి జెండా ఆ గులాబి జెండా ఆవిర్భావ సంబురం...
గుండెగుండె పరవశించే పరిమిళం ఎల్కతుర్తికి ఎదురేగి తెలంగాణ జాతర చేద్దాం...
మరోసారి తెలంగాణ సోయి చాటుదాం అమరులని స్మరించుకుందాం
జై తెలంగాణ.. జై కేసీఆర్.. జైజై తెలంగాణ
రవి దన్నపునేని
డా. ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి
రఘురాం వేనేపల్లి
పిన్న భాస్కర్ గుప్తా
సక్రు నాయక్
వెంగల్ జలగం
చందు తాళ్ళ
లోంకలపల్లి కిశోర్‌రెడ్డి
పెండ్యాల అనిల్ రావు
రాము దొనికన
శ్రీనివాస్ సురభి
అరవింద్ తక్కెళ్లపల్లి
నరసింహా నాగులవంచ
రజినికాంత్ కొసనం
BHARAT RASHTRA SAMITHI - USA
భారత రాష్ట్ర సమితి - అమెరికా



నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA



శనివారం SATURDAY 26.4.2025

హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+4 Pages: 16+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 321 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com
/ntdailyonline